# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

నవంబర్
2023

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 16 **సంచిక:** 11

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి: **సాయినాథ్**

డిజైన్: **రమేష్**



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| శీలం సర్వత్ర వైధనమ్ | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| కార్తీక సోమవార వ్రతం | 18 |
| సిద్ధి బుద్ధి ప్రదే దేవీ మహాలక్ష్మీ నమోస్తుతే | 22 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 25 |
| అమ్మ కథలు | 30 |
| భీమశంకర జ్యోతిర్లింగ క్షేత్ర ఆవిర్భావం | 32 |
| రామాయణ రత్నాకరం | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 41 |
| శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము | 45 |
| ముకుందమాల | 49 |
| తిరుమల సర్వస్వం | 53 |
| నామం సైజు తగ్గిస్తే స్వామివారికి ఆగ్రహం వస్తుందా? | 57 |
| తిరుమలలో చూడవలసిన ప్రదేశాలు | 59 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


సంపాదకీయం...

# భగవంతుని తృప్తే ప్రధానం

భగవంతుని కృప పొందుటకు శరణాగతి, ప్రపత్తి ఉత్తమమైన మార్గాలు. నేను శక్తిహీనుణ్ణి, నా వల్ల ఏమీకాదు అని, భగవంతునికి దాసోహం అని ప్రార్థిస్తూ ఆయనను ఆశ్రయించుట శరణాగతి. ఇక నేను నీ వాడిని, నన్ను లోక కళ్యాణానికై నీ ఇష్టం వచ్చినట్లు వాడుకోమని చెప్పుచూ మన వ్యక్తిత్వమును కోల్పోయి జీవించుట ప్రపత్తి. ఈ రెండు ఒకదానికొకటి అత్యంత దగ్గరి సంబంధం ఉన్న విషయాలు. మనం మనకోసం కాకుండా, భగవంతుని కోసం జీవించుట ఉత్తమమైన విధానం. భగవంతుణ్ణి తృప్తి పరచుటయే మన ఏకైక లక్ష్యం అయి ఉండాలి. దీనికి భగవంతుడి సేవనే లభించాల్సిన పని లేదు. భగవంతుడికి ఇష్టం ఉన్న ప్రతి విషయాన్ని ఆసక్తిగా చేస్తుంటే సరిపోతుంది. ఆయనకు ఇష్టం లేని ఏ చిన్న పనిని చేయకుండా ఉంటే సరి. మన సంతోషం కంటే ఇతరులు సంతోషించే విధంగా జీవించువారు ధన్యులు.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు పూర్ణుడు. ఆయన సర్వశక్తిమంతుడు. సర్వశాస్త్ర పారంగతుడు. ఆయన నుండే సర్వమూ ఉద్భవించింది. అలాంటి వ్యక్తికి గురువు అవసరమా? మరి అతడు శ్రీ రామానుజాచార్యుల వారిని తన గురువుగా స్వీకరించాడు. తనకు శంఖు చక్రములను ప్రసాదించేటట్లు చేశాడు. ఫలితంగా శ్రీ రామానుజాచార్యులు స్వామివారికి గురువైనారు. స్వామివారు కూడా శ్రీ రామానుజాచార్యులను తన గురువుగా తగిన మర్యాద ఇచ్చారు. కారణం ఒక్కటే! శ్రీమాన్ రామానుజాచార్యులు తనకోసం జీవించలేదు. భక్తులకోసం, లోకం కోసం జీవించారు. అందరికీ భగవంతుని కృప లభించి ధన్యులు కావాలనే ఏకైక లక్ష్యంతో జీవించారు. ఆయన వద్ద స్వార్థం ఎంతమాత్రం లేదు. ఎంతమంది ఆయన ద్వారా భగవంతుని కృపకు పాత్రులౌతారో అంత సంతోషించేవారు. పూర్వం తనకు విద్య నేర్పి, మంత్రోపదేశం చేసిన వారి గురువు, మంత్రోపదేశ సమయంలో దీనిని యోగ్యులైనవారికి కాకుండా అన్యులకు చెబితే నరకానికి పోతావు అని చెప్పారట. మరియు ఈ మంత్రోపదేశం పొందినవారు భగవంతుని కృపకు పాత్రులై స్వర్గానికి పోతారని కూడా చెప్పారట. ఈ మంత్రాన్ని పొందిన రామానుజాచార్యుల వారు, వారి ఊరి జనాన్ని ఒక ఆలయం వద్ద పోగుచేసి, ఆయన ఆలయం పైకి ఎక్కి అందరికీ వినిపించేటట్లు మహామంత్రాన్ని అందరికీ చెప్పాడట. దీనికి కోపోద్రిక్తుడైన వారి గురువులు వీరిని అసహ్యించుకున్నారట. నరకానికి పోదువన్నారట. కాని రామానుజాచార్యులు మాత్రం తాను ఒక్కడు నరకానికి పోవుట వలన కొన్ని వేలమంది ఈ మహామంత్రాన్ని జపించి స్వర్గానికి పోవుచున్నారని వారి గురువుతో చెప్పారట. దీనితో వారి గురువులు ప్రసన్నులై వారికి అంబేరుమానార్ అనే బిరుదు కూడా ఇచ్చారట. ఇంతటి ప్రపత్తి, భగవంతుని కృప అందరికీ లభించాలనే బలమైన తృష్ణ ఉన్న వ్యక్తి కాబట్టే శ్రీవేంకటేశ్వరుడు ఆయనను తన గురువుగా స్వీకరించాడట. శ్రీవేంకటేశ్వరుడే శ్రీ రామానుజాచార్యులను తన గురువుగా స్వీకరించారు కాబట్టి భవిష్యత్తులో అందరూ రామానుజాచార్యులను గురువుగా స్వీకరించి భగవంతుని కృపను పొందాలని శ్రీవారి సంకల్పం. అందుకే అలా చేశాడు. కాబట్టి నేడు ఈ భూమిపై జీవించుచున్న వ్యక్తులు తమ కోసం కాకుండా, భగవంతుని కోసం, ఆయన భక్తుల కోసం, భగవంతుని ఆశయ సాధన కోసం జీవించువారు ధన్యులు. వీరు భగవంతునికి మొదటి శ్రేణి భక్తులుగా పరిగణించబడుదురు.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో

చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:________________________
________________________
చిరునామా:________________________
________________________
________________________
________________________
________________________
పిన్‌కోడ్:________________________
చందా వివరాలు:________________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో॥ఈషత్ప్రఫుల్ల సరసీరుహ నారికేళ**
**పూగద్రుమాది సుమనోహర పాలికానాం**
**ఆవాతి మంద మనిల స్సహ దివ్య గంధైః**
**శేషాద్రి శేఖర విభో! తవ సుప్రభాతమ్ ॥**

తాత్పర్యం : శ్రీవేంకటేశా! ఉదయకాలమున మందవాయువులు తామరపూల నుండి, టెంకాయ, పోక మొదలగు వృక్షముల అరవిరిసిన పూల గుత్తుల నుండి సువాసనలను గ్రహించి మనోహరముగా వీచుచున్నవి. స్వామీ నీకు శుభోదయమగు గాక!


**శ్లో॥ఉన్మీల్య నేత్రయుగ ముత్తమ పంజరస్థా**
**పాత్రావశిష్ట కదళీఫల పాయసాని ।**
**భుక్త్వా సలీల మథ కేళి శుకాః పఠంతి**
**శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥**

తాత్పర్యం – శ్రీవేంకటేశా! నీ ఆలయములో పెంచబడుచున్న శుకములు (చిలుకలు) నీవు రాత్రి ఆహారముగా స్వీకరించగా మిగిలిన అరటిపండ్లు, పాయసమును భుజించి నీ నామ సంకీర్తన చేయుచున్నవి. నీకు శుభోదయమగు గాక!

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము





## భూపాలం

ఇప్పుడిటు కలగంటి – నెల్లలోకములకు
నప్పఁడగు తిరువేంక – టాద్రీశుఁగంటి ||పల్లవి||

1. అతిశయంబైన శే – షాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపుర – ప్రభలు గంటి
శతకోటి సూర్యతే – జములు వెలుఁగఁగఁగంటి
చతురాస్యుఁ బొడగంటి – చయ్యన మేల్కంటి|| ఇప్ప ||
2. కనకరత్నకవాట – కాంతు లిరుగడఁ గంటి
ఘనమైన దీప సం – ఘములు గంటి,
అనుపమ మణీమయ – మ్మగు కిరీటము గంటి
కనకాంబరము గంటి – గ్రక్కన మేల్కంటి ||ఇప్ప||
3. అరుదైన శంఖ చ – క్రాదు లిరుగడఁ గంటి
సరిలేని యభయహ – స్తము గంటిని,
తిరువేంకటాచలా – ధిపుని జూడఁగఁ గంటి
హరిఁ గంటి గురుఁగంటి – నంతట మేల్కంటి|| ఇప్ప ||



భావము : ఇప్పుడు ఈ విధముగా నేనొక కల గంటిని. ఆ కలలో సమస్త లోకములకు తండ్రి యైన శ్రీ వేంకటాచల ప్రభువును జూచితిని.

మహా మహిమతో గూడిన శేషశైలము యొక్క శిఖరమును చూచితిని. సాటిలేని అచటి గోపురకాంతులు చూచితిని. నూరుకోట్ల సూర్యుల ప్రకాశము లొక్కుమ్మడి ప్రకాశించుచుండగా జూచితిని. చతుర్ముఖ బ్రహ్మను చూచితిని. వెంటనే నిద్రనుండి మేల్కొంటిని.

ఇరుప్రక్కల రత్నములు దాపిన బంగారు తలుపుల కాంతులు చూచితిని. గొప్పవైన అనేక దీపములు చూచితిని. సాటిలేని మణులతో నిర్మింపబడిన దేవుని కిరీటమును చూచితిని. ఆ దేవుడు దాల్చిన కాంచన వస్త్రమును చూచితిని. ఆ క్షణముననే మేల్కొంటిని.

ఆ దేవుని కిరువైపుల అరుదైన శంఖ చక్రాదులను చూచితిని. తులలేని అభయ హస్తమును చూచితిని. శ్రీ వేంకటాచలాధీశ్వరుని చూచు భాగ్యమునకు నోచితిని. శ్రీహరిని గంటిని. ఆచార్యుని గనుగొంటిని. వెను వెంటనే మేల్కొంటిని.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



సద్గుణములలో సర్వోత్తమమైనది శీలము. అత్యంత మహిమాన్వితమైనది శీలము. ముల్లోకములను జయింపగల శక్తిని ప్రసాదిస్తుంది శీలము. విదేశములందు విద్య, విపత్కర సమయమునందు సద్బుద్ధి తోడు ఉండునట్లు ఇహ పర లోకములందు అండగా ఉండి సంరక్షించునది శీలము అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

# శీలం సర్వత్ర వైధనమ్

- చిల్లర సీతారామారావు

## శ్లో ॥ "విదేశేషు ధనం విద్యా వ్యసనేషు ధనః మతిః
## పరలోకే ధనం ధర్మః శీలం సర్వత్ర వైధనమ్"

అత్యంత మహత్తర మైన శీల సంపద వలననే మాంధాతృ చక్రవర్తి, జనమేజయుడు, నాభాగుడు పృథ్విని తమ స్వాధీనము లోనికి తెచ్చుకొని ప్రజానురంజకముగా పరిపాలించి ప్రఖ్యాతి గడించారు. పృథ్విని స్వాధీనము లోనికి తెచ్చుకోవడానికి మాంధాతృ చక్రవర్తికి ఒక దినము, జనమేజయునకు మూడు దినములు, నాభాగునకు ఏడు దినముల సమయము పట్టినదని మహాభారతము పేర్కొన్నది.

శీలము అను శబ్దమునకు నిఘంటుకారుడు మంచి నడవడిక, మంచి నీతి, మంచి స్వభావము, మంచి అందము అను అర్థములను పేర్కొన్నాడు. శీల శబ్దమునకు మహాభారత నిర్వచనము ఇలా ఉంది.

**శ్లో ॥ "అద్రోహః సర్వభూతేషు కర్మణా మనసా గిరా**
**అనుగ్రహశ్చ దానంచ శీలమేతత్ ప్రశస్యతే"**

మనసా వాచా కర్మణా ఏ ప్రాణికీ ద్రోహము తలపెట్టకుండా ఉండటము అందరి యెడల ప్రేమాదరములు కలిగి ఉండటము, శక్త్యానుసారము దానములు చేయడము మున్నగు గుణములు ఉండుటను శీలము అని అంటారు. ఇటువంటి శీలము కలిగిన వారినే అందరూ ప్రశంసిస్తుంటారు. నీతి, నిజాయితీ, మంచి నడవడిక మున్నగు సద్గుణములు గలవారు శీలవంతులు అని పిలువబడతారు. ధర్మానికి ప్రతిరూపమే శీలము అని పెద్దలు చెబుతుంటారు.

ప్రతి వ్యక్తి భార్యా పుత్రాదులు, మిత్రులు మున్నగు వారితో ఆనందమయమైన జీవితమును గడపాలని ఆశిస్తాడు. ''సౌఖ్య వస్తువులను సంపాదించడానికి తన మేధస్సుతో ఆలోచించి, బలము, జనము, జ్ఞానము మున్నగు వాటిని ఉపయోగించుకుంటాడు''. ఆ ప్రయత్నాలు నీతి, నిజాయితీలతో కూడినవయితే శ్రేష్ఠఫలము కన్పిస్తుంది. ఎందువలననంటే నీతి నిజాయితీ అనునవి శీల సంపదలోని సాధనములే. మేధావంతుడను, బలవంతుడను అను గర్వముతో అవినీతికి పాల్పడితే చివరకు పతనము, అవమానము ఎదుర్కొనే

పరిస్థితి ఏర్పడుతుంది. శీలరహితులు సిరిసంపదలు కలిగి దానధ ర్మములు గావిస్తూ ఉన్నప్పటికీ పడగమీద మణి కల్గిన సర్పమును త్యజించినట్లు వారిని త్యజించాలి.

శీలమునకు రెండు భాగాలు ఉన్నాయి. మొదటిది నమ్రత. రెండవది సహిష్ణుత. మొదటిది మహత్త్వమునకు ప్రతీక. రెండవది మానవత్వానికి ప్రతీక. వినయము, అణకువ, మంచి నడవడి, మంచిగుణం, సత్ప్రవర్తన మున్నగు గుణాలు నమ్రత విభాగానికి వస్తాయి. వినయము విద్య ద్వారా లభిస్తుంది. విద్య ద్వారా లభించు వినయము యోగ్యతను కల్గిస్తుంది. యోగ్యత వలన ఐహిక సంపద ప్రాప్తిస్తుంది. అట్టి సంపద వలన ధర్మము, ధర్మము వలన సుఖము, ఆనందము ప్రాప్తిస్తాయి అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "విద్యా దదాతి వినయం వినయాత్ యాతి పాత్రతామ్**
**పాత్ర త్వాత్ ధనమాప్నోతి ధనాధర్మం తతః సుఖమ్"**

విద్య, వినయముల ద్వారా పేరు ప్రఖ్యాతులను, ఉన్నత పదవులను ఆర్జించడానికి అవకాశముంటుంది. దానధర్మాలు చేయడం ద్వారా ఐహిక సుఖాన్ని, ఆనందాన్ని పొందడమే గాకుండా అత్యున్నతమైన మోక్ష సామ్రాజ్యాన్ని పొందడానికి కూడా అవకాశముంటుంది. పరమత సహనము, పరహిత ధర్మము, పరుల ఉన్నతిని కోరుకోవడం మున్నగు మహత్తర గుణాలు సహిష్ణుతా విభాగానికి చెందినవి. శీల రహిత కారణముగా రాక్షస రాజు రావణుడు తన పరివారమును, తన రాజ్యమును నశింప చేసుకున్నాడు. శీలసహితుడైన విభీషణుడు తన వినయ విధేయతలతో శ్రీరాముడిని శరణువేడి యుద్ధానంతరము లంకకు రాజై ప్రజాను రంజకముగా లంక రాజ్యమును పరిపాలించాడు.

సకల సంపదల కన్నా శీల సంపద మిన్న. శీల సంపద కల్గినవారికి మహదైశ్వర్యములు కరతలామలకాలు. శీలము వ్యక్తికి ఆభూషణము. ప్రాణాధారము. ఉత్తమమైన శీలసంపద ద్వారానే శిబి మున్నగువారు అజరులు, అమరులు అయ్యారు. శీలము, శౌర్యము, చురుకుదనము, పాండిత్యము, స్నేహభావము అను ఈ అయిదు గుణములు అక్షయనిధులు అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "శీలం శౌర్యమనాలస్యం పాండిత్యం మిత్ర సంగ్రహః**
**అచోరహరణీయాని పంచైతావ్యక్తయోనిధిః"**

శీలము, శౌర్యము, చురుకుదనము, పాండిత్యము, స్నేహశీలత ఈ అయిదూ దొంగలపాలు గాని అక్షయనిధులు.

శీల మహత్వమును వర్ణిస్తూ నారదుడు ప్రహ్లాదుడి కథను వర్ణించాడు. పూర్వము దైత్యరాజు ప్రహ్లాదుడు తన శీల సంపద శ్రేష్ఠసంపద వలన దేవేంద్రుడి రాజ్యముతో సహా ముల్లోకములను



జయించాడు. రాజ్యమును కోల్పోయిన దేవేంద్రుడు తేజోవిహీనుడయ్యాడు. ఖిన్నుడై బృహస్పతిని దర్శించుకొని – ఆచార్యా! నేను రాజ్యభ్రష్టుడనై విలపిస్తున్నాను. నాకు మేలైన జ్ఞానమును బోధించండి అని అడిగాడు. బృహస్పతి దేవేంద్రుడి ప్రార్థనను మన్నించి మోక్ష సంబంధమైన, ఉత్కృష్టమైన జ్ఞానమును బోధించాడు. ఇంతకంటే విశేషమైన జ్ఞానమున్నదా? యని ప్రశ్నించాడు దేవేంద్రుడు. నీవు ఇంకా విశేష జ్ఞానమును వాంఛించు వాడవైతే వెంటనే వెళ్ళి శుక్రాచార్యులవారిని కలువుము అని బృహస్పతి దేవేంద్రుని పంపించివేశాడు. దేవేంద్రుడు శుక్రాచార్యులను దర్శించుకొని ప్రణమిల్లాడు. శుక్రాచార్యులవారు శ్రేష్ఠమైన మోక్షమును తెలియచేశారు. ఇంతకంటెను మేలైనది కలదా? అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. ప్రహ్లాదుడి దగ్గర విశేషమైన జ్ఞాన సంపద కలదు. నీవు వెళ్ళి అతడిని దర్శించుకొనుము అని పంపించి వేశారు శుక్రాచార్యులవారు.

దేవేంద్రుడు విప్రవేషధారియై ప్రహ్లాదుడిని దర్శించుకొని వందనమాచరించాడు. పిదప రాజా! నేను మీ దగ్గర శ్రేయమును గురించి వినవలెనన్న కాంక్షతో మీ దగ్గరికి వచ్చాను. దయచేసి నాకు శ్రేయమును బోధించండి అని అడిగాడు. ముల్లోకముల రాజ్యవ్యవస్థను పర్యవేక్షిస్తున్నాను. అందువలన ప్రస్తుతము మీకు బోధించలేను అని ప్రహ్లాదుడు జవాబిచ్చాడు. రాజా! మీకు తగిన సమయము లభించినప్పుడే నాకు శ్రేయమును బోధించండి అని ప్రత్యుత్తరమిచ్చి శిష్యుడిగా చేరి నిరంతరం పరిచర్యలు చేయసాగాడు. విప్రవేషధారియైన దేవేంద్రుడి పరిచర్యలకు సంతోషించాడు ప్రహ్లాదుడు. ఇష్టాగోష్ఠుల యందు, సరస సల్లాపముల యందు స్థానము కల్పించి ఆదరించాడు. ఒకనాడు సరస సల్లాపముల యందు సందర్భాన్ని పురస్కరించుకొని దేవేంద్రుడు ప్రహ్లాదుడిని అడిగాడు.


రాజా! మీరు శ్రేష్ఠులు. త్రిలోకముల ఆధిపత్యమును సాధించిన విధానమును తెలియజేయగలరని కోరుకుంటున్నాను అన్నాడు. దేవేంద్రుడి ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రహ్లాదుడు – విప్రవర్యా!

నేను గొప్ప చక్రవర్తినని ఏనాడు అహంకరించలేదు. నన్ను కరుణించి శుక్రాచార్యులవారు ఉపదేశించిన నీతులను శ్రద్ధగా విని వాటిని ఆచరణలో పెట్టాను. విప్రోత్తములను ఆదరించి గౌరవించి సత్కరించి ధన ధాన్యములతో వారిని సత్కరించాను. వారి అభినందనలను దీవెనలను అందుకున్నాను. అందుకుంటాను. నా సౌశీల్యమే నన్ను గొప్పవాడిని చేసింది. ధర్మప్రకారము నడుచుకుంటున్నాను. ఇంద్రియముల మీద విజయం సాధించాను అని పలుకగా విప్రవేషధారి దేవేంద్రుడు ఇలా అన్నాడు. రాజా!

**శ్లో ॥ "యది రాజన్ ప్రపన్నస్త్వం మమ చేదిచ్ఛసి ప్రియమ్**
**భవతః శీలమిచ్ఛామి ప్రాప్తు మేషవరోమమ"**

ఒకవేళ నీకు నామీద ప్రసన్నత ఏర్పడినట్లయితే, నాకు శుభమును కలిగించవలెనన్న కాంక్ష ఉన్నట్లయితే మహత్తరమైన నీ శీలమును నాకు ప్రసాదించి నన్ను ధన్యుడిని చేయుము అన్నాడు. విప్రవర్యుడి కోరిక ప్రహ్లాదుడికి భయము కల్గించింది. ఇతడెవరో కాని సామాన్యుడు కాడు. విప్రుడును కాదు అనుకుంటూ కోరిక కోరిన విప్రుడి వదనమును పరికించాడు. విప్రుడి దైన్యవదనమును గాంచిన ప్రహ్లాదుడు విప్రుడు కోరిన వరమును సంకోచించకుండా దానము గావించాడు. వరప్రసాదముగా శీలసంపదను సాధించుకున్న దేవేంద్రుడు స్వర్గ లోకమునకు వెళ్ళిపోయాడు.

దేవేంద్రుడు స్వర్గలోకమునకు వెళ్ళిపోగానే ప్రహ్లాదుడి శరీరము నుండి తేజోమయుడైన పురుషుడు వెలువడి స్వర్గలోకము వైపు పయనమవ్వసాగాడు. అది గమనించిన ప్రహ్లాదుడు తేజోమయ శరీరమును నీవు ఎవ్వరు? అని ప్రశ్నించాడు. ఆ పురుషుడు నేను శీలమును. నీవు నన్ను విప్రునకు దానము ఇచ్చావు కనుక నిన్ను విడిచి అతని దగ్గరకు వెళుతున్నాను అని పలికి వెళ్ళిపోయాడు. తరువాత ధర్మము వెళ్ళసాగింది. ప్రహ్లాదుడు ప్రశ్నించిన పిమ్మట ఆ పురుషుడు శీలము ఉన్నచోటనే నేను ఉంటాను అని పలికి ధర్మపురుషుడు వెళ్ళిపోయాడు. సత్యపురుషుడు ప్రహ్లాదుడి మేని నుండి వెళ్ళిపోతుండగా ప్రహ్లాదుడు ప్రశ్నించాడు. ప్రహ్లాదుడి ప్రశ్నకు సమాధానమిస్తూ నేను సత్యమును. ధర్మము, శీలము ఎక్కడ ఉంటాయో అక్కడ నేను ఉంటాను అని పలికి సత్యపురుషుడు వెళ్ళిపోయాడు. అటు తరువాత వృత్తము అను పురుషుడిని గమనించి నీవు ఎవరవు అని అడుగగా నేను వృత్త పురుషుడను. ధర్మము, సత్యము ఉండుచోట నేను ఉంటాను అని పలికి అదృశ్యమైపోయాడు వృత్త పురుషుడు. అతడు వెళ్ళిపోతూనే ఒక పెను నాదము ప్రహ్లాదుడి శరీరము నుండి వెలువడి వెళ్ళిపోతుండగా ప్రహ్లాదుడు నీవు ఎవరవు? అని ప్రశ్నించాడు. వృత్తము ఉండుచోట నేనుంటాను. నా పేరు బలము అని పలికి వెళ్ళిపోయాడు బలపురుషుడు. తదనంతరము గొప్ప కాంతులను విరజిమ్ముతూ నొక దేవి అతని శరీరము నుండి వెలువడి వెళ్ళసాగింది. ప్రహ్లాదుడు ప్రశ్నించగా ఆ దేవి సమాధానమిస్తూ రాజా! నేను ఐశ్వర్య లక్ష్మిని. నేను బలము ఉన్నచోటనే ఉంటాను అన్నది. ఆమె సమాధానము విని ప్రహ్లాదుడు తిరిగి ఆమెను ప్రశ్నించాడు. దేవీ! దయచేసి నాకు ఒక సందేహమున్నది దానిని తీర్చుము. అనన్యమైన వినయ విధేయతలతో నాకు శుశ్రూషలు గావించిన విప్రవర్యుడు ఎవరు? ప్రహ్లాదుడి ప్రశ్నకు సమాధానమిస్తూ – ప్రహ్లాదా! ఆ విప్రుడు స్వర్గలోకాధిపతి దేవేంద్రుడు. త్రిలోకములందు వ్యాపించి యున్న నీ మహదైశ్వర్యము లను సంగ్రహించుకోవలెనన్న దురాశతో నీ దగ్గర విప్రుడిగా చేరి నిన్ను మెప్పించి నీ శీలమును దానరూపముగా గ్రహించాడు. శీలమును గురించి నీవు శ్రద్ధ తీసుకొనలేదు. శీలము అనగా మంచి నడవడి. మంచి నడవడి యందు ధర్మము నిలిచి ఉంటుంది. ధర్మము నుండి సత్యము జనిస్తుంది. సత్యవ్రతమే సదాచారము. సదాచారము వలన సద్బుద్ధి కలుగుతుంది. సద్బుద్ధి వలన ఐశ్వర్య లక్ష్మి ప్రాప్తిస్తుంది. కనుక జ్ఞప్తియందుంచుకొనుము. సమస్త విషయములకు మూలాధారము సచ్ఛీలము. ఇందులో ఏమాత్రమూ సంశయము చెందవలసిన పనిలేదు అని పలికి ఐశ్వర్యలక్ష్మి వెళ్ళిపోయింది.



ప్రహ్లాదుడు మహత్తరమైన తన సచ్ఛీలము ద్వారా త్రిలోకాధిపత్యమును సంపాదించుకున్నాడు. తన సచ్ఛీలమును దానము చేసి శౌర్యాన్ని, రాజ్యలక్ష్మిని, అధికారాన్ని, వైభవాన్ని కోల్పోయినాడు. ఇంద్రుడు పదవీచ్యుతుడైనప్పటికీ వంచనతో ప్రహ్లాదుడి శీలమును వరముగా పొంది పూర్వవైభవమును సంపాదించుకోగలిగాడు. కనుక శీలము మహిమాన్వితమైనది. శీలము ద్వారా సమస్తమును సాధించుకొనవచ్చును. శీలమునకు ప్రాధాన్యత నివ్వకపోతే సర్వమూ భ్రష్టమైపోతుంది.



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ


**8వ భాగము**

## తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 8వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి 2003 నుండి జూన్ 2003)



## నమో వేంకటేశాయ రథ సంకల్పం

తేది 17-02-2003 : ఈ రోజు ఉదయం 3.0 గంటలకు మేల్కున్నాను. స్వామివారి సేవ గురించి ఆలోచించాను. నేను ప్రతి సం॥ 7కోట్ల జపములను సమర్పించాలి, అందులో కనీసం 70వేల మంది భాగస్వాములు కావాలి, వారి కోర్కెలను తీర్చుమని స్వామివారిని ప్రార్థించాలి. కాని ఈసారి మొత్తం 70,300 జపపుస్తకములను ప్రింటుచేయించాను. ఒక పుస్తకములో1200 నామాలు వ్రాయవచ్చు. కాని కొందరు ఒకటి కంటే ఎక్కువ పుస్తకములు వ్రాస్తున్నారు. కావున జపసంఖ్య 7 కోట్ల కంటే ఎక్కువ అగుచున్నప్పటికి భక్తుల సంఖ్య మాత్రం 70 వేల కంటే తగ్గుచున్నదని గ్రహించాను. శ్రీవేంకటేశ్వరుని దీనంగ ప్రార్థించాను. ఓడిపోతున్నానని దుఃఖిస్తూ దారి చూపమన్నాను. నా కళ్ళ నుండి నీరు పటపట రాలాయి. వెంటనే స్వామి కృపతో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఒక రథం తయారుచేయాలని, ప్రతి జపసమర్పణ సమయము కంటే కనీసం 11 రోజుల ముందు ఈ రథమును హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్ళాలనుకున్నాను. శ్రీవేంకటేశ్వరున్ని స్మరింపచేసి, భక్తులు వారి వారి కోరికలను మనస్సులోనే కోరుకున్న తరువాత, స్వామి మహామంత్రాన్ని ఒక పేపరు పైన వ్రాయించి రథంలో వేయించుచు తిరుపతి చేరాలనే ఆలోచన కలిగింది. ఈ విధంగ సులభంగ 70 వేల మంది భక్తుల సంఖ్యను పూరింపవచ్చుననే చక్కని ఆలోచన వచ్చింది. తరువాత ఈ రథం ఏవిధంగ ఉండాలనే విషయం గురించి ఆలోచించాను. స్వామివారి ప్రేరణతో

ఈ రథం తిరుపతిలోని 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము' యొక్క బ్రాస్ నమూనాను 'నమో వేంకటేశాయ' పేరుతో అత్యంత సుందరంగ భారీస్థాయిలో నిర్మించాలనే భావం కలిగింది.

మరోప్రక్క తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలలను చూడక చాల రోజులు అయ్యింది. స్వామివారిని, ఆయన లీలలను చూడాలని తపించిపోయాను. ఒకసారి మాత్రం స్వామివారి దర్శనార్థం తిరుమల ఆలయంలోనికి వెళ్ళినట్లు మహాద్వారం దాటిన పిదప పక్కకు పోయినటుల కల కన్నాను. కాని స్వామివారిని చూడలేదు. ఎన్నోసార్లు స్వామివారిని కనబడమని వేడుకున్నప్పుడు తప్పక ఈరోజు కనబడగలరనే నమ్మకము కలుగుతుంది కాని క న బడలేదు. అయినప్పటికీ నాసేవకు కావలసిన ప్రేరణను మాత్రం ఎప్పటికప్పుడు కలిగిస్తూనే ఉన్నారు. చివరికి నేను ఇలా భావించుకున్నాను. స్వామివారు మొత్తం ఈ సృష్టిని నడిపించాలి, ఆ య నకు ఎన్నో పనులుంటవి, సమయం దొరికినప్పుడు వారే నన్ను కటాక్షించుదురు కాబట్టి వారిని ఇబ్బంది పెట్టకూడదని భావించి క్షమించమని వేడుకున్నాను. వెంటనే స్వామివారు క్షమించినట్లు అనుభూతి పొందాను.

ఈ జపసమర్పణ ఒక్క సేవతో నేను సంతృప్తి చెందలేదు. దీనితో పాటు ఎన్నో రకాల స్వామివారి సేవలను ప్రారంభించాలనిపించింది. పుణ్యనదుల నీటితో స్వామివారి అభిషేకము తరువాత కళ్యాణాలు జరిపించాలనే కోరిక కలిగింది. కొన్ని వందల జంటలను భాగస్వాములు చేయాలని, అందరికి స్వామివారి కృపాకటాక్షములు లభించే విధంగ చేయాలనిపించింది. స్వామివారిని ఎన్నో ప్రాంతాలకు తీసుకెళ్ళి అత్యంత వైభవంగ భక్తులచే సేవింపచేయుచు, భక్తులకు స్వామివారి ఆశీర్వాదములు అందించే విధంగ చేయాలనిపించింది. ప్రతి కార్యక్రమము నా ఆధ్వర్యములో జరగాలనిపించింది. ఒకరకంగ నేను టి.టి.డి ఈ.ఓ పాత్ర పోషించాలనిపించింది. ఇంతవరకు ఎవ్వరూ చేయని రీతిలో అత్యంత వైభవంగ స్వామివారి సేవలను నా తనివితీర చేయాలనిపించింది. నా కారణంగ ఎంత మంది భక్తులకు స్వామివారి కృపాకటాక్షాలు లభించునో అది నా సేవక సామర్థ్యానికి నిదర్శనంగ ఎంచుకోవాలనిపించింది. చివరికి అప్పటి నా శక్తి సరిపోదని నాకు మరింత శక్తిని ప్రసాదించి ఈ సేవలను నాచే జరిపించుమని స్వామివారిని వేడుకున్నాను.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయమును చెప్పుచున్నాను. స్వామి వారు తన సేవలను ప్రసాదించు సమయాన కేవలం నా కుటుంబ పోషణార్థమే వ్యాపారం చేయుటకు అనుమతించారు. కాని తరువాత రోజులలో నేను ఈ విషయాన్ని పూర్తిగ మరిచి పోయాను. వ్యాపారాభివృద్ధికి ఎంతో ప్రయత్నించాను. దీనితో స్వామివారు నాకు తెలియకుండానే ఫిబ్రవరి 2003 నుండి ఆర్థిక నష్టం కలుగునట్లు చేయసాగారు.

## శ్రీవేంకటేశ్వర సేవాసమితిని ఏర్పరచుట

గతంలో అనుకున్నట్లు తేది 28-02-2003 నాడు మా ఆడిటర్ శ్రీమాన్ జనార్ధన్ రావుగారి వద్ద 'శ్రీవేంకటేశ్వర సేవా సమితి' అనే ట్రస్టును వ్రాయించాను. నేను, నా భార్య సురేఖ మరియు మా అమ్మ పుల్లగూర్ల రుక్కమ్మలు సభ్యులుగా ఈ ట్రస్టు ఏర్పడింది. ఈ ట్రస్టు ద్వార శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని సేవలను దీని క్రింద ఏర్పాటు చేసుకోవచ్చునని మా అడిటర్‌గారు చెప్పారు. దీనిని తేది 09-03-2003 నాడు నెం. 66/2003తో రిజిస్ట్రేషన్ చేయించాము. ఈ ట్రస్టు క్రింద ప్రతి సం॥ము ఇన్‌కం టాక్స్‌ని సమర్పించాలని భావించాను. ఈ రోజు ఒక కల కన్నాను.

కల : ఈ కలలో నేను, నా భార్య కలిసి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుటకు ఒక ఆలయంకు వెళ్ళాము. సమయం దాటిన కారణంగ ఆలయంలోపల ఎవ్వరులేరు. కాని నేను స్వామివారి దర్శనము లేనిదే వెళ్ళనని అనుకున్నాను. స్వామివారిని చూడాలనే తపనచే నేనొక్కడినే తలుపులు తీసుకొని లోనికి ప్రవేశించాను. లోన వెతికాను స్వామివారు కనబడలేదు. పైకి వెళ్ళాను అక్కడ పురాతన భవనం ఒకటి ఉన్నది. దానికి రాయితో కట్టిన మెట్లు ఉన్నవి. అత్యంత ఆత్రుతచే త్వరత్వరగ మెట్లు ఎక్కాను కాని స్వామివారు కనబడలేదు. చివరికి నిరాశతో వెనుతిరిగాను. ఇది కల. ఇది స్వామివారిని చూడాలనే నా తపనను, ఆర్తిని తెలుపుచున్నదని భావించాను.

నేను శ్రీవేంకటేశ్వర స్వామివారికి భక్తుడను సేవకుడను అనే మాట వాస్తవం. కాని కొన్ని సందర్భాలలో పట్టుపట్టేవాన్ని. నామాటే నెగ్గాలనే పట్టుదల అధికంగ ఉండేది. కాని ఈ విషయాన్ని స్వామివారితో నేరుగ చెప్పేవాన్ని కాదు, ధైర్యము చాలక నాలో నేనే మదనపడేవాడిని. శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నా హృదయాంతరంగంలో ఉన్న కోరికను గ్రహించేవారు. నేను అత్యంత మదనపడిన తరువాత నా మనసులోని కోరికకు అనుగుణంగ అనుగ్రహించేవారు. అప్పుడు నా ఆనందం అంతా ఇంతా కాదు ఆకాశమంత ఉండేది తబ్బిబ్బై పోయేవాడిని. ఈ విధంగ ఎన్నోసార్లు అనుగ్రహించారు. అలాంటిది ఇప్పుడొకటి జరిగింది.

## స్వామివారిపై నమ్మకము లేనందుకు దండించుట

తేది 15-11-2002 కార్తిక ఏకాదశి నుండి ఉచిత




**స్వామి వారి పై నమ్మకము లేనందుకు కొట్టుట**

జపపుస్తకము లను భక్తులకు పంచుచు 7 కోట్ల జపమును వ్రాయిస్తున్నాను. దీనిని 16 సం॥ ల వరకు ప్రతి సం॥ము చేయుదునని ఒక సంకల్పము తీసుకొన్నాను. గతంలో ఈ విషయం నలుగురికి తెలియాలనే ఉద్దేశ్యముతో నా సంకల్పమును మరియు రెండు జపపుస్తకములను టి.టి.డి ఇ.ఒ తో పాటు మరికొంత మందికి పంపాను. ఈ మొదటి ఏడు కోట్ల జప సమర్పణ ఒక ప్రత్యేక పద్ధతిలో చేయాలనిపించింది. ఒకరకంగ స్వామివారి అనుగ్రహము ఈ సేవలో ఏవిధంగ ఉందో చూడాలనిపించింది. అది ఎలా అంటే, ఈ మొదటి ఏడుకోట్ల జపంను ఏడుకొండలవాడికి ఏడు నెలల్లో సమర్పించాలి. మరియు ఈ సమర్పణ తేది స్వయంగ స్వామివారి నుండి నాకు అందాలి. అంటే స్వయంగ స్వామివారే నన్ను ఈ తేదినాడు సమర్పించుమని ఆదేశించాలి అనే భావం నా మనస్సులో బలంగ నిండుకుంది. కాని దీనిని నా స్వామివారికి చెప్పలేదు. నాలో నేనే ఇలా అయితే బాగుండునని అనుకున్నాను. ఒకసారి డా॥ కొండారెడ్డి గారితో మాటల సందర్భంగ చెప్పాను. అంటే 15-11-2002 నుండి 15-06-2003 లోపల ఈ ప్రథమ ఏడుకోట్ల జప సమర్పణ జరుగాలి. అప్పుడే నాకు తృప్తి అని, స్వామివారి అనుగ్రహము ఈ సేవలో నిండుగ ఉన్నదని భావించుదునని అనుకున్నాను.నా వైపునుండి మాత్రం జపపుస్తక వితరణ అత్యంత సంతృప్తికరంగ జరుగుచున్నది. 15-03-2003 వరకు 69,400 జపపుస్తకములను పంచాము. ఇంకా 900 జపపుస్తకములే పంచాల్సి ఉంది. వీటిని పంచగలననే నమ్మకము ఉంది. కాని వ్రాసినవి 5,000 మాత్రమే వచ్చాయి. వ్రాసిన జపపుస్తకములను తిరిగి నా వద్దకు చేర్చుట నాచేతిలో లేని విషయము కాబట్టి స్వామివారిని తీవ్రంగ ప్రార్థిస్థున్నాను. నిరాశ చెందాను సహాయము చేయమని వేడుకుంటున్నాను. తిరుమలగిరి ఆలయంలో, మరో దగ్గర ఇలా స్వామివారిని వేడుకుంటున్నాను. వ్రాసిన జపపుస్తకములను పంపుమని ప్రార్థిస్థున్నాను, మరియు జప సమర్పణ సమయాన పూజ ఏవిధంగ చేయాలి, ఎవ్వరిని పిలువాలి, ఏం మాట్లాడాలి ఇలా రకరకాల ప్రశ్నలు వేధిస్తున్నవి. వీటన్నింటికీ జవాబు కోరుతు ప్రార్థిస్తున్నాను. ముఖ్యంగా ఏడు నెలల్లో 7 కోట్ల జపసమర్పణ చేయగలనా? వ్రాసిన పుస్తకాలను సేకరించగలనా? అనే భయము నన్ను తీవ్రంగా వెంటాడుతుంది. ఒక్కొక్కసారి ఓడిపోతాననే భయముచే వణుకుచున్నాను. నా మానసిక స్థితికి తగినట్లు ఈ సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కని లీలను చూపాడు. ఆ లీల ఈవిధంగ ఉంది.

16-03-2003 : కల : అది ఒక పెద్ద మైదానము. దాని ఒక చివర ఒక పొడుగాటి గోడ ఉంది. దీని ముందు మైదానము వైపు రెండడుగుల ఎత్తుతో 30' × 20' సైజుగల ఒక స్టేజి ఉంది. ఈ స్టేజి మధ్యలో గోడకు రెండు రెక్కలు కలిగిన డోరు ఒకటుంది. ఈ డోరు నుండి బయటకు వెళ్ళిన తరువాత అంటే ఆ గోడ వెనుక భాగమున కూడ పెద్ద స్థలమే (30' × 20') కలదు. ఈ డోరు మూసినచో ఎవ్వరు వెనుకకు పోలేరు. నేను స్టేజిపై తలుపుల మధ్యలో రెండు చేతులతో రెండు తలుపురెక్కలను పట్టుకొని ఉన్నాను. నాముందర దాదాపు వంద అడుగుల దూరమున 300 మంది వరకు జనాలు ఉన్నారు. బహుశా అప్పటికే నేను స్వామి విషయంలో ఏదో పొరపాటు చేసాను. ఆ స్టేజి ముందు ఉన్న జనాలకు నాపై విపరీతమైన కోపముంది. నన్ను కొట్టాలనుకుంటున్నారు. అందులో కొందరు కట్టెతుపాకి పట్టుకొని ఉన్నారు. మరికొందరు నన్ను చూచి రాళ్ళతో, టమాటలతో మరియు తుపాకితో దూరము నుండి కొట్టుచున్నారు. ఆ తుపాకి గుళ్ళు తాకి నేను చనిపోతాననే భయము నాలో లేదు కాని దెబ్బ తగులుననే భయముతో ఈ విధంగ అంటున్నాను. "ఇగో నన్ను కొట్టకండి. నాకు స్వామిపై పూర్తి విశ్వాసము ఉంది. మీరు కొట్టితే బాగుండదు" అని తెలంగాణ యాసలో అనుచు రెండు చేతులలోని తలుపురెక్కలను సగము వరకు, రాళ్ళు నాకు తగులకుండు విధముగ మూయుచున్నాను. రాళ్ళు నాకు తగులుతలేవు. కాని ఈ జనాలకు నాపై ఎంతో కోపముంది. ఎలాగైన నన్ను దండించాలని దృఢనిశ్చయముతో ఉన్నట్లు గ్రహించాను. ఈవిధంగ కొంతసేపైన తరువాత ఒకవ్యక్తి ఆ గుంపులోనుండి నన్ను పట్టుకొనుటకు ప్రక్కగ నాకు కనబడకుండునటుల వస్తున్నాడు. దీనిని గమనించిన నేను భయముచే ఒక అడుగు

లోనికి వేసి తలుపులను మూసివేశాను. అప్పుడు ఆ తలుపులు చిన్నగుండవెల్లి గ్రామములోని మాఇంటి తలుపులే అని గ్రహించాను. ఈ తలుపులను బిగించి పైగొళ్ళెమును తలుపులు రాకుండు విధంగ పెట్టాను. కాని ఆ గొళ్ళెము అంత సేఫ్ అనిపించలేదు. వెంటనే భయముతో తలుపుల వెనుక గోడలో ఉన్న కట్టెబేడమును పెట్టాను. (ఇది మా ఇంటికి ఉన్న కట్టె బేడమే) ఈ కట్టె బేడము చాల దృఢమైంది కాబట్టి వారు ఇక లోనికి రాలేరని గ్రహించాను. అక్కడనే వెనుక బట్టలు పరచి ఉన్న మంచముపై పడుకున్నాను. అమ్మయ్య అనుకుంటు నిట్టూర్చాను. ఇది కల.

నాకు స్వామిపై పూర్తి విశ్వాసము లేదు, నీవు పూర్తి విశ్వాసమును పెట్టాలని సూచించే విధంగ ఈ కల వచ్చింది. స్వామివారికి శతకోటి నమస్కారములను సమర్పించాను. స్వామివారిపై పూర్తి విశ్వాసము లేనందుకు నాకు నేను సిగ్గుపడ్డాను. పూర్తి విశ్వాసం పెట్టుటకు ప్రయత్నించాను.

05-04-2003 : ఈ రోజు వరకు కేవలం 11,000 జపపుస్తకములే తిరిగి వచ్చాయి. ఐనప్పటికీ గతంలో స్వామివారు చూపిన లీలావిశేషం చేత నేను చింతించలేదు. ఇప్పుడు ఒక రెండు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాను.

## భక్తులకు సేవాభాగ్యం కల్పించుట

(1) జప సమర్పణ సమయము వరకు ఎన్ని జపపుస్తకములు తిరిగి వస్తే వాటినే ఆ సం॥పు ఏడుకోట్ల జపముగ సమర్పించాలి. తిరుపతిలో మాత్రం మొత్తం జపానికి, రానివాటికి, వచ్చినవాటికి కలిపి ప్రార్థన చేసి సమర్పించాలి.

(2) వచ్చే 2వ పర్యాయంగ ఏడుకోట్ల జపపుస్తకముల ప్రారంభ సమయంలో భక్తులకు, ముఖ్యంగ సాధకులకు కొన్ని నియమాలను ఏర్పాటు చేసాను.

స్వామిసేవ చేయదలచిన ప్రతి భక్తుడు, నేను ప్రతిజ్ఞ తీసుకొన్నట్లుగ వారిని కూడ వారి శక్త్యానుసారము, ఇష్టమునన్ని సం॥లు ఇష్టమునన్ని జపపుస్తకములను వితరణ చేసి, తిరిగి వాటిని సేకరించి మాకు అప్పగించే విధంగ ప్రతిజ్ఞ తీసుకోమన్నాను. వీలైతే వారిని మాతోపాటు తిరుపతికి రావచ్చని కూడ చెప్పాను. ఇది వారికి స్వామిసేవా భాగ్యమును కల్పించు అవకాశమని చెప్పాను. నేను వారికి వారు కోరినన్ని జపపుస్తకములను వారు కోరినన్ని సం॥ల వరకు ఉచితంగ ఇచ్చుదునని చెప్పాను. ఈ విధంగ నేను ఏవిధంగ స్వామిసేవ చేయుచున్నానో ఆసేవను ఆసక్తిగల ఇతరులకు విస్తరింప చేయుటకు ప్రయత్నించాలని దృఢనిశ్చయము చేసుకున్నాను. ఇలా స్వామివారి కృపాకటాక్షాలు అందరికీ లభించుటకు తీవ్ర



పాదసేవా భాగ్యాన్ని ప్రసాదించుట

ప్రయత్నం చేసాను.

## పాద సేవకునిగ స్వీకరించుట

ఈ విధంగ నేను స్వామివారిని చూడాలని, ఆయన సేవ చేయాలని, మరియు అందరికి శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించాలని తపించి పోయాను. బహుశా నా తపనను శ్రీవేంకటేశ్వరుడు గమనించాడు. తగిన ఫలమును నాకివ్వదలచారు. ఈ జీవితంలో స్వామివారు ప్రసాదించిన ఎన్నో ఆణిముత్యాలలో ఇది మహత్తరమైనది. కోటికి ఒక్కరికి లేద రాజమహారాజులకు కూడ ఆ భాగ్యము లభించదు. ఈ ఒక్క అనుగ్రహములతో నేను పొందిన ఈ జన్మ సార్థకము చేయబడ్డది. ఈ సృష్టిలో నాకంటే అదృష్టవంతుడు లేరనే స్థితికి వచ్చాను. దీని ఋణం తీర్చుకొనుటకు మరో జన్మను కేటాయించుకున్నానంటే ఈ భాగ్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు!

ధర్మరక్షణ, దుష్టశిక్షణ కోసం శ్రీవేంకటేశ్వరుడు ఎన్నో అవతారములను ఎత్తాడు. అందులో మోహినీ అవతారం ఒకటి. ఎదుటివారిని సమ్మోహితులను చేసి, స్వామివారు అనుకున్న స్థితికి తీసుకురావడమే దీని ముఖ్యోద్దేశం. 'మోహినీ' అత్యంత ఆకర్షణీయంగ ఉంటుంది. దీని ప్రభావానికి లోనుకాని వారుండరు. పూర్వం ఒక సందర్భంలో పరమశివుడు కూడ ఈ ప్రభావానికి లోనైనాడని అంటారు. ఇప్పుడు నా విషయంలో కూడ తన 'మోహినీ' అవతారాన్ని వాడాడు. ఎందుకు వాడాడు? అనే విషయం నాకు తెలియదు. ఆయన తన మోహినీ రూపమును చూపెట్టాడు. నేను తనివితీరా చూచాను. నావల్ల స్వామివారు అత్యంత ప్రసన్నులైనారు. చివరికి నాకు తన

'పాదసేవా భాగ్యాన్ని' ప్రసాదించారు. దీనిని క్లుప్తంగ చెప్పాలంటే "శ్రీవేంకటేశ్వరుడు ఆకాశం నుండి దిగాడు. నేరుగ మా ఇంటికి వచ్చాడు. ఒక ఆసనంపై ఆసీనుడైనాడు. తన రెండు కాళ్ళను నాముందు పెట్టాడు. పంచెను మోకాళ్ళవరకు పైకెత్తాడు. ఈ పాదాలు నీవి సేవించుకో" అంటే ఏవిధంగ ఉంటుందో ఆవిధంగ చేసాడు. తన్మయత్వముతో మైమరచిపోయాను. ఆ లీల ఈవిధంగ ఉంది:

తేది 25-04-2003 నుండి 11-05-2003 వరకు నేను, నా మిత్రులతో మరియు నా కుటుంబముతో పాటు దక్షిణ భారతదేశ యాత్ర చేస్తున్నాము. కేరళ, కన్యాకుమారి, సుచింద్రం, రామేశ్వరం, మధురై, త్రిచ్చీ, శ్రీరంగం, కుంభకోణం, తంజావూర్, నవగ్రహాలు మొదలైన ప్రదేశములు తిరుగుచున్నాము. నాకు 07-05-2003న ఒక కల వచ్చింది, అందు స్వామివారు తన మోహినీ రూపంను చూపెట్టారు.

07-05-2003 : కల : అది ఒక ఊరు. ఆ ఊరికి ఒక రచ్చబండ ఉంది. ఆ ఊరి ప్రతి నిర్ణయం దాదాపు ఈ రచ్చబండ వద్దనే జరుగుట ఆనవాయితి. రచ్చబండ వద్ద ఎప్పటికి కనీసం పదిమందైన ఆ ఊరి జనాలు ఉంటారు. ఈరోజు కూడ ఈ రచ్చబండ వద్ద సుమారు ఇరవైమంది గ్రామస్థులు ఏదో మాట్లాడుకుంటున్నారు. ఈ ఇరవై మందిలో నేను ఒకన్ని. అది మా ఊరేనట. ఇంతలో దాదాపు 25 సం॥ల వయస్సుగల ఒక అందమైన అమ్మాయి ఆకాశం నుండి క్రిందికి వయ్యారంగ దిగుచు కనబడ్డది. ఆమె మంచి బంగారు రంగు శరీరచ్ఛాయ కలిగి ఉంది. ఆమె ఒక దివ్య కన్యలాగ అనిపించింది. ఆమె రంగు అటు పూర్తి బంగారం కాదు ఇటు మంచి తెలుపు కాదు. రెండు మేళమించిన రంగులాగ అత్యంత సుందరంగ ఉంది. ఎత్తు దాదాపు 5'-8" వరకు ఉంటుంది. మంచి శరీరసౌష్ఠవము కలిగి ఉంది. పసుపు పచ్చరంగు చీర ధరించి చిలకపచ్చ జాకెట్టుతో ఆకాశము నుండి మెల్లమెల్లగ మా వైపు వస్తుంది. ఆమె ఆకాశము నుండి అద్భుతమైన విన్యాసాలు చేయుచు మెల్లమెల్లగ దిగుచున్నది. ఒకరకంగ మేమందరము ఆ విన్యాసాలను చూచి ఆనందించాలనే ఉద్దేశ్యముతో ఆవిధంగ మెల్లమెల్లగ దిగుచున్నది. ఇంతలో స్వామివారు మోహినీ రూపము ధరించి వస్తున్నారనే మాట ఆకాశము నుండి ఎవ్వరో చెప్పుచున్నట్లు వినబడింది. అక్కడున్న అందరు కూడ ఆమెను చూచి స్వామివారు మోహినీ రూపము ధరించి వస్తున్నాడు అని పలుకుచూ ఆమె క్రిందికి రాగానే శతకోటి ప్రణామాలను చేస్తున్నారు. ఉక్కిరి బిక్కిరి అవుచున్నారు. వారు ఆమెను వారి దేవతగా కొలుచుచు వారిని రక్షించమని వేడుకుంటున్నారు. ఇక నా పరిస్థితి ఇందుకు భిన్నంగ ఉంది.




**ఆకాశము నుండి మోహినీ రూపంగ స్వామి వారు దిగుట**

నా స్వామివారు మోహినీ రూపముతో వస్తున్నారనగానే సావధానున్నైనాను. అత్యంత మౌనంగ ఉన్నాను. నేను మాత్రం ఆమెను నా దేవతగ భావించకుండ, నేను ప్రభువుకు సేవకుడను మాత్రమే, భక్తుడను కాను అనే భావంతో ఉన్నాను. సావధాన స్థితిలో ఉండి స్వామివారి ఆజ్ఞకై వేచి చూస్తున్నాను. ఇంతలో క్రిందికి దిగిన స్వామివారు నడుచుకుంటు నేరుగా ఊరిలోని మా ఇంటికి వెళ్ళారు. ఇంటి ముందు ఉన్న అరుగుపైన కూర్చున్నారు. తన కాళ్ళు క్రిందికి వ్రేలాడుచుండ అరుగుపై కూర్చున్నారు. నాతోపాటు ఆ రచ్చబండ వద్ద నున్న ప్రతిఒక్కరు స్వామివారిని అనుసరించి మా ఇంటికి వచ్చారు. స్వామివారు మోహినీ రూపంలో అరుగుపైన కూర్చున్నారు. నాతోపాటు వీరందరు ఆమెకు ఒక పదైదు అడుగుల దూరములో వాకిట్లో ఉన్నాము. అందరు స్వామివారిని చూస్తున్నారు. అక్కడున్న ప్రతి వ్యక్తి ఈ సదవకాశమును వినియోగించుకొని స్వామివారి అనుగ్రహము పొందుటకు రకరకాలుగ మ్రొక్కుచున్నారు. కాని నేను మాత్రం వారిలాగ మ్రొక్కకుండ మౌనంగ ఉన్నాను. స్వామివారి ఆజ్ఞకోసం తదేక దృష్టితో చూస్తున్నాను. అక్కడున్న వారందరు నన్ను స్వామివారికి మ్రొక్కమని అరుస్తున్నారు. నేను వారి సలహాను పట్టించుకోలేదు. చివరికి స్వామివారి వద్దకు ఒక్కొక్క అడుగు వేయుచు వెళ్ళుచున్నాను. నేను ఎప్పుడైతే స్వామి వద్దకు వెళ్ళుటకు ఒక్క అడుగు వేసానో వీరి అరుపులు వినబడలేదు, వీరు కనబడలేదు నా మనసంత స్వామి పైననే కేంద్రీకృతమై ఉంది. ఇప్పుడు స్వామివారు అరుగుపై తన రెండు

కాళ్ళు వ్రేలాడేలా కూర్చుండి, ఆ రెండు కాళ్ళను పైకి క్రిందికి ఊపుచున్నారు. నేను స్వామివారి వైపు రెండు అడుగులు వేశాను అంతే ఇంతలో స్వామివారు కూడ నాకు కనబడలేదు కాని వారి కాళ్ళు మాత్రమే కనబడ్డవి. ఇంకా రెండడుగులు ముందుకు వెళ్ళాను ఇప్పుడు స్వామివారి మోకాళ్ళ క్రింద నున్న పంచకూడ కనబడలేదు కేవలం స్వామివారి రెండు కాళ్ళు అవి కూడ మోకాళ్ళ నుండి క్రింది భాగం మాత్రమే కనబడ్డవి. బంగారు వన్నెతో ఉన్న ఆ రెండు కాళ్ళను స్వామివారు పైకి క్రిందికి ఊపుచున్నారు. నన్ను తన వద్దకు పిలుస్తున్నట్లు ఊపుచున్నారు. నేను క్రింద, భూమి మీద ఆ కాళ్ళప్రక్కన కూర్చుండి ఆ రెండు పాదాలను సేవకుడిగ నా చేతులతో ఒత్తుచున్నాను. ఒకరకంగ స్వామివారు తన కాళ్ళను ఒత్తుటకు నాకు అవకాశం ఇచ్చారు. అప్పుడు నా మనస్సులోని భావం ఏవిధంగ ఉన్నదంటే! మీరు భక్తులు మ్రొక్కండి మీ కోరికలు తీర్చుకొండి. నేను స్వామి సేవకుడను. స్వామి పాదములు ఒత్తుచు సేవచేయుట నా ధర్మము అనే భావము నా మనస్సులో బలంగ కలిగింది. కల చెదిరింది.

ఈవిధంగ అద్భుతమైన రీతిలో శ్రీవేంకటేశ్వరుడు తన పాద సేవా భాగ్యాన్ని ప్రసాదించాడు. నన్ను ధన్యున్ని చేసాడు. ఈ భాగ్యానికి నేను మరో జీవితాన్ని అంకితం చేసాను. ఈ పాదసేవా భాగ్యాన్ని ప్రసాదించుటకు తన 'మోహినీ' రూపాన్ని ఎందుకు చూపారంటే బహుశా అంతటి ఆకర్షణీయ మోహిని రూపమును చూచి కూడ నేను భ్రమించక నా సేవక ధర్మాన్ని నిర్వర్తించే స్థితిని కలిగించారని భావించాను.

## భగవంతుని రూపంగ మా తండ్రిని దర్శించుట


కీ.శే. పుల్లగూర్ల వేంకటరెడ్డి

మేము తమిళనాడులోని తీర్థయాత్రలు చేస్తున్నాము. చాల శివుని ఆలయాలను దర్శించాము. ప్రతి ఆలయములోని శివున్ని నా స్వామి శ్రీవేంకటేశ్వరుని రూపంగ భావించి నమస్కరించాను. నేను శివున్ని ''శివరూపాయ శ్రీవేంకటేశ్వరాయ నమో నమః'' అని ప్రార్థించితేనే నాకు తృప్తి కలుగుతుంది. 07-05-2003 నాడు నాగేశ్వర జ్యోతిర్లింగమును, మరికొన్ని శివుని ఆలయాలను దర్శించాము. ఈరోజు కలలో ఒక విచిత్రమైన దృశ్యమును చూచాను.

08-05-2003 : కల : చిన్నగుండవెల్లి గ్రామములోని మా ఇంటిలో నైరుతిమూల పూజగది ఉంది. దాని ముందు ఒక 6 ఇంచుల ఎత్తుతో సుమారు 6' × 10' సైజుగల గద్దె ఒకటి ఉంటుంది. ఆ గద్దెపై ఒక తలుపుగూడు ఉంటుంది. అందులో మా నాన్నకు సంబంధించిన పేపర్స్ పెట్టుకుంటాడు. మరియు దానిపైన దేవుని ఫోటోలు ఉంటవి. వాటికి మా నాన్న ప్రతిరోజు భోజనానికి ముందు పూజ చేస్తుండేవాడు. ఆయన దాదాపు 5' 1" ఎత్తు కలిగి సన్నగ, కొంచెము చెంపలు లోనికి పోయి నల్లరంగుతోనే ఉండేవాడు. ఈయన 1990 డిసెంబర్‌లో చనిపోయారు. కాని ఈకలలో మా తండ్రిగారు ఇదే ప్రదేశములో దేవుని రూం వైపు కాళ్ళు చేసి మేన్‌డోర్ వైపు చూచుచు ఒక ప్రక్కపైన పడుకున్నాడు. ఆ ఫోజు ఏవిధంగ ఉన్నదంటే ఒక ఫోటోలో శివుడు చిన్నబాలకుడిగా ఉండి ఒక ప్రక్కపై పడుకుంటాడు, మరియు ఒక ప్రత్యేకమైన కోణంలో చూస్తుంటాడు. అదే విధంగ మా తండ్రిగారు పడుకొని చూస్తున్నారు. ఆయన రూపము మాత్రము మా తండ్రి పోలిక. కాని ఎత్తు 6.0 అడుగుల ఆజానుబాహుడు, నిండు చెంపలు కలిగి ఉన్నాడు. విశాలమైన కనుగుడ్లు కలిగి ఉన్నాడు. ఎన్నో రోజుల క్రితము షేవ్‌చేసినట్లు గడ్డము అర ఇంచువరకు పెరిగి ఉన్నది. ఆయన శరీరము దృఢత్వము కలదిగ ఉండి చూచుటకు మంచి ఆజానుబాహునిగ కనబడుచున్నాడు. నేను మేన్‌డోర్ తీసి లోనికి ప్రవేశించగనే ఆయనను ఆవిధముగ పడుకొని ఉండుట చూచాను. పైగ ఆయన నన్నే తదేకదృష్టితో చూస్తున్నాడు. ఈవిధంగ మా నాన్న పడుకోవటము చూచి, అచ్చంగ శివుని మాదిరిగానే పడుకున్నాడని కలలోనే అనుకున్నాను. ఇంతే కల.

శివుడు మా తండ్రి రూపంగ మా ఇంటిలో దర్శనమిచ్చాడు. నా ప్రభువుకు శతకోటి ప్రణామాలను తెలియచేసాను. కాని ఈ కల అర్థం ఏమిటనేది తెలియదు. చనిపోయిన మా తండ్రిని భగవంతుని స్థానములో చూపెట్టాడు. బహుశా భవిష్యత్‌లో మీ తండ్రిమాటను భగవంతుని ఆజ్ఞగా స్వీకరించుమనే ఉద్దేశ్యము కావచ్చును.

## జపసమర్పణ తేదిని తెలిపిన స్వామివారు

ఈరోజు నా జీవితంలో మరపురాని ఆనందమును అనుభవించిన రోజు. నా అంతరంగ భావాలను నా ప్రభు అర్థం చేసుకొని వాటిని తీర్చి నాకు అమితానందమును కలిగించాడు. స్వామివారికి ప్రథమ 7 కోట్ల జపసమర్పణ 7 నెలల్లో జరుగాలని అదికూడ స్వామివారే ఈ జపసమర్పణ తేదిని నాకు తెలుపాలని నా మనస్సులో భావించి ప్రార్థించాను. కాని ఏనాడు నా నోటితో బయటకు చెప్పలేదు. కాని ఈరోజు ఆ శ్రీవేంకటేశ్వరుడు ఈ తేదీని

నిర్ణయించి నాకు స్వయంగ తెలియచేసాడు. అది ఇలా జరిగింది.

నేను నా సంకల్పాన్ని జతచేసి రెండు జపపుస్తకములను, టి.టి.డి ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారికి గతంలో పంపాను. వారు ఈ జపపుస్తకములను, సంకల్పమును చూచి ఆనందించారట. మరియు ఆ రెండు జపపుస్తకములను వారే స్వయంగ వ్రాసారు. ఒకసారి పని నిమిత్తమని డా॥ కొండారెడ్డిగారు ఈ.ఓ ను కలిసినప్పుడు ఆ పుస్తకములను వారివద్ద చూడడము జరిగింది. మరియు నా గురించి పూర్తిగ ఆయనకు చెప్పారు. వెంటనే తాను రెండు జపపుస్తకములను వ్రాసానని తేది 14-06-2003 నాడు జపసమర్పణ పెట్టుకొమ్మని డా॥ కొండారెడ్డి గారితో ఈ.ఓ గారు చెప్పారట. కొండారెడ్డిగారు నాకు ఈ మాటను 10-05-2003 నాడు చెప్పారు. ఎంతో ఆనందించాను. నేను కోరినట్లే ఇంగ్లీషు క్యాలెండర్ ప్రకారం ఒక్కరోజు తేడా లేకుండ 7 నెలల్లో 7 కొండలవాడికి 7 కోట్ల జపసమర్పణ జరుగుచున్నది. 15-11-2002 నుండి 14-06-2003 వరకు సరిగ్గా 7 నెలలు. అదీకూడ ఆ తేదిని స్వయంగ స్వామివారు నిర్ణయించి నాకు తెలియచేసారు. అప్పుడు నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

ఇక జపసమర్పణకు ఒక స్వామివారిని పిలువాలని భావించాను. అప్పుడు గాంధీనగర్‌లో నాదొక వర్కు జరుగుచున్నది. ఆ వర్కు నుండి వచ్చేదారిలో శ్రీభాష్యకార సిద్ధాంతపీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ రామచెంద్ర రామానుజ జీయరు స్వామివారిని శిష్యసమేతంగ చూచాను. వారు శ్రీమహాలక్ష్మి యజ్ఞం చేయుటకై భిక్షాటన చేస్తున్నారు. స్వామివారిని అనుసరించి ప్రక్కనే ఉన్న వారి ఆశ్రమమునకు వెళ్ళాను. విషయము చెప్పి ప్రథమ 7 కోట్ల జపసమర్పణకు తిరుపతికి రావలసిందిగా వేడుకున్నాను. స్వామివారు ఒప్పుకున్నారు.

## స్వామివారిని పొందుటకు సంకల్పం తీసుకొనుట

స్వామివారు మాకు నాలుగు రకలైన లీలలను చూపెట్టేవారు. అవి

(a) స్వప్నాల రూపంలో : స్వప్నాల రూపంలోని లీలలను విశ్లేషించి సరైన అర్థంను గ్రహించవలసి ఉంటుంది.

(b) హృదయాంతర భావాలు : ఇక హృదయాంతర భావాల రూపంలోని లీలలు స్పష్టంగ అర్థం అవుతాయి.

(c) స్వప్నంతో పాటు భావాలు : ఈ రకమైన లీలలో, ఒక ప్రక్క స్వప్నం జరుగుచుండగ మరోప్రక్క అశరీరవాణి మాటలు వినబడతాయి లేదా హృదయాంతర భావాలు కలుగుతాయి.

(d) ఇక నాలుగవ రకం లీలలు : ఈ లీలలు ప్రత్యేకంగ ఉంటాయి. మనము మెళకువ స్థితిలోనే ఉంటాము కాని మనస్సు స్వామివారి ఆధీనంలో ఉంటుంది. మనము మాత్రమే ప్రత్యేకమైన దృశ్యమును చూస్తుంటాము.

ఇలా నాలుగురకాల లీలలను చూపుతారు. ఇందులో స్వప్నాల రూపంలో చూపిన లీలలను మొదట్లో చాల వాటిని అర్థం చేసుకోలేదు. కాని కాలము గడిచినా కొద్ది, యోగ్యత పెరిగినా కొద్ది వాటి భావాలను అర్థం చేసుకున్నాను. అందులో ఇది ఒకటి. దీని సరైన అర్థంను ఈ అనుభూతి వ్రాస్తున్నప్పుడే గుర్తించాను. ఆ లీల ఈవిదంగ ఉంది.

03-06-2003 : కల : నేను తిరుపతి లాంటి ఒక పట్టణమునకు పోయాను. అక్కడ ఏదో పనిపై పోవలసింది మానుకొని ఇంటివద్దనే ఉన్నాను. సాయంత్రము బయటకు వెళ్ళాను. రకరకాల భవనములు కనబడ్డవి. తరువాత శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శనము చేసుకోవాలనిపించింది. అంటే ఆ పట్టణమును తిరుపతిగ భావించాను. నాకు స్వామి దర్శనము ఇప్పించుటకు డా॥ కొండారెడ్డిగారు లేరట. కావున ఆ సాయంత్రము అదే రోజు నాకు స్వామి దర్శనము చేసుకొనుటకు ఇబ్బందిగ ఉంది. అప్పుడే ఒక తెలిసిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి నీకు శ్రీవారి దర్శనము చేయించెదను రమ్మ అని నన్ను పిలుచుకు పోయాడు. అది ఒక మైదానము, దాని లోనికి ఒక గేటు గుండా వెళ్ళాము. అందులో శ్రీవారి నామముతో ఇద్దరు నల్లని బ్రాహ్మణులు ఉన్నారు. వారు అక్కడున్న 5, 6 మంది భక్తులకు సంకల్పాలు చేయిస్తున్నారు. నేను కూడ వారి వద్దకు వెళ్ళాను. అందులోని లావుగ ఉన్న ఒక నల్లని బ్రాహ్మణుడు నేను నీకు శ్రీవారి దర్శనము చేయించగలను అని నీరు నా చేతులపై పోసి సంకల్పము చేయించాడు. తరువాత నేను ఆయనకు రూ.100/- దక్షిణగ ఇచ్చాను. అప్పుడు ఆయన ఇది చాలదు అని మరియు ఇది దొడ్డిదారి దర్శనము కావున ఇంకా కావలెనన్నాడు. నేను ఇంకొక రూ.100/- తీసి ఆయనకు ఇచ్చాను. ఆయన సరే నేను నీకు ఆ దేవుని దర్శనము చేయించుదును వేచి ఉండమన్నారు. ఇంతే కల. దీని అర్థం అప్పుడు నాకు తెలియలేదు. నేడు దీని నిజమైన అర్థం ఇలా భావించాను. శ్రీవేంకటేశ్వరున్ని పొందుటే లక్ష్యంగ నాకు స్వామివారు 111 కోట్ల జపసమర్పణ సేవను ప్రసాదించారు. అందులో మొదటి 7 కోట్ల జపసమర్పణకు సిద్ధమైనాను. కొన్ని రోజుల తరువాత నీవు తప్పక స్వామివారిని పొందగలవని ఈ వైష్ణవ స్వాములు నాచే సంకల్పం చెప్పించారని భావించాను. ఏ ఉద్దేశ్యముతో స్వామివారు నాకీ సేవను ప్రసాదించారో అది తప్పక పూరించగలదని దీని ఉద్దేశమైనట్లు భావించాను. స్వామివారు ఈ లీలను అత్యంత విశ్లేషణాత్మకంగ ప్రసాదించారు.

## ప్రథమ 7కోట్ల జపసమర్పణ, 'గోవింద దాసు' గ దాస్యనామం లభించుట

నా స్వామి తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రథమ ఏడుకోట్ల జపసమర్పణ కొరకు ఏర్పాట్లు చక్కగ జరుగుచున్నవి. దీనిని మేము తేది 14-06-2003 శనివారము పౌర్ణమినాడు, శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం చేసి, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరు స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వామివారికి సమర్పించదలచాము. ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు కూడ వస్తున్నారు. ఈ కార్యక్రమము తరువాత అక్కడే ద్వితీయ పర్యాయంగ ఏడుకోట్ల జపసంకల్పము ప్రారంభించాలని భావించాము. తేది 13-06-2003



**శ్రీ రామచంద్రరామానుజ జీయరు స్వామి వారు గోవింద దాసుగా దాస్య నామ మిచ్చుట**

సాయంత్రము ప్రథమ 7 కోట్ల జపమును అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు సమర్పించబడును. దీని నిమిత్తమై మాకు టి.టి.డి నుండి తగిన అనుమతి పత్రం కూడ లభించింది.

స్వామివారికి తలపెట్టిన మొత్తం 16సం॥ల కార్యక్రమములో భాగంగ ప్రథమ 7 కోట్ల జపసమర్పణ కార్యక్రమము ఈవిధంగ జరిగింది.

తేది 13-06-2003 సాయంత్రము సుమారు 6.30 ని॥లకు తిరుమల కొండపై అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు ఈ జపమును సమర్పించి పూజ చేసాము. టి.టి.డి వారు ఈ కార్యక్రమము కొరకు చక్కని ఏర్పాట్లు చేసారు. పాదాల మండపమును పూలచే చక్కగ అలంకరించారు. వారి మనుష్యులే ఈ కార్యక్రమములో ప్రధాన పాత్ర పోషించారు. డా॥ కొండారెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శ్రీవారి పాదాల మంటపము వద్ద, స్వామివారి పాదాలను అభిషేకించి, పూజించాము. శ్రీ వేంకటేశ్వర మహామంత్రముతో అనుసంధానిస్తూ విష్ణు సహస్ర నామ పారాయణం చేసాము. ఆ తరువాత ఇట్టి ప్రథమ 7 కోట్ల జపమును స్వీకరించుమని, జపము వ్రాసిన ప్రతి భక్తున్ని అనుగ్రహించమని ప్రార్థించాము. చివరికి హారతి ఇచ్చిన వెనువెంటనే దాదాపు 30 ని॥లు బ్రహ్మాండమైన వర్షము కురిసింది.

తేది 14-06-2003 : తిరుపతిలోని టి.టి.డి డైరీఫాంలో ఉ.8.0 గం॥ల ప్రాంతమున శ్రీవేంకటేశ్వర మహామంత్ర హోమము, పూజ మొదలైంది. ఈ మొత్తం కార్యక్రమము శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. శ్రీమాన్ యతీంద్ర రమణాచార్యులు గారు యజ్ఞం నిర్వహించారు. పూజ కార్యక్రమము, యజ్ఞం చాల చక్కగ, ఎంతో ఆనందంగ జరిగింది. టి.టి.డి వారు మంచి సహకారాన్ని అందించారు. భక్తులచే శ్రీవిష్ణు సహస్రనామ పారాయణము, శ్రీవేంకటేశ్వర మహామంత్రమును అనుసంధానము చేయుచు పఠించుట జరిగింది. మొత్తం యజ్ఞం మరియు పూజ ఎంతో సంతృప్తికరంగ జరిగింది. స్వామివారు నన్ను ఆశీర్వదించుచున్నారన్న విధంగ జరిగింది. తిరుమల శ్రీవారికి గత మూడు రోజుల నుండి జరుగుచున్న అభిధ్యేయక అభిషేకమును చేయించి, అదే దుస్తువులతో ఉ.11.50 ని॥లకు టి.టి.డి ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు విచ్చేసారు. వీరు 3 పుస్తకములను వ్రాసి తనతో పాటు తెచ్చారు. తరువాత శ్రీశ్రీశ్రీ జీయరు స్వామివారు కూడ వచ్చారు. జీయరు స్వామివారు పూర్ణాహుతి పళ్ళెమును మా అందరికి తగిలించి యజ్ఞపూర్ణాహుతి కావించారు. తరువాత అన్ని జపపుస్తకములపై ప్రక్షాళన కావించారు. పిదప నేను, ఈ వ్రాసిన జపపుస్తకములను ఈ.ఓ గారికి అందించగ వారు స్వామివారి చేతికి ఇచ్చారు. స్వామివారు వాటిని 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర స్తూపము' లో సమర్పించారు. తరువాత ఈ.ఓ గారు, అక్కడి మరికొందరు అధికారులు, మేము, చివరికి అక్కడున్న ప్రతి భక్తుడు కొన్ని కొన్ని జపపుస్తకములను స్తూపములో సమర్పించారు.

పూజ సందర్భంగ నా కోరిక ప్రకారం ఈ.ఓతో పాటు ప్రతి భక్తుడు అక్కడ ప్రత్యేక ప్రార్థన చేసారు. ఈ జపము వ్రాసిన ప్రతి భక్తుని కోరిక తీరాలని, వారికి శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించాలని ప్రార్థించారు.

తరువాత ప్రక్కనే ఉన్న శ్రీకృష్ణుని ఆలయం ముందు సభ జరిగింది. ఈ సభలో డా॥ కొండారెడ్డిగారు, ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు మరియు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరు స్వామివారు ప్రసంగించారు. అందరు కూడ నన్ను అభినందించారు. శాలువతో సత్కరించారు. 111 కోట్ల జపసమర్పణ ధ్యేయంగ పెట్టుకున్న నన్ను ఈ.ఓ గారు

అభినందించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరు స్వామివారు మాట్లాడుతు, నా పేరును మార్చారు. ఆయన నన్ను ఇకపై సాయిరెడ్డి కాకుండ "గోవింద దాసు" గ నామకరణము చేసి, ఇకపై అందరూ నన్ను 'గోవింద దాసు' గ పిలువవలెనని ఆ సభలో చెప్పారు. భగవంతుని కంటే ఆయన నామమే గొప్పదని దానిని వ్రాయించుచున్న సాయిరెడ్డి అభినందనీయుడన్నారు. దేవస్థానము వారు వారి ప్రసాదమును భక్తులకు పంచిపెట్టారు.

అందరూ మాట్లాడిన పిదప ద్వితీయ పర్యాయంగ 7 కోట్ల జపమును, స్వామివారు, ఈ.ఓ శ్రీ అజయ్ కళ్ళాం గారు, మరికొందరు అధికారులు కలిసి ప్రారంభించారు. ఆ తరువాత ప్రతి భక్తునికి ఒక్కొక్క పుస్తకమును అందించాము.

ఇక్కడ కూడ శ్రీవేంకటేశ్వరుడు తల లీలను ప్రసాదించారు. స్థూపం ప్రక్కన మొత్తం వ్రాసిన జపంను దాదాపు 6'×5' సైజు గల కుప్పగ పేర్చి పూజించాము. ఈ సందర్భంగ స్వామివారు ఈ మొత్తం కుప్పపై తన రెండు పాదములను పెట్టి ఆకాశములో విరాట్‌రూపునిగ నిలబడ్డారు. ఆయన రెండు నల్లని పాదములు ఆ పాదములపైన తను ధరించిన ధోవతి యొక్క అంచును మాత్రమే చూచాను. ఈ పాదములకు సరిసమానమైన విరాట్‌రూపము ఆకాశములో ఉన్నదన్న భ్రమ కలిగింది. ఈవిధంగ నేను ఎంతో ఆనందముతో ఆయన పాదములను పూజ చేసాను. ఇంతే కాకుండ పాదాల మండపముపై ఈ జపమును పెట్టి పూజించునప్పుడు సాక్షాత్ తిరుమల మూలమూర్తే నా ముందు ఉన్నారన్న భావన కలిగింది. పరవశించిపోయాను. ఈవిధంగ ప్రథమ ఏడు కోట్ల జపసమర్పణ అత్యంత ఆహ్లాదభరితంగ జరిగింది. మరియు బాహ్య ప్రపంచానికి శ్రీవేంకటేశ్వరుడు నన్ను 'గోవింద దాసు' గ దాస్యనామం ఇచ్చి పరిచయం చేసాడు. ఈ మొత్తం విషయం తెల్లవారి తిరుపతిలో ప్రతి న్యూస్‌పేపర్లలో ప్రచురించబడ్డది.

ఆ తరువాత తేది 15-06-2003 నాడు కొండపైకి వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాను. నా సేవను స్వీకరించమని, తప్పులను క్షమించుమని వేడుకున్నాను. టి.టి.డి అధికారుల సూచన మేర ప్రతి సం॥ము ఈ జపసమర్పణ గోకులాష్టమినాడు సమర్పించ నిర్ణయించబడ్డది. రెండవ జపసమర్పణ దాదాపు 15 నెలల గ్యాపు తరువాత ఉండును కాబట్టి మాకు 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేయుటకు కావలసిన సమయము లభించింది.

తిరిగి హైదరాబాద్‌లో తేది 18-06-2003 శ్రవణనక్షత్రం నుండి ద్వితీయ పర్యాయంగ ఏడుకోట్ల జపానికి సంబంధించిన పుస్తక పంపిణి చేపట్టాము. ఈసారి భక్తులకు వారి వారి శక్త్యానుసారము సంకల్పాలు తీసుకునే విధంగ ప్రోత్సహిస్తున్నాము. స్వామిసేవ జరుగుతుంది.

ఒక విశ్లేషణ : స్వామివారు ఒక ప్రత్యేక పద్ధతిలో అనుగ్రహిస్తున్నారు. స్వామివారు అనుగ్రహించిన ప్రతిది తరువాత రోజలలో జరిగింది మే 2003లో తన పాదసేవ భాగ్యాన్ని ప్రసాదించి జూన్ 14న 'గోవింద దాసు'గ బాహ్య ప్రపంచానికి తెలియ చేసారు. మరియు బహుశా ఈ లీల ఫలితంగ ప్రతి 7 కోట్ల జపమును స్వామివారి పాదాలకు సమర్పించే సమయాన టి.టి.డి ఈ.ఓ గారు మాకు ఈ జపమును స్వామివారి పాదాలకు సమర్పించుటకు వీలుగ ఒక ప్రొసీడింగుతో పాటు, స్వామివారి పాదాలను ఇచ్చుట ఆనవాయితిగ ఏర్పడింది. ఈ స్వామి పాదాలు మీకు ఇవ్వడం జరిగింది. మీరు ఏమి చేసుకుంటారో చేసుకొండనే విధంగ కలలో స్వామి తన పదాలను ఇచ్చిన విధంగ ఇచ్చుట అలవాటైంది. అదేవిధంగ స్వామివారిని పొందుటకు సంకల్పమిచ్చాడు కాబట్టి తప్పక స్వామివారిని పొంది హరినామ క్షేత్రం ఏర్పాటుచేయగలమనే విశ్వాసాన్ని కలిగించాడు.

నా దశ : 'నమోవేంకటేశాయ' రథ సంకల్పం జరిగింది. శ్రీవేంకటేశ్వర సేవాసమితి అనే ట్రస్టును ఏర్పరచాము. స్వామిపై సంపూర్ణ నమ్మకము పెట్టమన్నారు. నాలాగ భక్తులకు సంకల్పాలు ఇచ్చి స్వామిసేవను విస్తరింప చేశాను. నన్ను తన పాదసేవకుడిగ స్వీకరించాడు. స్వామివారిని పొందుటకు సంకల్పం ఇచ్చాడు. గోవింద దాసుగ దాస్యనామము లభించింది.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

**(సశేషం)**


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**
**Visit: www.srivenkatesham.org**



# కార్తీక సోమవార వ్రతం

– డా|| మరుదాడు అహల్యాదేవి

*లయకారుడైన శివుడు భక్తసులభుడు. నీటితో అభిషేకించి, మారేడు దళములతో అర్చించినంత మాత్రముననే లేదా తనను పూజించి, ఉపవాసం ఉన్నంతనే సంతుష్టుడై తన భక్తుల వెన్నంటి ఉండి వారిని కంటికి రెప్పలా కాపాడే భక్తజన రక్షకుడు. అటువంటి శివుడికి సోమవారం ప్రీతికరమైన రోజు. సోమవారం 'సౌమ్యప్రదోషం' గా శివుడిని ఆరాధించడం విశేష ఫలమని శాస్త్రాలు చెప్తున్నాయి.*

ప్రతి సోమవారమూ శివపూజకు విశిష్టమైనదే అయినా కార్తీక మాసంలోని సోమవారాలు శివుడిని పూజించడం, ఉపవాస వ్రతాన్ని ఆచరించడానికి ఉత్కృష్టమైన రోజులు అనీ, అందువల్ల అనంతమైన పుణ్యఫలాలు చేకూరుతాయని చెప్పబడుతూ ఉంది. జన్మ జన్మల్లో చేసిన పాపాలను పటాపంచలు చేసి మోక్షాన్ని ప్రసాదించే మాసంగా, అనంత పుణ్యఫలాలను చేకూర్చే మాసంగా, శివకేశవులిద్దరికీ ప్రీతికరమైన మాసంగా పేరు పొందిన కార్తీకమాసంలో ఉపవాస నియమాన్ని పాటించాలని, అది కూడా శివుడికి అత్యంత ప్రీతికరమైన సోమవారం రోజు చేయాలని శాస్త్ర వచనం.

సోమవారం రోజు పూర్తిగా పగలంతా ఉపవాసం ఉండి, ప్రదోష సమయంలో అంటే సాయంత్రం వేళ అభిషేకాలు, అర్చనలు చేసి, తులసి తీర్థం స్వీకరించి, మరుసటి రోజు తిరిగి పూజచేసి నైవేద్యం సమర్పించి, ఉపవాస దీక్షను విరమించడమనేది ఆచారం. ఈ విధంగా సోమవారాల్లో ఉపవాస దీక్ష చేయవచ్చు లేదా నక్తవ్రతమును పాటించడం కూడా మంచిదే.

తెల్లవారు ఝామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని తలస్నానం ఆచరించి ఇష్టదేవతా పూజ చేసిన అనంతరం ప్రదోష సమయం వరకూ ఉపవాసంతో దైవస్మరణలో గడపవలెను. ప్రదోషకాలంలో శివుడిని పూజించి నైవేద్యమును సమర్పించి, నక్షత్రోదయమైన తరువాత ఉపవాస దీక్షను విరమించి శివప్రసాదాన్ని స్వీకరించవలెను. దీనికే నక్తం అని పేరు. ఈ రెండు విధులలో దేనినైనా పాటించి కార్తీకమాసంలో సోమవారం రోజున ఉపవాస నియమం పాటించడం మంచిది. అయితే ఆచరణలో గమనిస్తే మధ్యాహ్నం భోజనం చేసి

సోమవారం రాత్రుల్లో ఉపవాసం ఉండే ఆచారం అమల్లో ఉంది. దీన్ని ఆచరించడం మంచిదే అయినా నక్త వ్రతం మేలైన పద్ధతి అని శాస్త్ర వచనం. శరీర ఆరోగ్యం బాగాలేక ఉపవాస నియమాన్ని పాటించలేనివారు కనీసం నువ్వులను దానం చేయవలెను. అందువల్ల ఉపవాస ఫలం లభిస్తుంది. కాగా ఉపవాస ఆచరణలోని నియమాలు వాయుపురాణంలో వివరించబడ్డాయి. సంతానం ఉన్నవారు ఏమీ తినకుండా ఉపవాసం ఉండరాదు.

సంతానహీనులు, సన్యాసులు, వైధవ్యం ప్రాప్తించినవారు మినహా మిగిలిన వారందరూ పండ్లు, ఫలములను, పాలను స్వీకరించవలెను. ఈ విధంగా ఉపవాసం పాటించలేనివారికి ప్రత్యామ్నాయాలను కూడా సూచించాయి పురాణాలు.

**నక్తం హవిష్యాన్నం మనోదనం వా**

**ఫలం తిలాః క్షీరామధాంబు బుజ్యం**

**యత్నంచ గవ్యం యదావాపి వాయుః**

**ప్రశస్త మంత్రోత్తర ముత్తారంచ**

అని వాయు పురాణంలో చెప్పబడింది. అంటే ఉపవాసం చేయలేని సమయంలో వాయుభక్షణం, అదీ చేతకాని సమయంలో పంచగవ్యం, అదీ చేతకాని సమయంలో ఉడకని పదార్థములను తీసుకొనవచ్చును.

ఈవిధంగా కార్తీకమాసం లోని సోమవారాల్లోనూ పూర్ణిమ నాడు మొత్తం ఐదు రోజులు ఉపవాసం ఉండాలని పురాణ వచనం. అందువల్ల సకల జీవరాశులూ ముక్తి పొందుతున్నాయనీ పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకు సంబంధించిన పురాణ గాథ ఒకటి ఇది.

పూర్వం కాశీ రాజ్యంలో ఒక పండితుడు నివసిస్తూ ఉండేవాడు. ఆయన కూతురు నిష్ఠుర. ఆమె సౌందర్యవతే గాని దుర్మార్గురాలు. తన అందాన్ని చూసుకుని మురిసిపోతూ ధర్మాన్ని మంటగలిపి పరపురుషులతో శృంగార కార్యకలాపాల్లో తేలియాడుతూ ఉండేది. ఆమె భర్త సౌరాష్ట్రకు చెందిన మిత్రశర్మ. దైవభక్తి పరాయణుడు. ధర్మబద్ధుడై జీవిస్తూ నిత్యం దైవస్మరణతో కాలం గడుపుతూ ఉండేవాడు. వివాహమయ్యాక కూడా నిష్ఠుర పద్ధతిలో మార్పు రాలేదు. తమ కోడలి స్థితిని చూసి ఏమీ చేయలేక మిత్రశర్మ తల్లితండ్రులు ఇల్లు వదిలి వెళ్ళిపోయారు. భార్యకు ఎన్నో విధాల నచ్చచెప్పాడు మిత్రశర్మ. అయినా ప్రయోజనం లేదు. అంతే కాకుండా చుట్టుప్రక్కల ఉన్న యువతులను కూడా ఆకట్టుకుని వారిని కూడా చెడుదారి పట్టించింది. ఇంత చేస్తున్నా గృహస్థాశ్రమ ధర్మానికి లోపం కలుగుతుందని మిత్రశర్మ భార్యను విడనాడక కాలక్షేపం చేస్తూ ఉండేవాడు. ఇలా ఉండగా విటుల మాటలు విని ఒకనాటి రాత్రి నిద్రిస్తూ ఉన్న భర్త తలపైన పెద్ద బండరాయి వేసి చంపివేసి ఆ శవాన్ని తీసుకువెళ్ళి బావిలో వేసింది. భర్త మరణానంతరం అడ్డూ ఆపూ లేకుండా సంచరించసాగింది. క్రమంగా వయస్సు పెరిగింది. సౌందర్యం తగ్గింది. శరీరమంతా రోగమయమైంది. చివరకు తినడానికి తిండి కూడా దొరకక దిక్కులేని మరణం పొందింది. మరణానంతరం నరకలోకం చేరి అనేక శిక్షలను అనుభవించి మరో జన్మలో కుక్కగా జన్మించింది. మళ్ళీ మళ్ళీ కుక్కగానే జన్మిస్తూ పదిహేను జన్మల్లో కుక్కగానే జన్మించింది.

పదిహేనవ జన్మలో కూడా ఆ కుక్కకు ఒకనాడు ఎక్కడా తినేందుకు ఏమీ దొరకలేదు. వీధులన్నీ తిరిగి తిరిగి సాయంత్రానికి ఒక బ్రాహ్మణుడి ఇంటి ముందుకు చేరింది. ఆరోజు సోమవారం. పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం శివాభిషేకం, అర్చనలు చేసి నైవేద్యం సమర్పించి 'భూతబలి'ని తీసుకుని వచ్చి బయట పడవేశాడు. పగలంతా ఆహారం దొరకక ఏమీ తినక ఆకలితో నకనక లాడుతూ ఉన్న కుక్క ఆ బ్రాహ్మణుడు తెచ్చి వేసిన భూతబలి అన్నాన్ని భుజించింది. దీనితో పూర్వజన్మల జ్ఞానం గుర్తుకు వచ్చింది. ''మహాత్మా నన్ను రక్షించండి'' అని అరిచింది. ఈ మాటలను విని బయటకు వచ్చిన పండితుడు చుట్టూ ఎవరూ లేకపోవడం, ఒక కుక్క మాత్రమే ఉండడం గమనించి కుక్క మాట్లాడటం ఏమిటని ఆశ్చర్యపోయాడు.

''ఎవరు నీవు'' అని ప్రశ్నించాడు.

''స్వామీ! మీరు పెట్టిన భూతబలి అన్నం తిని నాకు గతజన్మలు గుర్తుకు వచ్చాయి. అందుకు కారణమేమిటి? మీరు పెట్టిన అన్నం మహాత్మ్యమేమిటి?'' అని ప్రశ్నించింది. ఈ మాటలను విని దివ్యదృష్టితో చూసి ''ఈరోజు కార్తీక సోమవారం. పగలు తిండి దొరకక పోవడం వల్ల ఉపవాసం ఉన్నావు. రాత్రి నక్షత్రోదయమయ్యాక శివుడికి పూజ చేసి నైవేద్యం సమర్పించిన అన్నాన్ని తీసుకుని వచ్చి భూతబలి వేయగా దానిని నీవు భుజించావు. అంటే నక్త వ్రతాన్ని పాటించావు. అందువల్ల నీకు పుణ్యఫలం లభించి పూర్వజన్మల జ్ఞానం గుర్తుకు వచ్చింది'' అని బ్రాహ్మణుడు పలికాడు.

బ్రాహ్మణుడి మాటలను విన్న కుక్క మహాత్మా! జన్మ జన్మల్లో నేను చేసిన తప్పులన్నీ నాకు తెలిసి దుఃఖానికి గురి చేస్తున్నాయి. ఇక జన్మలు లేకుండా చేసే భాగ్యాన్ని నాకు ప్రసాదించండి'' అని ప్రార్థించింది.

''పశ్చాత్తాపానికి మించిన శిక్ష లేదు. ఈ దినం నక్తవ్రతం పాటించడం వల్ల నీ పూర్వజన్మల తప్పులు తెలిసి నీకు జ్ఞానోదయమైంది. ఈరోజు సోమవార వ్రతం ఆచరించడం వల్ల నాకు లభించిన పుణ్యఫలాన్ని నీకు ధారపోస్తున్నాను''

అని పలికి బ్రాహ్మణుడు తనకు లభించిన పుణ్యఫలాన్ని కుక్కకు ధారపోసాడు. అంతే. కుక్క ఒక అందమైన స్త్రీగా మారిపోయింది. ఈలోగా దివ్య విమానం ఒకటి వచ్చి ఆమెను ఎక్కించుకుని కైలాసానికి వెళ్ళింది. ఇలా ఆమెకు మోక్షం లభించి శివసాయుజ్యం పొందినట్లు పురాణ కథనం. ఇలా నక్త వ్రతాన్ని ఆచరించి శివపూజలు, సోమవారం నాడు చేయడం వల్ల ఇహంలో సౌఖ్యం, పరంలో శివ సాయుజ్యం లభిస్తుందని పురాణాలు వెల్లడిస్తూ ఉన్నాయి.

**కార్తీక సోమవార వ్రత విధి ఆరు రకాలు. 1. ఉపవాసం 2. ఏకభుక్తం 3. నక్తం 4. ఆయాచితం 5. స్నానం 6. తిలదానం.**

1. **ఉపవాసం:** శక్తి గలవారు కార్తీక సోమవారం నాడు పగలంతా ఉపవాసంతో గడిపి, సాయంకాలం శివాభిషేకం చేసి, నక్షత్ర దర్శనం తర్వాత తులసి తీర్థం మాత్రమే సేవించాలి.
2. **ఏకభుక్తం:** సాధ్యం కానివాళ్ళు ఉదయం స్నాన దాన జపాలను యథావిధిగా చేసుకుని, మధ్యాహ్నం వేళ భోజనం చేసి, రాత్రిపూట భోజనానికి బదులు శైవతీర్థమో, తులసి తీర్థమో మాత్రమే తీసుకోవాలి.
3. **నక్తం:** పగలంతా ఉపవసించి, రాత్రి నక్షత్ర దర్శనం చేసుకుని భోజనం గాని, ఉపాహారం గాని స్వీకరించాలి.
4. **ఆయాచితం:** భోజనానికై తాము ప్రయత్నించకుండా ఎవరైనా వారికి వారుగా పిలిచి పెడితే మాత్రమే భోజనం చేయడం ఆయాచితం.
5. **స్నానం:** పై వాటికి వేటికీ శక్తిలేని వాళ్ళు సమంత్రక స్నాన జపాదులు చేసినప్పటికీ చాలు.
6. **తిలదానం:** మంత్ర జప విధులు కూడా తెలియని వాళ్ళు కార్తీక సోమవారం నాడు నువ్వులను దానం చేసినా సరిపోతుంది.

పై ఆరు పద్ధతుల్లో దేనిని ఆచరించినా కార్తీక సోమవార వ్రతం చేసినట్లే అవుతుంది. కార్తీకమాసంలో వచ్చే ప్రతి సోమవారం నాడు కూడా పగలు ఉపవసించి, రాత్రి నక్షత్ర దర్శనానంతరం మాత్రమే భోజనం చేస్తూ, ఆ రోజంతా భగవద్ధ్యానంలో గడిపేవాళ్ళు శివసాయుజ్యాన్ని పొందుతారు. సోమవార వ్రతాన్ని చేసేవాళ్ళు నమక చమక సహితంగా శివాభిషేకం చేయడం ప్రధానమని తెలుసుకోవాలి.

కనుక కార్తీక సోమవారాలు మరియు కార్తీక పౌర్ణమి రోజు సోమవార వ్రతాన్ని ఆచరించి అనంతమైన పుణ్యఫలాలను పొందవచ్చు. అంతే కాకుండా ఆరోగ్యపరంగా కూడా ఉపవాసం ఉండడం అవసరమని వైద్యశాస్త్రం చెబుతోంది.

# స్మశాన వైరాగ్యం అంటే ఏమిటి?

**పురాణ వైరాగ్యం**
**ప్రసూతి వైరాగ్యం**
**స్మశాన వైరాగ్యం**
అని మూడు పేర్కొనబడ్డాయి.

పురాణ ప్రవచనం చెప్పేటప్పుడు పండితుడు ధర్మసూక్ష్మాలు చెప్పి జీవితం మిధ్య, సంసారం మిధ్య అని కథలు చెప్పి వినేవారిలో వైరాగ్య భావాన్ని కలిగిస్తాడు. అది విని ఆ సభ నుండి ఇంటికి రాగానే అంతా మిధ్య అనేది మరచిపోయి సంసార తాపత్రయంలో పడిపోతాడు మనిషి. అలా వచ్చిన వైరాగ్యం పురాణ వైరాగ్యం.

ప్రసూతి సమయంలో గర్భిణీ స్త్రీ పునర్జన్మ పొందుతుంది. అలా ప్రసవ కష్ట సమయంలో ఆమెకు వైరాగ్య భావన కలుగుతుందంటారు. ఇకపై శారీరక సుఖాల పట్ల ఆసక్తి కూడదనుకుంటారు. ప్రసూతి తర్వాత కొద్ది నెలలకు యథా మామూలే. అది ప్రసూతి వైరాగ్యం.

ఒకానొక వ్యక్తి చనిపోయినప్పుడు అతడు చేసిన దానధర్మాలు గుర్తుకు తెచ్చుకుంటారు. కోట్లాది రూపాయలు సంపాదించినా వట్టి చేతులతో స్మశానానికి వెళ్తాడు. ఆ సమయంలో బంధుమిత్రులలో కొందరికైనా వైరాగ్యభావం కలుగుతుంది. మళ్ళీ మర్నాడు అన్నీ మరచి తన నిత్యకృత్యాలలో దుర్మార్గాలు యథావిధిగానే చేస్తూనే ఉంటారు. ఇదే స్మశాన వైరాగ్యం.


### ఇవి కాక మరో మూడు వైరాగ్యాలున్నాయి. అవి...

1. వివేక పూరితమైన వైరాగ్యం (సత్యం తెలుసుకొన్ననాడు కలిగే శాశ్వత వైరాగ్యం)
2. నిమిత్త వైరాగ్యం (కొన్ని కష్టాల కారణంగా వచ్చే వైరాగ్యం)
3. తృణాగ్ని వైరాగ్యం (గడ్డిమంటల వలె వైరాగ్యభావన ఎగసిపడి వెంటనే చల్లారేది)

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007. ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి: **93482 12354**

# సిద్ధి బుద్ధి ప్రదే దేవీ మహాలక్ష్మీ నమోస్తుతే

– చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో॥ "శ్రీంకారం వరదాభయ ప్రదకరాం పుల్లాబ్జ హస్తాం శుభాం**
**కళ్యాణీం కమలామనంత ధనదాం సర్వార్ధ ధాత్రీం ప్రభామ్**
**బ్రహ్మేశాది సురార్చితాం భగవతీం శ్రీ విష్ణు పత్నీం రమాం**
**శ్రీ లక్ష్మీం ప్రణమామి సర్వజననీం భక్తార్తి విధ్వంసినీమ్"**

కృత్తికా నక్షత్రముతో కూడిన పున్నమి గల మాసమును కార్తీక మాసమని అంటారు. కృత్తికా నక్షత్రం అగ్ని నక్షత్రం. కార్తీకం కమనీయం, రమణీయం, మహనీయం, కైవల్యకారకం, హరిహరప్రియం, సర్వజగద్రక్షాకరం. శివకేశవులిద్దరూ అద్వైతంగా అన్యోన్యంగా పూజలందుకుంటూ, భక్తులను అనుగ్రహించే మాసం కార్తీకం. దీపారాధనలు, దీపదానాలు, ధార్మిక క్రతువులు, పుణ్యనదీ స్నానాలు, తులసిపూజలకు అనువైన, మేలైన కాలం కార్తీకం.

**శ్లో ॥ "మాసానాం కార్తీకః శ్రేష్ఠో దేవానాం మధుసూదనః**
**తీర్థం నారాయణాభ్యాం హి త్రిత్రయం దుర్లభం కలౌ"**

మాసములలో కార్తీకం, దేవతలలో విష్ణువు, తీర్థములలో నారాయణ తీర్థం శ్రేష్ఠం. కలియుగం నందు ఈ మూడు దుర్లభములు. కార్తీకమాసంతో సమానమైన మాసం, కృతయుగంతో సమానమైన యుగం, వేదముతో సమానమైన శాస్త్రం, గంగ తీర్థంతో సమానమైన తీర్థం లేదని తెలియుచున్నది. అందువలననే కార్తీక మాసంలో ఏ సత్కార్యం చేసినా ''కార్తీక దామోదర ప్రీత్యర్థం'' అని సంకల్పించుకొని చేయాలి. ఈ మాసంలో చేసే వ్రతాలు, స్నానాలు, జపాలు, దానాలు అన్నీ ప్రశస్తమైనవే. కార్తీక మాసం భక్తికి నిలయమైన మాసం. భక్తులను అనుగ్రహించే మాసం.

చరాచర ప్రపంచంలో శక్తి ఆరాధనకు అధిక ప్రాధాన్యత ఉంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణలో భాగంగా జగన్మాత శైలపుత్రికగా, మహాకాళిగా, బాలాత్రిపురసుందరిగా, లలితాంబగా, మహాగౌరిగా, కనకదుర్గగా అనేకానేక అవతారాలు దాల్చింది. ఆదిపరాశక్తి నామాలన్నీ వేటికవే మధురమైనవి. ఆసేతు హిమాచలం దాకా అండ పిండ బ్రహ్మాండాల దాకా నిండి ఉన్న ఆ మాతను మానవమాత్రులు తప్పక పూజించుకోవాలి. అర్చించుకోవాలి. అమ్మ అర్చన లేని బ్రతుకు వ్యర్థము.

అఖిల జగత్తుకూ మూలదేవతగా జగన్మాతను ఆరాధించడం మన సంప్రదాయం. మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి. ఒక్కో రూపం ఒక్కో శక్తి కేంద్రమై ఈ విశ్వాన్ని కాపాడుతున్నాయి. అష్టాదశ శక్తిపీఠాలతో పాటు, అష్టోత్తర శత శక్తి పీఠాలతో భారతావని అణువణువూ మహాశక్తి కేంద్రమై విరాజిల్లుతోంది. ఈ శక్తిపీఠాలు అకారాది క్షకారాంత వర్ణమాలలోని ఒక్కో అక్షరానికి శక్తి స్థానమైన ప్రతీకలు.

**"లంకాయాం శాంకరీదేవి, కామాక్షీ కాంచికాపురే**
**ప్రద్యుమ్నే శృంఖలాదేవి, చాముండే క్రౌంచపట్టణే**
**అలంపురీ జోగులాంబా, శ్రీశైలే భ్రమరాంబికా**
**కొల్హాపురే మహాలక్ష్మీం, మాహుర్యే ఏకవీరికా**
**ఉజ్జయిన్యాం మహాకాళీ, పీఠికాయాం పురుహూతికా**
**ఓఢ్యాయం గిరిజాదేవీ, మాణిక్యా దక్షవాటికే**
**హరిక్షేత్రే కామరూపా, ప్రయాగే మాధవేశ్వరీ**
**జ్వాలాయం వైష్ణవీదేవీ, గయా మాంగళ్య గౌరికా**
**వారణాస్యాం విశాలాక్షీ, కాశ్మీరేషు సరస్వతీ"**

అని పై శ్లోకం శక్తి పీఠాల వివరాలను పేర్కొంటోంది. ఈ అష్టాదశ శక్తి పీఠాలలో కొల్హాపూర్ ఒకటి. ఇక్కడ కొలువైన మహాలక్ష్మీదేవి అమ్మవారు భక్తుల కొంగు బంగారు. అందానికీ, ఆకర్షణకూ, సౌభాగ్యానికి, సౌజన్యానికి, సౌశీల్యానికి ఆటపట్టు లక్ష్మీదేవి. శ్రీహరి హృదయవాసిని. జగాలను బ్రోచే, కాపాడే మహా ఇల్లాలు. అష్టైశ్వర్య స్వరూపిణి, ప్రదాయిని. అష్టరూపాలలో భక్తులను అనునిత్యం అనుగ్రహిస్తోంది. నిత్యకళ్యాణాల నిచ్చే భాగ్యదేవత. పద్మంలో కొలువుండే అకళంక. సత్సంకల్పముతో అడిగిన ఏ కోరికనైనా



అనుగ్రహించే తల్లి కనుక ఆమెకు వరలక్ష్మి అనిపేరు. జ్ఞానం, చల్లదనాలకు ప్రతీకలైన సూర్యచంద్రులే కన్నులుగా కలిగిన తల్లి. పద్మం వంటి సౌందర్యవంతమైన ముఖమండలం కలిగినది. ఒక చేత్తో పద్మం, మరొక చేతిలో స్వామిని పట్టుకొని ఉంటుంది. మన్మథుని తల్లి, శుభములనిచ్చే తల్లి, దయా దాక్షిణ్యాలు కల పాలవెల్లి మహాలక్ష్మి. చతుర్విధ పురుషార్థాలను అందించడానికి నాలుగు చేతులతో, ఉత్తరా నక్షత్రంలో నిండు పున్నమి శుక్రవారం నాడు అమ్మవారు చక్కదనాల కుప్పగా పాలసంద్రంలో జన్మించింది. ఆ మహాలక్ష్మి కొలువైన కొల్హాపూర్ కడు రమణీయమైన, కమనీయమైన, మహా మహిమాన్వితమైన దివ్యరాజం. పవిత్ర ధామం. ఈ ఆలయం ఎంతో కళాత్మకంగా, విశాల ప్రాంగణంలో అలరారుతోంది. ఈ మాతను పూజించుకోవడానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు తండోప తండాలుగా వస్తుంటారు. ఈ ఆలయానికి నాలుగు వైపులా పెద్ద పెద్ద ద్వారాలున్నాయి. ఆలయంలోని ప్రాచీన భారత శిల్పకళ చూపరులను ఆకట్టుకుంటుంది. అమ్మవారి విగ్రహం వజ్ర వైఢూర్య, బంగారు, వెండి ఆభరణాలతో ధగ ధగ మెరుస్తూ ఉంటుంది. అమృతం కన్నా కమనీయత, కారుణ్యతలు సంపూర్ణంగా ఉన్న కల్పవృక్షం అమ్మ. ప్రకృతిలోని ప్రతి జీవి కదలికకూ, ఎదుగుదలకు తగిన శక్తిని, సామర్థ్యాన్ని ప్రసాదించే చల్లని తల్లి ఆ మహాలక్ష్మి. ప్రళయకాలంలో పరమశివుడు తన త్రిశూలంతో కాశీ నగరాన్ని ఎత్తి రక్షించగా, అమ్మవారు తన కరముతో నీటిలో మునిగిపోయిన క్షేత్రాన్ని పైకెత్తినందువల్ల దీనిని ''కరవీర'' అని కూడా అంటారు. ఇక్కడ మహాలక్ష్మి అధిష్ఠాన దేవత కాగా శివుడు, విష్ణువు నీరు, రాళ్ళుగా, దేవతలందరూ వృక్షములుగా, మహర్షులు ఇసుకగా పరివేష్టించి ఉన్నారని లోకోక్తి.

ఉత్తేజానికి, ఆనందానికి హేతువైన దీపావళి పండుగ సందర్భముగా ఈనాడు చేసే లక్ష్మీపూజని పురస్కరించుకొని ఈ క్షేత్ర పుట్టు పూర్వోత్తరముల గురించి, ఆ దేవి మాహాత్మ్యాన్ని గురించి తెలుసుకుందాం.

పూర్వం కరవీరుడు అను రాక్షసుడు పద్మపురాన్ని పరిపాలించేవాడు. మహాబలవంతుడు. మిక్కిలి క్రూరుడు. పరమశివుని భక్తుడు. శివవరప్రసాదియై అహంకరించి కరవీరుడు తరచు తన సోదరులతో కలిసి స్వర్గలోకము పైకి దండెత్తి దేవతల్ని జయించి తన వశపరచుకొని స్వర్గలోకాన్ని ఆక్రమించాడు. మునులను, బ్రాహ్మణులను అందరినీ బాధించసాగాడు. ఆతని బాధలను భరించలేని దేవతలు, బ్రాహ్మణులు, మునులు త్రిమూర్తులను వేడుకున్నారు. బ్రహ్మ విష్ణులు వారి ప్రార్థనలను విని కరవీరుడు శివభక్తుడని,



శివుని కరుణా కటాక్షములు అతనిపై మెండుగా ఉన్నాయని, అతనిని తామేమీ చేయలేమని తమ అశక్తతను తెలుపగా, అందరూ కలిసి శివుని వద్దకు వెళ్ళి వేడుకున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపమని ప్రార్థించారు. దేవేంద్రుడు వినమ్రుడై అంజలి ఘటించి ''పరమేశ్వరా! కరవీరుని ఆగడాలు నానాటికీ మితిమీరిపోతున్నాయి. నీ భక్తుడని ఉపేక్షించకుండా వెంటనే కరవీరుణ్ణి వధించమని, లోకాల్ని ఉద్ధరించాల్సిన సమయం ఆసన్నమైందని వేడుకున్నాడు. దేవేంద్రుని ప్రార్థనలకు కరుణించిన పరమశివుడు వారికి అభయమిచ్చి సంతుష్టులను గావించాడు.

శివుని అభయ ప్రదానానికి సంతసించిన దేవేంద్రుడు, మునులు, బ్రాహ్మణులు తమ తమ నెలవులకు పయనమయ్యారు. అంతట పరమశివుడు తన భక్తునికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. అహంకారంతో కన్నూ మిన్నూ కానని కరవీరుడు ఆయన మాటల్ని తిరస్కరించాడు. అందులకు ఆగ్రహించిన శివుడు కరవీరునితో యుద్ధానికి తలపడ్డాడు. ఇరువురి నడుమ యుద్ధము కొన్నాళ్ళు సాగింది. ఇరువురి నడుమ భీకర యుద్ధము సాగింది. నానాటికీ కరవీరుడు రెట్టించిన ఉత్సాహంతో యుద్ధం చేయుచుండగా ఆగ్రహించిన పరమశివుడు తన ఫాలాగ్ని జ్వాలలతో కరవీరుణ్ణి, ఆతని సోదరులను సంహరించాడు. శివుని చేతిలో పరాజయుడై

చనిపోతూ రిక్తహస్తాలతో శివుణ్ణి ప్రార్థించుచు తన పేరు మీద ఈ పద్మపురాన్ని కరవీరపురంగా మార్చమని, తద్వారా ఈ ప్రాంతం, తన పేరు ప్రసిద్ధి చెందాలని వరాన్ని కోరుకున్నాడు. అందుకు శివుడు అంగీకరించి తథాస్తు అన్నాడు.

కరవీరుని తండ్రి కోలహుడు. తన కుమారులు శివుని ఆగ్రహానికి గురై మరణించారని తెలుసుకుని కుమారుల మరణానికి కారణమైన దేవతల మీద పగబట్టాడు. దేవతల్ని హింసించాడు. మహర్షులను నానా హింసలకు గురి చేశాడు. ధర్మాన్ని అణగద్రొక్కి, అధర్మాన్ని ప్రజ్వరిల్ల చేశాడు. యజ్ఞ యాగాదులను ధ్వంసం చేశాడు. కోలహుని అరాచకత్వాన్ని సహించలేని మునులు, దేవతలు కపిల మహర్షి ఆశ్రమంలో ఉన్న మహాలక్ష్మిని వేడుకున్నారు. దేవతల ప్రార్థనలను విన్న మహాలక్ష్మి వారిని ఓదార్చి పంపించింది. అనంతరం దేవతలతో కలిసి మహాలక్ష్మి మహోగ్రరూపంతో, మహోజ్జ్వల తేజంతో, అష్టాదశ భుజాలతో సింహవాహనం మీద కరవీర పట్టణానికి వచ్చి కోలహుని కోటను ముట్టడించింది. చారుల ద్వారా ఆ విషయం తెలుసుకున్న కోలహుడు తగిన సైన్యంతో ఆమె మీదికి దండెత్తాడు. ఇరువురి నడుమ భీకర యుద్ధం జరిగింది. కోలహుని మీదికి మహాలక్ష్మి బ్రహ్మాస్త్రాన్ని సంధించింది. మిగిలిన చేతులతో పదునైన బాణాలను ప్రయోగించి సైన్యాన్ని సంహరించింది.

దేవి చేతులలో ఎప్పుడైతే సైన్యమంతా నశించిందో తనకిక చావు తప్పదని గ్రహించి కోలహుడు తల్లి పరమేశ్వరితో "అమ్మా! నీ చేతిలో చావు తప్పదని తెలిసి, ఇంతవరకు పోరాడాను. క్షత్రియ ధర్మంతో నీతో యుద్ధం చేశానే తప్ప, నీమీద శత్రుభావమేదీ లేదు. నా అహంకారమంతా అణచివేశావు. చివరిసారిగా నిన్ను ఒక కోరిక కోరుతున్నాను. ఈ కరవీరపురం (పద్మపురం) నా పేరుతో కోలాహపురంగా పిలవబడాలి. షోడశ కళలతో నీవిక్కడ కొలువై ఈ పురాన్ని కాపాడుతుండాలి. నీ కృపా కటాక్షాలతో ఈ పురం కరువు కాటకాలు లేకుండా, ఈతి బాధలు లేకుండా విరాజిల్లాలి. ఈ పురం సాధనా క్షేత్రంగా, సిద్ధక్షేత్రంగా విరాజిల్లాలి. నా కోరిక తీర్చి నన్ను ధన్యుణ్ణి చేయమని ప్రార్థించాడు. అందులకు మహాలక్ష్మి బదులిస్తూ "కోలహా! నువ్వు అడిగినవన్నీ అనుగ్రహిస్తున్నా"నని పలికి బ్రహ్మాస్త్రంతో అతణ్ణి సంహరించింది.

మహాలక్ష్మి చేతిలో ఎప్పుడైతే కోలహుడు మరణించాడో బ్రహ్మాది దేవతలు ఆనంద భరితులై జయ జయ ధ్వనులతో, ముక్త కంఠంతో మహాలక్ష్మిని స్తుతించారు. దేవదుందుభులు మ్రోగాయి. పుష్పవర్షం కురిపించారు. దేవతల స్తుతులతో ప్రసన్నురాలైన మహాలక్ష్మి వేల్పులను కనికర చూపులతో చూస్తూ వారిని దీవించింది. కాలక్రమంలో దేవశిల్పి మయుడు అద్భుత శిల్పకళా చాతుర్యంతో శ్రీచక్రాకారంలో దేవాలయాన్ని నిర్మించాడు. గర్భగుడిలో పద్మంలో ఆసీనురాలై యుంటుంది అమ్మవారు. అమ్మవారు పశ్చిమాభి ముఖురాలై భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. మహాలక్ష్మి విగ్రహం వెనుక శిలతో చెక్కబడిన సింహవాహనం ఉంటుంది. అమ్మవారి కిరీటంలో విష్ణువు శయనించే ఆదిశేషుడు కొలువై యున్నాడు. చతుర్భుజాలతో కుడిచేతిలో నిమ్మకాయ ఉంటుంది. కుడిచేతి యందు పైభాగాన కౌముదికం ఉంటుంది. ఎడమ చేతిలో కటకమనే ఆయుధం, కింది చేతిలో ఒక పాత్ర ఉంటుంది. ఈ నాలుగు చేతులు నాలుగు ప్రత్యేక ధర్మాలను కలిగి ఉంటాయి. పడమరలో ఉన్న గోడకు ఉన్న చిన్న కిటికీ ద్వారా మార్చి 21 నుండి సెప్టెంబర్‌లోపు మూడు రోజులు సూర్యాస్తమయ కిరణాలు అమ్మవారి ముఖంపై పడి వింత శోభను చేకూర్చుతుంది. అలాగే ఫిబ్రవరి ఒకటి, నవంబరు పదవ తేదీన కిరణాలు అమ్మవారి వక్షస్థలంపై పడతాయి. ప్రతిరోజు మధ్యాహ్నం దత్తాత్రేయుడు ఇక్కడకు వచ్చి అమ్మవారి భిక్ష స్వీకరిస్తూ ఉండటం ఆచారంగా వస్తోంది. ప్రళయ కాలంలో కూడా ఇక్కడ మహాలక్ష్మి, మహావిష్ణువు ఉంటారని పురాణ కథనం. అందుకే దీనిని విముక్త క్షేత్రమని అంటారు. ఆలయంలోని అమ్మవారి విగ్రహం వజ్ర, వైఢూర్య, బంగారు, వెండి ఆభరణాలతో ధగధగా ప్రకాశిస్తూ ఉంటుంది.

ఆ తల్లి ప్రీతికై చేసే దానములు, దీపారాధనలు ఎనలేని ప్రాధాన్యాన్ని పొందాయి.

"ఉద్యద్భాను సహస్రభా, సోమ సూర్యాగ్ని లోచనా, భూమండల మధ్యస్థా" అని శ్రీమాత వర్ణించబడింది. అటువంటి విశ్వైకమాత ఐన శ్రీమాత తన భక్త సంతతికి జీవితాల్లో తన కటాక్ష సూర్యకిరణాలతో దుఃఖమయమైన అంధకార బంధురాన్ని తొలగించి, వారి వారి జీవితాలను సహస్ర సూర్యకాంతిమయం చేసే అమృతవర్షిణి, జ్ఞానస్వరూపిణి, ఆనందస్వరూపిణి, వర మహాలక్ష్మి, శ్రీ మన్మహాలక్ష్మి. మంగళ శుక్రవారాల్లో అమ్మవారికి విశేషంగా ఆకారతి, పంచారతి, కాపూరతి హారతులు ఇస్తారు. ఈ హారతులను చూచి తీరవలసిందే కానీ వర్ణించనలవి కాని విధంగా ఉండి తన్మయులను గావిస్తాయి.

చల్లని చూపుల కరుణాంతరంగితాక్షియైన ఆ మాతను పూజించి, ఆ మాత దీవెనలతో ఆనందమయమైన జీవితాన్ని గడుపుదాం.

**"సర్వజ్ఞే సర్వవరదే సర్వ దుష్ట భయంకరీ**
**సర్వ దుఃఖహరే దేవీ మహాలక్ష్మీ నమోస్తుతే**
**సిద్ధి బుద్ధి ప్రదే దేవీ భుక్తి ముక్తి ప్రదాయిని**
**మంత్రమూర్తే సదా దేవీ మహాలక్ష్మీ నమోస్తుతే**

**"ఓం నమో లక్ష్మీ శ్రీనివాసాయ నమో నమః"**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## సుమిత్రుడు

సూత మహర్షి వస్తుండటంతో మునులందరూ లేచి నిలబడి నమస్కారం చేశారు. ఆయన వారినందరినీ ఆశీర్వదించి వేదిక నధిరోహించి విఘ్నేశ్వరుని ప్రార్థించి నాటి ఉపాఖ్యానాన్ని చెప్పటం ప్రారంభించాడు.

మునులారా! ఈరోజు ఆశ అనేది మనసు నెంత వికలం చేస్తుందో, దానివల్ల మనిషి ఎంతగా క్షీణిస్తాడో సుమిత్రుడనే రాజు చరిత్ర ద్వారా వినిపిస్తాను. హైహయ వంశంలో జన్మించిన ఒక రాజు సుమిత్రుడు. ఒకనాడా మహారాజు వేటకని అడవికి వెళ్ళాడు. మృగాలను వెంటనంటి వెడుతూ ఒక మృగం మీద సునిశితమైన బాణాన్ని ప్రయోగించాడు. ఆ బాణం తాకిడికి బాధపడుతూ ఆ మృగం పరుగెత్తసాగింది బాణంతో సహా. ఈ మృగం నా బారి నుండి తప్పించుకు పోతుందా అని ఆవేశంతో దాని వెంట వేగంతో రథాన్ని నడిపాడు. కాని మృగం చాలా దూరంగా వెళ్ళడంతో రాజు మరింత వేగంగా దాని వెంటబడ్డాడు. అది దగ్గరగా ఉన్నట్లే కాసేపుండి, రాజుకు కానరానంత దూరానికి పరిగెత్తేది. మళ్ళీ దగ్గరగా ఉన్నట్లుండేది. ఈ విధంగా దగ్గరగా కాసేపు, దూరంగా కాసేపు కనిపిస్తున్నట్లున్న మృగం సుమిత్రుణ్ణి మహారణ్యం మధ్య లోకి తీసుకుపోయి, అసలు కనపడకుండా వెళ్ళిపోయింది. దానితో విసుగుకు, శ్రమకు లోనైన సుమిత్రుడు అక్కడకు దగ్గరలో మునిపల్లె ఉండటాన్ని గమనించాడు. ఇక మృగం మీద ఉన్న ఆశను విడనాడి పల్లెలోకి ప్రవేశించాడు. అలసి సొలసిపోయి ఉన్న రాజును చూసి అక్కడి మునులాయనకు పళ్ళు, నీళ్ళు ఇచ్చి దప్పిక తీర్చారు. కొద్దిగా సేద తీరిన సుమిత్రుడు మునులందరినీ ఆప్యాయంగా చూశాడు.

ఋషభుడనే ముని రాజును చూసి ''మహారాజా! నీవు ఒక్కడివీ ఒంటరిగా ఈ మహారణ్యంలోకి ఎందుకు వచ్చావు? ఏ పని మీద ఇక్కడకు రావలసి వచ్చింది? ఎందుకింత బాధతో కుమిలిపోతున్నావు? నీ ముఖం చూస్తే చాలా దస్సిపోయినట్లు కనిపిస్తున్నావు. ఏం జరిగింది రాజా?'' అని ప్రశ్నించాడు.

మహర్షిసత్తమా! నేను వేట నిమిత్తం ఈ మహారణ్యానికి వచ్చాను. కుతూహలంతో రావటమే నా ఒంటరితనానికి

కారణం. ఒక మృగాన్ని బాణమేసి కొడితే అది బాణంతో సహా పారిపోతుంటే – దానిని పట్టుకోవడానికి ఇంతదూరం వచ్చాను.

**"ఆ సొసల వచ్చితి, నను**
**గాసింబెట్టి యది యడవి గవిసెను, మృగయా**
**వ్యాసక్తుడు వగచుం దన**
**యేసిన మృగ మనఘ! తప్పి యేగుటకు గడున్"**

**–153 ప – తృ.ఆ – శాం.ప – మహాభారతము**

"నాకు వేట అంటే చాలా ఇష్టం. ఎలాగైనా సరే ఆ మృగాన్ని పట్టి తీరాలనే ఆశ నాలో అంతకంతకూ పెరిగింది. అది నాకందకుండా అటూ ఇటూ, ముందుకూ వెనుకకు రకరకాలుగా పరుగెత్తుతూ, నన్ను నానా యాతనలూ పెట్టింది. వేటంటే పిచ్చి కోరిక గల వేటగాడు – ఆ జంతువు తన నుంచి తప్పించుకుపోతే ఎంతో బాధపడతాడు. ఆశను వదులుకోలేక దీనస్థితికి చేరుకొంటాడు. మహర్షీ! ఆశ నుంచి తప్పించుకోలేమా? ఆశలో అంత తీవ్రత ఉంటుందా? ఆశ తీరకపోతే మనిషి బ్రతకనే బ్రతకలేడా? నా మనస్సును గురించి ఆలోచిస్తుంటే నాకే ఆశ్చర్యం వేస్తోంది. ఆ మృగాన్ని పట్టుకోలేకపోతే నా పరాక్రమమంతా వృథాయే అంటారా? ఇంత ధైర్యం నాకెప్పుడూ కలగలేదు. ఆశలో ఇంత ప్రభావం ఉందని ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది. ఆశను మాన్పుకోలేమంటారా? చెప్పండి స్వామీ!" అన్న సుమిత్రునిపై చూశాడు ఋషభుడు. "మహారాజా! నీ ప్రశ్నకు సమాధానంగా ఒక విషయం చెబుతాను విను. ఒకప్పుడు నేను తీర్థయాత్రలు చేస్తూ పుణ్యప్రదమైన బదరికాశ్రమం చేరుకొన్నాను. అక్కడ 'తను'డనే మహర్షిని చూసి కొద్దిగా ఆశ్చర్యపోయాను. ఎందుకంటావేమో – ఆ తపస్వి బక్కచిక్కి ఉన్నాడు. కాని అతని కళ్ళల్లో తేజస్సు ఉట్టిపడుతోంది. నాలో అతనిపట్ల భక్తి చోటు చేసుకుంది. వెంటనే ఆయన కాళ్ళకు నమస్కరించాను. ఆయన ఆదరంతో చక్కని ఆతిథ్యమిచ్చాడు. సంతోషంతో ఆ ముని వద్ద ఎన్నో ధర్మమార్గాలు వినగలిగాను. ఆవిధంగా ఆయన నాకు బోధిస్తుండగా ఒక మహారాజు అక్కడకు వచ్చాడు.

ఆ రాజు ముఖంలో దుఃఖం నిండుకొని ఉంది. ఆతని వెంట భార్య, సైన్యం కూడా రావటంలో ఏం జరిగి ఉంటుందా అనే ఆలోచనకు లోనైనాను. ఆ మహారాజు భార్యతో సహా తనుడనే మహర్షికి సాష్టాంగంగా ప్రణమిల్లి ఎదురుగా కూర్చున్నాడు. మహర్షి వాళ్ళందరికీ అతిథి సత్కారాలు చేసి "మహారాజా! మీ రాకకు గల కారణం చెప్పండి" అని సాదరంగా అడిగాడు. దానికి దీనవదనంతో చెప్పసాగాడు మహారాజు. "మహాత్మా! నాకు ఒక్కడే కొడుకు. వాడు సకల సద్గుణరాశి. ఆడుకొందామనే కోరికతో ఒకరోజు దట్టమైన అడవిలోకి వెళ్ళాడు. ఎప్పటికీ తిరిగి రాకపోయేటప్పటికి ఏమయ్యాడా? అనే బాధతో మేమందరమూ ఆ బాలుని, నా పుత్రుని వెతికి తీసుకువెళ్ళటానికి ఈ అడవిలోనికి వచ్చాము. ఎంత వెతికినా, అడవి అంతా తిరిగినా వాడు దొరకలేదు. ఇంకా వెతికితే దొరుకుతాడేమో అనే ఆశను చంపుకోలేక, మీ దయను పొందుదామనే కోరికతో మీ చెంతకు వచ్చాను. ఇదీ కారణం స్వామీ! నా రాకకు" అని మౌనం వహించాడు మహారాజు. 'తను' మహర్షి కూడా చింతిస్తూ తల దించుకున్నాడు.

> "రాజా! విన్నావు కదా. ఆశ మనిషిని ఏ విధంగా కించపరుస్తుందో! ఒకసారి ఆశకు లోబడినవాడు తేరుకోవడం తొందరగా సాధ్యం కాదు" అని తెలియచెప్పి రాజుకు ఊరట కలిగించాడు.

**"చింతించు నతనితో భూ**
**కాంతుండిట్లనియె మఱియుఁ గాఢ తరాశా**
**క్రాంతత దుర్లభ ఫలయగు**
**టింత యసహ్యమగు నయ్య యెడద మునీంద్రా!"**

**–159 ప – తృ.ఆ – శాం.ప – మహాభారతము**

మహాత్మా! నా కర్ణం కావటం లేదు. వదలలేకపోయిన, గాఢతరమైన ఆశ తీరకపోయి అడియాసగా మారిపోతే, నిష్ఫలమయితే, మనసు దానిని భరించలేక ఇంత వేదనపాలవుతుందా? ఆ ఆశ ఎలా తీరుతుంది? ఇక మరణమే దానికి అందే ఫలమా? నేను ఏం చేస్తే ఊరట పొందగలను? బాధ నుండి ఎప్పటికైనా ధైర్యాన్ని తెచ్చుకొని మనగలనా? మానవుడి దుస్థితి ఇంతేనా? చెప్పండి" అని దీనాతి దీనంగా రాజు అడిగేసరికి, మహర్షి ఆతనిని చూసి చెప్పసాగాడు.

రాజా!

**"ఏ నరుడు మానసము ధృతి**
**నూన నుచితవృత్తి నుండు నుదిల్ల గొనక యెం**
**దైనను నెయ్యది యేనియు**
**వానికి దుర్లభము లేదు వసుధాధీశా!"**

**–ప.161 – తృ.ఆ – శాం.ప – మహాభారతము**

ఏ మానవుడైనా సరే ధైర్యాన్ని చిక్కబట్టుకొని ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ విషయంలోనైనా సరే ఎంతమాత్రం చలించకుండా మనసును తన అధీనంలో ఉంచుకొని, దుఃఖాన్ని దరిచేరకుండా

ఉంచగలిగితే అతడికి లభించని సత్ఫలితమంటూ ఏదీ ఉండదు. ఇంకో విషయం చెబుతాను విను. ధనము, ఇతర సుఖకరములైన వస్తువులను ఆశించి, వాటిని ఇమ్మని అడిగేవాడిని సిగ్గుపడేటట్లు చేయకుండా, అతడు కోరుకున్న వాటినన్నిటినీ, అతడికి అందగలిగేటట్లు చేసే వ్యక్తి ధన్యుడనుకో. అటువంటి సుగుణశీలి లోకాలన్నిటిలో ఎక్కడ వెతికినా దొరకనే దొరకడు'' అని చెప్పి తను మహర్షి తన జీవితంలో పూర్వం జరిగిన సంగతిని గుర్తు చేసుకుని మళ్ళీ చెప్పసాగాడు.

మహారాజా! గుణవంతుడైన ఒకడు కూడు, బట్టలు లేక దరిద్రంతో బాధపడుతున్న కారణం చేత వాటిని పొందడానికి ఒక ధనవంతుని ఆశ్రయించాడు. ఆ ధనవంతుడు మహారాజు కూడా. కాని, ధనమడిగిన ఆ పేదవానిని లక్ష్యపెట్టక మూర్ఖుడైన రాజు వానికి ఏమీ ఇవ్వక, నిందా వాక్యాలతో తిరిగి పంపివేశాడు. ఆశ భగ్నం కావడంతో సిగ్గుచేటు కాలవాలమైన ఆశను త్యజించాలని నిశ్చయించుకున్నాడు. నిరాశకున్న విలువనూ గ్రహించినవాడై ఎవరిని గురించి గాని, దేని గురించి కాని ఆశపడనని ఒక వ్రతం బూనాడు. దానితో ఆతని మనసు కుదుట పడింది. అడిగి లేదనిపించుకోవటంకంటే అడగకుండా ఉండటమే శ్రేయమనే దృఢ సంకల్పాన్ని మనసులో దాచి ఉంచాడు. ఆ పేదవాడు ఎవరో కాదు మహారాజా! నేనే. ధనం కోరి, విఫల ప్రయత్నుడనై విరాగి నయ్యాను. అది నాకెంతో ఉపయోగపడిందనుకో. వైరాగ్యం అతిశయిస్తుంటే, దానిని అణచివేయటానికి, తపస్సు చేయటానికి పూనుకొన్నాను. తపస్సే నాకన్ని విధాలా తృప్తినీ, శ్రేయస్సునీ ఇచ్చిందనుకో. నీకో విషయం చెబుతాను. శ్రద్ధగా గుర్తుంచుకో అది ఏమంటే – ఇస్తానని ఆశపెట్టి దానిని ఇవ్వని వాడిమీద, కృతఘ్నునిపైన, దుష్టుడిపైనా ఎప్పుడూ ఆశ పెట్టుకోకూడదు. అటువంటి ఆశను కొనసాగించకూడదు. ఇవే కాదు, ఇంకా ఎన్నో విషయాల పట్ల రకరకాల, ఆశలు కలుగుతాయి. వాటినన్నింటినీ వదులుకుంటేనే సుఖపడతావు. ఆశను పెంచుకోకూడదు, త్రుంచివేయాలి – అన్న సత్యాన్ని గుర్తించిన మానవుడికి కష్టమే ఉండదు. కోరిక నెరవేరితే ఏ బాధా ఉండదు. నెరవేరకపోతేనే, అది నెరవేరి తీరాలనే ఆశ అంతకంతకు వృద్ధి చెందుతుంది. కనుక ''వీరద్యుమ్న మహారాజా! నీ పుత్రుడు నీకు దొరికి తీరాలనే ఆశను వదిలివేశావనుకో ఈ వేదనా, ఈ శ్రమా, ఈ అసంతృప్తీ నీకు కలగవు'' అని 'తను' మహర్షి బోధించగా వీరద్యుమ్నుడు శాంతమనస్కుడైనాడు. అది గమనించిన 'తనుడు' తన తపో మహిమ చేత రాజపుత్రుని తన చెంతకు రప్పించి వీరద్యుమ్నునికిచ్చి అతనిని సంతోషింపచేశాడు'' అని చెప్పి ఋషభముని సుమిత్రుని చూసి ''రాజా! విన్నావు కదా. ఆశ మనిషిని ఏ విధంగా కించపరుస్తుందో! ఒకసారి ఆశకు లోబడినవాడు తేరుకోవడం తొందరగా సాధ్యం కాదు'' అని తెలియచెప్పి రాజుకు ఊరట కలిగించాడు.

''మహాత్మా! ఋషభ మునీంద్రా! మీ పల్లెకు వచ్చినందుకు నాకు ఎంతో మంచి కలిగింది. మీ వంటి తపస్సంపన్నులు బోధ పరిస్తేనే మావంటి వారి అజ్ఞానం తొలగిపోతుంది. అతి సాధారణమైన ఒక మృగం కోసం ఆశపడ్డానంటే, నా ఆభిజాత్యం కుంటువడిందే అని కుంచించుకుపోయానంటే, అంతకంటే ఇంకేం కావాలి మహర్షీ! నా హీనతకు మీ బోధలు నాలోని ఆశను అణచివేశాయి. ఒక్క మృగం మీదే కాదు. ఇక దేనిమీదా నాకు ఆశ లేదు. మీ ఆశీర్వచనమే నాకు రక్ష'' అని లేచి ఋషభుడికి సాష్టాంగ నమస్కారం చేసి సుమిత్రుడు తిరుగు ప్రయాణానికి సిద్ధపడ్డాడు'' అని సూత మహర్షి చెప్పగానే శౌనకాది మునులందరూ ''ఆహా! ఆశ ఇంత చెడ్డదా? మనిషిని అథః పాతాళానికి కూలదోస్తుందా?'' అని ఒకరితో ఒకరు ముచ్చటించుకొంటూ ఆశ్రమాలకు బయలుదేరారు. సూతమహర్షి కూడా వారితో సంభాషిస్తూ, నిజాశ్రమం వైపు నడక సాగించాడు.

## కాపవ్యోపాఖ్యానము

మరునాడు మునులందరూ ముందుగానే వచ్చి కూర్చుని సూతమహర్షి రాక కోసం ఎదురు చూడసాగారు. సూత మహర్షి రావటం చూసి అందరూ లేచి నిలబడి ఆయనకు నమస్కరించి ఈనాడేమి చెప్పబోతున్నారో వినాలనే ఆకాంక్షతో ఆయన వైపు చూశారు. సూతర్షి వారిని ఆశీర్వదించి ''ఈరోజు హింసా ప్రవృత్తితో జీవించే వారిలో కూడా న్యాయం, ధర్మం – ధ్యేయంగా పెట్టుకొని పరోపకార బుద్ధితో మనుగడ సాగించే ఉత్తములలో ఒకడైన ఒక బోయ వాడి గురించి చెబుతాను. నేను చెప్పినదంతా విన్న తరవాత లోకంలో ఇటువంటి వారు కూడా ఉన్నారా! అని ఆశ్చర్యపోతారు''. ఇదేదో క్రొత్తగా ఉన్నట్లుంది. తప్పక వినాల్సిందే అని అనుకొంటూ మునులందరూ శ్రద్ధాళువులైనారు.

''పారియాత్ర పర్వతం మీద కాపవ్యుడనే పేరుగల బోయవాడొకడు జీవిస్తుండేవాడు. అతడు సుగుణవంతుడు, ధర్మపరుడు. న్యాయానికి విలువ ఇచ్చేవాడు.

**"అవనీశ! పారియాత్రాచలంబున నుండు**
**నొక బోయ ధర్మ సంయుక్త బుద్ధి**
**వింట నేర్పరి మృగ వితతి ప్రకారజ్ఞుఁ**
**డారణ్యదేశ సంచారశాలి**
**తల్లికిఁ దండ్రికి తద్దయు భక్తుడై**
**ఫలమూల మధుమాంసములును మేలి**

కూడు గూరలు దొర కొల్పి వారికి తృప్తి
యావహించుచు శయనాస నాదు
లగు పదార్థముల్ హృద్యంబులుగ నొనర్చు
వలయు నాహార ములు మునివరుల కిచ్చు
పగఱ తోచిన పరిమార్చు భండనమున
నొకడ వేవురనైన మహోగ్ర గతుల"

**–177 ప – తృ.ఆ – శాం.ప – మహాభారతము**

ఆ కాపవ్యుడి ప్రవర్తన అత్యంత శ్లాఘనీయంగా ఉంటుంది. అతడు విలువిద్యలో మిక్కిలి నేర్పరి. జంతువుల తీరుతెన్నులను బాగుగా తెలిసినవాడు. అరణ్యాలలో సంచరించే విధానాలన్నీ ఎఱిగినవాడు. ఇక తల్లితండ్రులంటే అతనికి అపారమైన భక్తి. వారికి ఏది కావాలన్నా అది సమకూర్చేవాడు. ఫలాలు, కందమూలాలు, పుట్టతేనె, చక్కని మాంసం, మంచి కూరలు, ఇంపైన భోజనం – ఒకటేమిటి? సర్వం తెచ్చిపెట్టి వారికి సంతృప్తిని కలిగించేవాడు. పడుకొనటానికి కావలసిన చక్కని మంచాలను, పరుపులను అమర్చేవాడు. కూర్చొనడానికి అందమైన ఆసనాలను (పీటలను) ఏర్పాటు చేసేవాడు. ఆ పర్వత ప్రాంతంలో తపస్సు చేసుకొనే మునులందరికీ ఎవరెవరికి ఏయే ఆహార పదార్థాలు కావాలో వాటినన్నిటినీ వారికందించి వారి దీవెనలు పొందేవాడు. ఆ కొండ కోనల వద్ద శత్రువులు కనబడితే వారితో యుద్ధం చేసి, వాళ్ళు వెయ్యి మంది అయినా సరే – తానొక్కడే వారందరితో మహాభయంకరంగా పోరాడి వారినందరినీ హతమార్చేవాడు. అంతటి పరాక్రమశాలి – కాపవ్యుడు. అతడి బలం ముందు ఎంతటి శక్తిమంతుడైన సరే ఓడిపోవాల్సిందే. ఆ పర్వతారణ్య ప్రాంతాలలో తిరుగాడే వేటగాండ్రందరూ కాపవ్యుని బలపరాక్రమాలకు భయపడి పారిపోయేవారు. ఆ చుట్టు ప్రక్కల నివసించే దొంగలకు ఒక వినూత్నమైన ఆలోచన కలిగింది. అంతటి మహావీరుడు తమకు నాయకుడైతే తమకు ఎవరివల్లా, ఏ ఆపదా కలగదని భావించారు. ఆలోచించి, ఆలోచించి దొంగలందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. వారు కాపవ్యుని వద్దకు వెళ్ళి, ఆతనిని ప్రార్థించి, ఏ విధంగానైనా ఆతనిని తమకు నాయకుడిగా ఉండటానికి అంగీకరించేటట్లు చేయాలని పూనుకొన్నారు. తమ ఆలోచన నెరవేరాలని దేవుని ప్రార్థిస్తూ దొంగలు కాపవ్యుని వద్దకు వెళ్ళి వినయవంతులై నమస్కరించారు. గౌరవంతో తమ కోరికను కాపవ్యునికి నివేదించారు. ఆ నివేదించటంలో కూడా వారి మనో నిశ్చయం స్పష్టంగా కనిపించటంతో ఆశ్చర్యంగా వారి మాటలను వినసాగాడు కాపవ్యుడు.

"బలవిక్రమ సంపన్నుడ
వలఘు చరిత్రుడవు మమ్ము నందఱ ప్రభువై
తలకొని రక్షింపుము, నీ
వలచిన పని గొనుము పుత్ర వర్గముఁ బోలెన్"

**–ప. 180 – తృ.ఆ – శాం.ప – మహాభారతము**

''దొరా! నీకున్న బలం గాని, పరాక్రమం గాని వేరెవ్వరిలోనూ లేవు. నీ నడత చాలా గొప్పది. సామాన్యమైనది కాదు. మేమందరం ఎప్పుడూ నీ గురించే, నీ శౌర్యం గురించే మాట్లాడుకుంటూ ఉంటాము. నీ నాయకత్వం కింద మేము పని చేయాలని అనుకొంటున్నాము. నీవు తప్ప మమ్మల్ని రక్షించగల వీరుడెవడూ లేడు. మాకు నీవే ప్రభుడివి. మా మాట నమ్ము. మమ్మల్ని నీ కొడుకులుగా భావించు. నీవు ఏ పని చెబితే ఆ పనిని తప్పకుండా చేసి నీ మెప్పును పొందుతాము. దయచేసి మమ్మల్ని నీ సేవకులుగా స్వీకరించు. నీకిష్టం లేని పని ఏదీ చేయము. నాయకా! మా ప్రార్థన మన్నించు'' అని మళ్ళీ కాళ్ళకు వంగి నమస్కరించిన వారిని చూసి తన అభిప్రాయాన్ని చెప్పడం మొదలుపెట్టడంతో అందరూ కాపవ్యుడు 'ఏమి చెబుతాడా' అని శ్రద్ధగా అతనినే చూడసాగారు.

"శిశు జన మునిజన స్త్రీ జనంబుల చంప
గాదెట్టి వాడైనఁ గడగి మీద
కలియక పాడుచుట కల్మషం బంగన
చెఱపట్ట దగదు, విశేషమొకడు
వినుడెల్ల సత్త్వంబులను బెంటి చంపుట
పాపంబు, గోవుల బ్రాహ్మణులను
సంకల పెట్టంగఁ జనదు తదీయ హి
తము గోరి పూని యుద్ధంబు సేత
యధిక పుణ్యంబు సస్యక్రియా విఘాత
మాచరించుట కడు దోష, మవని ప్రజకు
బాధ గావించి కుడిచి శవంబు దొలుచు
పువ్వుగతినది వొలియంగఁ బొలియు నతడు"

**–182 ప – తృ.ఆ – శాం.ప – మహాభారతము**

''నాయనలారా! నేను చెప్పేది శ్రద్ధగా వినండి. నా మాటలు మీకు నచ్చితే కనుక నాయకత్వం గురించి తర్వాత ఆలోచిద్దాం. మళ్ళీ వివరంగా చెబుతాను. విని అర్థం చేసుకోండి''.

ఇప్పటివరకు మీరు ఎన్నో అక్రమాలకు పాల్పడి ఉంటారు. దారి కాచి ప్రయాణీకులను నానా హింసలకు గురి చేసి ధనాన్ని అపహరించి ఉంటారు. సజ్జనులను హతం చేసి కూడా ఉంటారు. ఇవన్నీ పాపకార్యాలని మీరనుకొని ఉండరు. ఈ క్షణం నుంచి అవన్నీ మరచిపోండి. అందరూ మెచ్చేటట్లు మంచిగా మెలగాలి. మంచి పనులెలా చేయాలో చెబుతాను వినండి. ముందుగా దొంగతనం చేయటం వదలిపెట్టండి. దొంగలనే ముద్ర మీమీద పడకుండా నీతిగా ప్రవర్తించండి.

పసిబిడ్డల ను, ఋషులను, స్త్రీలను ఎట్టి పరిస్థితిలోను చంపకూడదు. మరొకమాట. మన మీదికి పోరాడడానికి రానివాడు ఎటువంటివాడైనా (నీచుడైనా, ఉత్తముడైనా సరే) – వాడి మీదికి వెళ్ళి అన్యాయంగా వాడిని చంపటం మహా పాపం. స్త్రీలు కనిపించారు కదా అని కాముకులై వారిని బలాత్కారం చేయకూడదు. ఇంకో గొప్ప విషయం చెబుతాను. మరచిపోకండి. క్రూర జంతువులలో గాని, సాధు జంతువులలో గాని ఆడ జంతువును చంపటం అంత పెద్ద పాపం మరొకటి ఉండదని తెలుసుకోండి. మీరు వేటగాళ్ళే కావచ్చు. అయినా శక్తి హీనలైన ఆడ జంతువులను చంపటం నేరమే అవుతుంది. పుణ్యమూర్తులైన గోవులను, తపస్సంపన్నులయిన బ్రాహ్మణులను కష్టపెట్టకూడదు. మనకు చక్కని ఆహారమైన పాలనిచ్చే గోవుల యొక్క, విద్యా ప్రదాతలైన బ్రాహ్మణుల యొక్క మేలు కోరి, వారిని హింసించే పాపాత్ములతో యుద్ధం చేసి, వారిని రక్షించటం అధిక పుణ్యాన్ని ప్రసాదిస్తుందని గుర్తుంచుకోండి. పంటపొలాలను నాశనం చేయటం ఎంత దోషమో చెప్పనలవి కానిది. ప్రజలకు బాధ కలిగిస్తూ సంపద నార్జించి జీవించే మనిషి – శవాన్ని తొలిచి కొద్దిసేపు మాత్రమే బ్రతికి, ఆ శవం నాశనం కాగానే తాను నశించిపోయే పురుగు మాదిరి, ఎవరి వలన తాను పొట్ట నింపుకోగలిగాడో – ఆ వ్యక్తి మరణించగానే తాను ప్రాణం కోల్పోతాడు. చోరులారా! ఇప్పటివరకూ నేను మీకు చెప్పిన విషయాలన్నిటిలో ధర్మమేదో, అధర్మమేదో మీరు తెలుసుకోగలిగితే పుణ్యాత్ములౌతారు. కేవలం తెలుసుకోవటమే కాదు, ధర్మబద్ధంగా నడచుకోవాలి. ఆ విధంగా ధర్మపరులై, నీతిమంతులై మీరు ప్రవర్తిస్తే కనుక నేను చెప్పినట్లు వింటూ, ఆవిధంగా మనుగడ సాగిస్తూ మీరు ఉంటే కనుక తప్పక మిమ్మల్ని ఆదరిస్తాను. ఆదరించటమే కాదు, మీకు నాయకుడినై మీతో సఖ్యం చేస్తాను. మీకు సౌఖ్యాన్ని కలిగిస్తూ ఎప్పుడూ మీ యోగక్షేమాలను చూస్తూ మిమ్మల్ని కాపాడుతుంటాను'' అని అన్న కాపవ్యుని మాటలకు ఎంతో సంతోషించిన చోరులు అతని కాళ్ళమీద పడి – ''దొరా! నీ మాటలు ఎంతో మంచిగా ఉన్నాయి. మా బుద్ధిలో ఉన్న చెడంతా క్షణంలో పోయిందనుకో. నీవు ఎలా చెబితే అలా చేస్తాం. సత్యంగా నీ భటుడిలా మెలుగుతాం. మాకు మంచేదో, చెడేదో తెలియజెప్పావు. ఎన్నడూ నీ ఆన తప్పం. మమ్మల్ని దయతో నీ అనుచరులుగా స్వీకరించు'' అని వేడుకొన్నారు. కాపవ్యుడు దానికంగీకరించి వారికి నాయకుడిగా ధర్మ ప్రవర్తనను నేర్పుతూ వారిని మంచివారిగా తీర్చిదిద్దాడు. సాధు జనులకు, సాధు మృగాలకు మేలు జరిగేటట్లు – ఆ దొంగలను పాపకార్యాలకు దూరం చేసి పుణ్యులను చేశాడు. అటువంటి సత్ప్రవర్తనతో కాపవ్యుడు తాను

''దొరా! నీ మాటలు ఎంతో మంచిగా ఉన్నాయి. మా బుద్ధిలో ఉన్న చెడంతా క్షణంలో పోయిందనుకో. నీవు ఎలా చెబితే అలా చేస్తాం. సత్యంగా నీ భటుడిలా మెలుగుతాం. మాకు మంచేదో, చెడేదో తెలియజెప్పావు. ఎన్నడూ నీ ఆన తప్పం. మమ్మల్ని దయతో నీ అనుచరులుగా స్వీకరించు''

మెలగటమే కాక దొంగలనందరినీ నడిచేటట్లు చేసి, ఇహలోక సౌఖ్యాన్ని పొందటమే కాక పరలోక సౌఖ్యం కూడా పొందేటట్లు చేసి చరితార్థుడైనాడు'' అని చెప్పి సూతమహర్షి తృప్తితో మునులందరివైపు చూశాడు.

''విన్నారుగా మునులారా! కాపవ్యుడి ధర్మవర్తన! మీకు కాపవ్యుడి కథ వింటుంటే ధర్మవ్యాధుడు గుర్తుకు రాలేదా? ఇద్దరూ బోయవాళ్ళే. కాని వారిని మించిన ధర్మపరులు ఎక్కడా కనబడరు. తాము ధర్మాత్ములు కావటమే కాకుండా ఎందరినో ధర్మవర్తనులుగా చేసిన మహానుభావులు. హింసనే జీవనోపాధిగా కల బోయవారిని మార్చి ప్రజాశ్రేయస్సుకు పాటుపడిన ధన్యజీవులు. ఋషితుల్యులకు కూడా ధర్మబోధ చేయగల జ్ఞానవంతులు. అటువంటివారి జీవితవిధానాన్ని మార్గదర్శకంగా తీసుకుని మానవులు మనగలిగితే వారికెటువంటి లోటూ ఉండదు. ఇహలోకంలోని భోగ భాగ్యాలే కాక స్వర్గలోక సుఖ సంతోషాలు కూడా లభిస్తాయన్న విషయం కాపవ్యుని బోధలు నమ్మి ప్రవర్తించిన చోరుల నడవడికలు నిరూపిస్తాయి. కాపవ్యుడు నిజంగా మానవమాత్రుడు కాడు. మంచికి మారుపేరుగా నిలిచిన ఋషితుల్యుడు. మీకేమనిపిస్తోంది'' అని అడిగిన సూతమహర్షికి ఒక్కసారిగా మునులందరూ చేతులు జోడించారు.

''అవును మహర్షీ! మీరు చెప్పింది అక్షరాలా నిజం. కాపవ్యుడి లాంటి నీతిమంతుడు – మరొకడు కానరావటం అసాధ్యం. ఇక ధర్మవ్యాధుడంటారా? ఆ బుద్ధిమంతుడు కౌశిక ముని వంటివారికే హితబోధ చేసి ధర్మం యొక్క స్థానాన్ని మనోరంజకంగా తెలియజెప్పిన నిశ్చలాత్ముడు. సాధారణ మునులే ఆతని నుంచి నేర్చుకోవలసిన ధర్మ విషయాలు ఎన్నో ఉన్నాయి. ఏకలవ్యుడి వంటి వారికి కాపవ్యుడు గురుస్థానీయుడనటంలో ఎంత మాత్రం దోషం ఉండదు'' అని శౌనకాది మునులందరూ సూతుడు నాటికి చెప్పవలసిన విషయం అయిపోయిందనుకొని లేవడంతో ఆయనతో సహా ఆశ్రమోన్ముఖులయినారు.

**(సశేషం)**



ధారావాహిని

# అమ్మ కథలు

- డి.శ్రీనివాస దీక్షితులు

# మారిన రూపం

పూర్వం సుద్యుమ్నుడు అనే మహారాజు భూమండలాన్ని పరిపాలించేవాడు. ఆయన ఎప్పుడూ సత్యాన్నే పలికేవాడు. జితేంద్రియుడూ, ధర్మాత్ముడైన ఆ మహారాజు ఒకనాడు తన పరివారాన్ని వెంటబెట్టుకుని వేట కోసం గుర్రం మీద అడవికి వెళ్ళాడు.

అజగవం అనే ధనుస్సుని ధరించి క్రూరజంతువుల్ని వేటాడుతూ వేటాడుతూ అడవంతా తిరిగి సుద్యుమ్నుడు బాగా అలసిపోయాడు.

అప్పుడు మేరు పర్వతానికి దిగువన సుద్యుమ్నునికి ఒక అందమైన వనం కనిపించింది. రకరకాల పళ్ళచెట్లతో పూలచెట్లతో నిండి ఉన్న ఆ వనాన్ని చూడగానే సుద్యుమ్నుడు పరవశించిపోయాడు. వెంటనే మహారాజు ఆ వనంలోకి ప్రవేశించాడు. ఆయన వెంట పరివారం కూడా వనంలోకి ప్రవేశించింది.

ఆ విచిత్ర వనంలోకి అడుగుపెట్టగానే అందరూ ఆడవాళ్ళుగా మారిపోయారు. మహారాజు ఎక్కిన గుర్రం కూడా ఆడగుర్రంగా మారిపోయింది.

ఈ విధంగా ఎందుకు జరిగిందో కారణం తెలియక వాళ్ళు కలవర పడ్డారు.

ఆ వనం మామూలు వనం కాదు.

పార్వతీ పరమేశ్వరులు ఏకాంతంగా విహరించే దేవవనం అది.

అందులో ఒక విశేషం ఉంది.

మునుపు సనక సనందనాది మహర్షులు పరమశివుని సందర్శించటానికి ఆ వనానికి వచ్చారు. ఆ సమయంలో ఆదిదంపతులు ఏకాంతంగా ఉన్నారు. శివుని తొడమీద పార్వతీదేవి కూర్చుని ఉంది. ఇద్దరూ కామపరవశులుగా ఉన్నారు.

అంతలో అకస్మాత్తుగా వచ్చి ఎదురుగా నిల్చిన మహర్షుల్ని చూసింది పార్వతి.

సిగ్గుతో ఆమె దిగ్గున లేచింది.



చీర చుట్టుకుని వెనక్కి తిరిగి నిలబడింది పార్వతి.

తమ పొరపాటుని గ్రహించారు మహర్షులు.

వెంటనే వాళ్ళు వచ్చిన దారినే వడివడిగా అడుగులు వేస్తూ నర నారాయణాశ్రమానికి వెళ్ళిపోయారు.

శివుడు పార్వతిని సముదాయించాడు.

అయినా ఆమె మెత్తపడలేదు.

''ఈ క్షణం నుండి ఈ వనంలోకి ప్రవేశించిన ఏ పురుషుడైనా వెంటనే స్త్రీగా మారిపోతాడు. తప్పదు!'' అని శపించాడు శివుడు.

ఆనాటి నుంచి ఆ వనానికి వెళ్ళటం అందరూ మానేశారు. కానీ ఆ శాపం గురించి తెలియని సుద్యుమ్నుడు అతని పరివారమూ ఆ వనంలోకి వెళ్ళి స్త్రీలుగా మారిపోయారు. స్త్రీ రూపాన్ని పొందిన సుద్యుమ్నుడు సిగ్గుతో కుంగిపోయాడు. విపరీతంగా దుఃఖించాడు.

''ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? ఈ రూపంతో నేను నా రాజ్యానికి ఎలా వెళ్ళాలి? వెళ్ళి రాజ్యాన్ని ఎలా పాలించాలి? ప్రజలు నన్ను సుద్యుమ్నుడిగా అంగీకరిస్తారా? అసలు నాకీ రూపం ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది? ఎన్నో ప్రశ్నలు... ఎన్నెన్నో ప్రశ్నలు. ఒక్కదానికీ సమాధానం దొరకటం లేదు.

సుద్యుమ్నుడు తన పరివారంతో వనంలోంచి బయటకు వచ్చాడు. రాజ్యానికి వెళ్ళకుండా ఇళ అనే పేరుతో అడవిలోనే

అటు ఇటు పిచ్చిగా తిరుగుతున్నాడు.

స్త్రీ రూపాన్ని పొందిన పరివారం చెలికత్తెలయినారు. పరమ భక్తితో వాళ్ళు సుద్యుమ్నుడికి / ఇళకి సేవలు చేస్తున్నారు.

దేవగురువైన బృహస్పతి భార్య తార. అపురూప సౌందర్యం ఆమెకుంది. చంద్రుడు ఆమెని మోహించాడు. ఆమె కూడా చంద్రుని సౌందర్యానికి ముగ్ధురాలయింది.

వాళ్ళిద్దరి సంబంధం గురించి దేవలోకంలో పెద్ద దుమారమే చెలరేగింది. రాయబారాలు సంప్రదింపులూ సాగాయి. అయినా వాళ్ళిద్దరూ విడిపోలేదు.

అనురాగ గోపురంలా వాళ్ళ కాపురం ఆనందంగా సాగింది. ఆ దంపతులకి బుధుడు అనే కుమారుడు జన్మించాడు. ఆ బాలుడు క్రమంగా పెరిగి యౌవనవంతుడయ్యాడు.

ఒకనాడు వేటకోసం బుధుడు మేరుపర్వతం సమీపంలో ఉన్న అడవికి వచ్చాడు. అక్కడే చెలికత్తెలతో విలాసంగా వయ్యారంగా విహరిస్తున్న ఇళని చూశాడు బుధుడు. తొలి చూపులోనే ఆమె మీద బుధుడు మనసు పడ్డాడు. ఇళ కూడా అతనిని మోహించింది.

కళ్ళూ కళ్ళూ కలిశాయి.

మనసులు రెండూ మైమరిచాయి.

ఇళ బుధుని భర్తగా వరించింది.

ఇద్దరూ గాంధర్వ వివాహం చేసుకున్నారు.

ఆనందంగా కాలం గడుపుతున్నారు.

ఇళ గర్భవతి అయింది. ఆమెకు పుత్రుడు కలిగాడు. ఆ బాలునికి పురూరవుడు అని పేరు పెట్టారు.

ఇళాదేవి రూపంలో ఉన్న సుద్యుమ్నుడికి తన గతమంతా గుర్తుకొచ్చింది. బంధువులూ రాజ్యం ప్రజలు అందరూ కళ్ళముందు నిలిచారు. అంతులేని దుఃఖం ఆమెని ఆవరించింది. ఆ బాధ తొలగిపోయేంతవరకు ఆమె పొగిలి పొగిలి ఏడ్చింది.

బాగా ఆలోచించింది ఆమె.

కులగురువైన వసిష్ఠ మహర్షిని ధ్యానించింది.

వెంటనే వసిష్ఠ మహర్షి ప్రత్యక్షమయ్యాడు.

జరిగిందంతా చెప్పి తన స్త్రీత్వాన్ని తొలగించమని ఇళ వసిష్ఠుని ప్రార్థించింది. ఆమె మాటల్ని వినగానే వసిష్ఠ మహర్షికి జాలి కలిగింది.

సుద్యుమ్నుని కరుణించమని పరమశివుని వసిష్ఠుడు ప్రార్థించాడు. శివుడు కరుణించాడు.

''ఈనాటి నుంచి సుద్యుమ్నుడు ఒక నెల పురుషునిగా, ఒక నెల స్త్రీగా ఉంటాడు'' అని అనుగ్రహించాడు శివుడు.

సుద్యుమ్నుడు సంతోషించాడు.

పురుషుడిగా మారాడు మహారాజు.

తన రాజ్యానికి తరలి వెళ్ళాడు సుద్యుమ్నుడు. శివుని అనుగ్రహంతో అతను రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తున్నాడు.

స్త్రీ రూపాన్ని పొంది నెలరోజులూ రాజభవనాన్ని విడిచి బయటకు రాకుండా సుద్యుమ్నుడు రహస్య జీవితం గడుపుతున్నాడు. పురుష రూపాన్ని ధరించిన నెల రోజులూ రాజ్యపాలన చేస్తున్నాడు మహారాజు.

సుద్యుమ్నుడు ఇళాదేవిగా మారటం, ఇళాదేవి సుద్యుమ్నుడిగా మారటం ఈ తతంగమంతా ప్రజలకి అయోమయంగా ఉంది. కాలం సాగుతోంది.

ఇళాదేవి కుమారుడైన పురూరవుడు క్రమంగా పెరిగి పెద్దవాడయ్యాడు. యౌవనవంతుడయ్యాడు.

అతనికి రాజ్యాన్ని అప్పగించి తపస్సు చేసుకోవటానికి వెళ్ళిపోయాడు ఇళా రూపంలో ఉన్న సుద్యుమ్న మహారాజు.

అడవిలో నారద మహర్షి కనిపించి నవాక్షర దేవీ మహామంత్రాన్ని ఇళాదేవికి / సుద్యుమ్నుడికి ఉపదేశించాడు. ఆ మహామంత్రాన్ని జపిస్తూ కఠోర తపస్సు చేసింది ఇళాదేవి. అమ్మ అనుగ్రహించింది.

**సింహారూఢా స్థితా చాగ్రే దివ్యరూపా మనోరమా ।**
**వారుణీ పాన సమ్మత్తా మదాఘూర్ణిత లోచనా ॥**

సింహవాహనం మీద ఎక్కి దివ్యరూపంతో మనోహరంగా జగన్మాత ఆమె దగ్గరికి వచ్చింది. ఆమె జగన్మాతని భక్తితో స్తుతించింది.

''తల్లీ! నీకు నమస్కారం. త్రిమూర్తులు, దేవతలు, మహర్షులు నిన్ను తెలుసుకోలేక భ్రాంతిలో చిక్కుకుంటున్నారు. ఇక నావంటి వాడికి నీ తత్త్వం తెలుసుకోవటం సాధ్యమవుతుందా? శ్రీహరికి లక్ష్మీదేవిగా నీ సాత్త్విక రూపం మాత్రమే తెలుసు. సరస్వతీ దేవిగా బ్రహ్మదేవునికి నీ రాజస రూపం మాత్రమే తెలుసు. పార్వతీదేవిగా పరమశివుడికి నీ తామస రూపం మాత్రమే తెలుసు.

కానీ నీ నిర్గుణ తత్త్వం ఎవరికీ తెలియదు.

నువ్వు పురుషుడివా? స్త్రీవా?

సగుణవా? నిర్గుణవా?

నీ గురించి ఏమీ తెలియదు.

అయినా నిన్ను నేను పరమభక్తితో పూజిస్తున్నాను. నన్ను కరుణించు భువనేశ్వరీ! అంటూ అమ్మను అనేక విధాలుగా ఆర్తితో ప్రార్థించింది ఇళా దేవి.

ఆ స్తుతికి అమ్మ ఆనందించింది.

అనుగ్రహ వర్షం కురిపించింది

ఇళాదేవికి / సుద్యుమ్నుడికి మహర్షులకి కఠోర తపస్సు వల్ల మాత్రమే లభించే పరమపదాన్ని ప్రసాదించింది అమ్మ.



# భీమశంకర జ్యోతిర్లింగ క్షేత్ర ఆవిర్భావం

**మందరపు వి.జి.శంకరాచారి**

పూర్వకాలంలో (త్రేతాయుగంలో జరిగినది) సహ్యాద్రి పర్వత ప్రాంతంలో 'కర్కటి' నామధేయము గల రాక్షసి నివసిస్తూ ఉండేది. ఆ రక్కసికి భీమాసురుడు అనే కుమారుడు ఉండేవాడు. అతనితో కలిసి ఆ ప్రాంతంలో నివసిస్తూ అనేక దుశ్చర్యలు చేస్తూ అందరినీ భీతిల్లింప చేసేది.

ఒకనాడు భీమాసురుడు తల్లి కర్కటితో "అమ్మా! ఈ కొండపైన నీవు ఒక్కదానివే నివసించడానికి కారణమేమిటి? నాకెవరూ లేరా... నా తండ్రి పేరేమిటి? అతడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు?" వివరాలు చెప్పమని అడుగుతాడు.

అప్పుడు కర్కటి తనయుడితో ఇలా చెబుతుంది. "కుమారా! అమిత పరాక్రమశాలి యగు కుంభకర్ణుడు నీకు తండ్రి. రావణబ్రహ్మ నీకు పెదనాన్న. విభీషణుడు చిన్నాన్న అవుతారు. నీ తండ్రి కుంభకర్ణుడు, పెదతండ్రి రావణబ్రహ్మ రామ రావణ యుద్ధంలో హతులైనారు. శ్రీరాముడు ఇద్దర్నీ హతమార్చాడు. మనకు బద్ధశత్రువైన విష్ణుమూర్తి యొక్క అంశయే శ్రీరాముడు. మన రాక్షస జాతి నంతటినీ సమూలంగా నాశనం చేస్తున్న ఆ విష్ణుమూర్తిపై నాకు అమితమైన క్రోధం ఉంది. అయినా ఏమీ చేయలేని అశక్తురాలిని. ఆ శ్రీరాముడు నీ తండ్రిని, నీ పెదతండ్రిని వధించిన తర్వాత నేను కన్నవారింటికి చేరుకున్నాను.

నా తండ్రి పేరు కర్కటుడు. తల్లిపేరు పుష్ప. వీరిద్దరూ నన్ను మొదటి భర్త అయిన విరాధుడికిచ్చి పెళ్ళి చేశారు. విరాధుడితో కలిసి జీవిస్తున్న సమయంలో – శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా అరణ్యవాసం చేయుచున్నాడు. ఆ సమయంలో నీ తండ్రి విరాధుడు నిర్జన ప్రాంతంలో తపమాచరించుకుంటున్న మునిపుంగవులను హతమార్చడం, వారి యొక్క యజ్ఞ యాగాదులను భస్మం చేయడం, గ్రామాలపై పడి ప్రజలను చంపి తినడం వంటి దుశ్చర్యలు చేసేవాడు. ఈ దుశ్చర్యలు చూడలేక మునీశ్వరులంతా అరణ్యవాసం చేయుచున్న శ్రీరాముడిని శరణు వేడితే అతడు నీ తండ్రి విరాధుడితో యుద్ధం చేసి నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు.

విరాధుడు చనిపోయిన అనంతరం నేను నా తండ్రి కర్కటుడు తల్లి పుష్ప దగ్గరకు చేరుకున్నాను. వారితో కలిసి జీవించసాగాను. అయితే ఒకనాడు ఈ ప్రాంతమునకు వచ్చిన అగస్త్య మహర్షి శిష్యుడైన సుతీక్షుడిని చూసి వాడిని సంహరించడానికి నా తల్లి

తండ్రులు అతడి దగ్గరకు వెళితే అతడు తన తపః శక్తితో నా తల్లితండ్రులను భస్మం చేశాడు.

మొదటి భర్త అయిన విరాధుడిని, తల్లితండ్రులను కోల్పోయిన నేను ఈ ప్రాంతంలో ఒంటరిగా జీవించడం అలవాటు చేసుకున్నాను. అయితే ఒకానొక సమయంలో ఈ పర్వత ప్రాంతంలో పర్యటించడానికి వచ్చిన కుంభకర్ణుడు నన్ను చూసి ఇష్టపడ్డాడు. నేను వద్దంటున్నా వినకుండా బలవంతంగా నన్ను చేపట్టాడు. ఆ విధంగా కుంభకర్ణుడికి దక్కిన నేను నీ జన్మకు కారకురాలినయ్యాను. అమిత పరాక్రముడు, అతులిత బలశాలి అయిన నా భర్త కుంభకర్ణుణ్ణి నిర్దాక్షిణ్యంగా శ్రీరాముడు చంపివేయడంతో ఒంటరిగా మిగిలాను. నీలో నీ తండ్రిని చూసుకుంటూ జీవిస్తున్నాను. నీవు కూడా అటువంటి మహావీరుని కడుపున పుట్టిన గొప్ప వీరుడవు. కాబట్టి నీవు మనకు శత్రువైన ఆ విష్ణుమూర్తిని వధించి మన వంశానికి గొప్ప పేరుని తీసుకొనిరా'' అని తన కథనంతా కుమారుడికి చెప్పింది కర్కటి.

తన తల్లి యొక్క దీనగాథ విన్న భీముడు ''అమ్మా! మనల్ని అనాథలుగా మిగిల్చిన ఆ విష్ణుమూర్తిని వధిస్తాను. ఇప్పుడే బ్రహ్మ గురించి తపస్సు నాచరించి కోరిన వరములు దక్కించుకుని తదుపరి నా రాక్షస ప్రవృత్తిని పదునాలుగు లోకాలలోను ప్రదర్శిస్తాను'' అంటూ తల్లి దగ్గర ఆశీర్వచనం తీసుకుని బ్రహ్మ గురించి తపస్సు చేయడానికి బయలుదేరతాడు.

ఆవిధంగా బయలుదేరిన భీముడు వేయి సంవత్సరముల పాటు ఘోరమైన తపస్సుని ఆచరిస్తాడు. అతడి తపస్సుని భగ్నం చేయాలని దేవతలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవుతాయి. తుదకు అతడి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై అతడు కోరుకున్న వరాలన్నీ అనుగ్రహిస్తాడు.

దివ్యమైన వరాలతో అమిత బలాఢ్యుడిగా మారిన భీమాసురుడు రెచ్చిపోయి ముల్లోకాలపై రణభేరి మ్రోగించి తిరుగులేని విజయాన్ని స్వంతం చేసుకుంటాడు. అతడి రాక్షస చర్యలకు భూలోకంతో సహా అన్ని లోకాలూ గడగడలాడుతాయి.

భూలోకమంతా తిరిగి సాధువులైన మహర్షులను వధిస్తాడు. ఆ సమయంలో భూలోకంలో కామరూప ప్రాంతాన్ని సుదక్షిణుడు అనే రాజు పరిపాలన చేస్తూ ఉండేవాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. నిరంతరం శివపంచాక్షరీ మంత్రంతో మునిగి తేలేవాడు. ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునేవాడు. అటువంటి సుదక్షిణుడు భీమాసురుడితో యుద్ధం చేసి ఓడిపోతాడు.

ఓడిపోయిన సుదక్షిణుడిని కారాగారంలో బంధిస్తాడు భీముడు. రాజుని బానిసలాగా చూడడం ప్రారంభిస్తాడు. కారాగారంలో బంధించబడిన సుదక్షిణుడు భీముడు చేయిస్తున్న దుశ్చర్యలకు భీతిల్లడు. ఏ పరిస్థితిలోనూ శివారాధన మానడు. తను కారాగారములో యున్నను శివపూజ కొరకు మట్టితో శివలింగాన్ని చేసి ఆ లింగాన్ని నిత్యమూ పూజించడం మొదలు పెడతాడు. అన్న పానీయాలు మానివేసి శివపూజ చేస్తూ ఆ పరమాత్మలో లయం కాగల సమాధిస్థితి (జీవించి ఉండగానే ఆలోచనలు లేకుండా ఉండే స్థితి) ని చేరుకుంటాడు.

ఒకరోజు సుదక్షిణుడు శివపూజ చేస్తున్న సమయంలో అక్కడకు వచ్చిన భీముడు కోపంతో ''ఓయీ మూర్ఖపు రాజా! కారాగారంలో శివ పూజ లేమిటి? నన్ను పూజించవలెను గానీ... శివుడికి పూజలేంటి?'' అని అరుస్తాడు.

అప్పుడు సుదక్షిణుడు పరమశాంతంతో ''భీమాసురా! నేను పూజిస్తున్నదెవరినో తెలుసా! ఈ జగత్తుకి సృష్టికర్త. నిన్ను, నన్ను సృష్టించినవాడు. అతడే ఈ ప్రపంచానికి ప్రభువు. మా కష్టాలను భరించేది... హరించేది ఆయనే. నేను జగత్పతిని సేవిస్తున్నాను. నీ గర్జనలు, గాండ్రింపులు నన్ను ఏమీ చేయవు'' అంటాడు.

ఆ మాటలతో భీమాసురుడు మరింత కోపోద్రిక్తుడై ''ఏమిటీ ఈ మట్టి శివలింగం ఈ జగత్తుని రక్షిస్తోందా? నన్ను భరిస్తోందా? అదీ చూస్తాను. ఇప్పుడే ఈ శివలింగాన్నీ నా కత్తితో తునాతునకలుగా చేస్తాను'' అంటూ కత్తిని తీసి ఆ శివలింగం పైన వేయబోయేంతలో ఆ మట్టి లింగం నుండి ప్రత్యక్షమైన శివుడు భీమాసురుడిని వధిస్తాడు. శివ సాక్షాత్కారంతో ఆనందంతో నిండిపోయిన సుదక్షిణుడు స్వామివారిని పరిపరి విధములుగా స్తుతిస్తాడు.

శివుడి చేతిలో భీమాసురుడు హతుడయ్యాడన్న విషయం తెలుసుకున్న తారకాసురులు కామరూప రాజ్యంపై యుద్ధం చేయడానికి దండెత్తి వస్తారు. శివుడు తారకాసురుల మధ్య జరిగిన యుద్ధంలో చెమటోడ్చి వారితో యుద్ధం చేస్తాడు పరమశివుడు. ఆ సమయంలో శివుడి శరీరం నుండి చిమ్మిన స్వేద బిందువులే సహ్యాద్రి పర్వత ప్రాంతంలో భీమానదిగా రూపు దాల్చినది.

భీమాసురుడు మరణించిన పిదప పాతాళంలో యున్న తల్లి కర్కట చేసిన ప్రార్థనతో శివుడామెకు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా ఆమె ఈ సహ్యాద్రి పర్వత ప్రాంతములో తన కొడుకు పేరున భీమశంకర జ్యోతిర్లింగముగా ఆవిర్భవించమని వరాన్ని కోరుకుంటుంది.

లోకకళ్యాణ కారకమైన కోర్కెను కోరడంతో శివుడు ఆమె కోరికను తీరుస్తానని చెప్పి – ఈ ప్రాంతం భీమశంకర జ్యోతిర్లింగ స్వరూపుడిగా విఖ్యా తి చెందుతుందని అనుగ్రహించి స్వయంభువుగా ఆవిర్భవిస్తాడు.

ఈవిధంగా ఆవిర్భవించిన భీమశంకర జ్యోతిర్లింగ క్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాలలో అవదిగా వినుతికెక్కినది.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

**సేకరణ : కె.వి.రాఘవాచార్యులు**

**గత సంచిక తరువాయి**

## 281.వాసుదేవాయ నమః

వసుదేవుని కుమారుడు వాసుదేవుడు కృష్ణుడు. ఈ నామము పరవాసుదేవునికి గలదు.

**శ్లో ॥ వాసనాత్ వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం**

**సర్వ భూత నివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే ॥**

అని వ్యాస మహర్షి విష్ణు సహస్ర నామముల యొక్క ఉత్తర పీఠికలో (25) వాసుదేవ నామమును వివరించినాడు. సర్వత్ర విశ్వమంతటా తాను నివసించుట వలన, ప్రాణులన్నింటి యందు అంతర్యామిగా తాను నివసించుట వలన భగవంతునికి వాసుదేవుడను పేరు సార్థకమని వ్యాసమహర్షి భగవంతుని తత్త్వమును కీర్తించినాడు.

**వసతి దానయతి ఆచ్ఛాదయతి సర్వం వాసుశ్చాసౌ దేవశ్చ వాసుదేవః ॥**

సర్వత్ర తాను నివసించుట చేత, సర్వమును తనయందు నివసింప జేయుట చేత వాసువు అనబడుచున్నాడు. వాసువు అయిన వాసుదేవుడు అని వ్యుత్పత్త్యర్థము. ఈ విషయమునే

**శ్లో ॥ ఛాదయామి జగత్సర్వం భూత్వా సూర్య ఇవాంశుభిః**

**సర్వభూతాధివాసశ్చ వాసుదేవ స్తతః స్మృతః ॥**

సూర్యుడు తన కిరణములను జగత్తు అంతటా ప్రసరింపజేసినట్లు నేను మాయాశక్తితో సర్వ జగత్తును ఆచ్ఛాదించి యున్నాను. సర్వ ప్రాణులందు నివసించి యున్నాను. అందుచేత నన్ను వాసుదేవుడని పిలుచుచున్నారు అని శ్రీ కృష్ణభగవానుడు మహాభారతం, శాంతిపర్వం 341-41 శ్లోకములో తెలిపి యున్నాడు.

**శ్లో ॥ సర్వాణి తత్ర భూతాని వసంతి పరమాత్మని**

**భూతేషు చ సర్వాత్మా వాసుదేవ స్తతః స్మృతః ॥**

పరమాత్మలో సర్వప్రాణులూ నివసించి యున్నవి. ప్రాణులన్నింటిలోను పరమాత్మ నివసించి యున్నాడు కనుక పరమాత్మ వాసుదేవుడనబడుచున్నాడు అని విష్ణు పురాణం 6-5-80 శ్లోకమున పరమాత్మ తత్త్వాన్ని కీర్తించింది.


ఈ సమస్త ప్రపంచము ఆత్మ స్వరూపుడైన వాసుదేవుడనేది నిశ్చయ జ్ఞానం. ఈ జ్ఞానం కలవాడే మహాత్ముడని వివరిస్తూ భగవద్గీత "వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః" అని 7-19 శ్లోకము ప్రశంసించింది. అంతరాత్మ రూపుడుగా నున్న వాసుదేవుడే భగవంతుడైన శ్రీకృష్ణుడని జ్ఞాని భావిస్తాడని శంకర భాష్యం వివరించింది. కనుక జ్ఞాని సర్వాత్మదృష్టితో సమస్తమూ ఆత్మమయముగా, భగవన్మయముగా, వాసుదేవ మయముగా చూస్తాడు. అందువలన సమదృష్టి సమదర్శనము గలుగుతాయి. ఈ వాసుదేవ జ్ఞానం గలిగిన వారు ఎవరినీ ద్వేషించరు. అందరూ మన వంటి వారు అనే సమభావంతో ప్రవర్తిస్తారు. వారికి శోక మోహాదులు ఉండవు. అందుచేతనే "ఓం నమో భగవతే వాసుదేవాయ" అను ద్వాదశాక్షరీ మంత్రము సర్వులకూ హితకరమైన దివ్య మంత్రముగా గౌరవింపబడుచున్నది.

**శ్లో ॥ చింతయన్ వాసుదేవాఖ్యం పరబ్రహ్మ స్వరూపిణం**

**ద్రష్టుకామశ్చ తం దేవం వృషభాద్రి వాసినమ్ ॥**

వృషభాచలమున వెలసిన పరబ్రహ్మ యగు వాసుదేవుడు అను జ్ఞానముతో అగస్త్య మహర్షి మొదలగు వారు ఆ వాసుదేవుని గూర్చి చింతించుచు, అతనిని చూడవలెనను కోరికతో వేంకటాచలమున అనేక సంవత్సరములు వేచి యున్నారని వామన పురాణం వెల్లడించింది.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

వామదేవ మహర్షి నిమి పుత్రుడగు జనక రాజునకు అతని యందు గల వాత్సల్యముతో నారాయణ గిరి యందున్న రహస్యమును ఇట్లు బోధించినాడు. "ఈ నారాయణ గిరిలో శ్రీమన్నారాయణుడు వాసుదేవుడనెడి తన పేరుకు తగినట్లుగ ఈ పర్వతమందు అన్ని చోట్ల అనగా అన్ని గుహల యందు అన్ని సెలయేళ్ళ యందు, పుణ్యతీర్థములలో, చెట్లు, తీగలు మొదలగు వాని యందు నివసించుచున్నాడు. అట్లే నారాయణ గిరి యందు దేవతల రూపములో, మానవ రూపములో, పక్షి-మృగ రూపములలో భగవంతుడు వాసుదేవుడు నివసించియున్నాడు. నారాయణ గిరిపై వాసుదేవుడు సర్వప్రాణి రూపమై నివసించుచున్నాడు. అందుచే ఎవరైనా నారాయణగిరిపై ఎక్కడైనను వుండి భగవంతుని ధ్యానించిన, పూజించిన అచట భగవంతుడు సాన్నిధ్యమును వహించి, అతని అభీష్టములను అనుగ్రహించును" (వామన, 42-21-26 శ్లోకములు).

"వసుదేవస్య అపత్యం పుమాన్ వాసుదేవః" అను విగ్రహ వాక్యమును బట్టి వసుదేవుని కుమారుడు వాసుదేవుడు – కృష్ణుడు. వరాహ, భవిష్యోత్తర పురాణములలోని కథనం ప్రకారం పద్మావతీ శ్రీనివాసుల చూపులు కలిసిన శుభవేళలో శ్రీనివాసుడు ఆమె చెలులతో తన పేరు కృష్ణుడని, తాను దేవకీ వసుదేవుల కుమారుడనని చెప్పినాడు. కనుక వాసుదేవ కృష్ణుడే శ్రీనివాసుడు. ఇరువురికీ అభేదము గలదు. ఆ వసుదేవుని కుమారుడే కలియుగమున శ్రీనివాసుడుగ, వేంకటేశుడుగ అవతరించినాడు. వేంకటాద్రిపై అర్చామూర్తిగా వెలసి భక్తజనులకు వరములను గుప్పించుచున్నాడు.

భగవంతుని మంత్రములలో "ఓం నమో విష్ణవే" అనే షడక్షరీ మంత్రము, "ఓం నమో భగవతే వాసుదేవాయ" అను ద్వాదశాక్షరీ మంత్రము, "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రములు శ్రేష్ఠములని, ప్రభావవంతములని పెద్దల మాట. ఈ విష్ణు, వాసుదేవ, నారాయణ నామములు మూడు శ్రీవేంకటేశ 108 నామావళిలో గలవు. ఈ వాసుదేవ నామము విష్ణు సహస్ర నామములలో 334, 700, 714 (3) సంఖ్యలతో గలదు. శ్రీవేంకటేశ 108 నామావళిలో 40 సంఖ్యతో గలదు.

వసుదేవుని కుమారుడు శ్రీకృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 282.అధోక్షజాయ నమః

ఇంద్రియ జన్య జ్ఞానమునకు అతీతుడు, జితేంద్రియులకు గోచరించువాడు (కనిపించువాడు) భగవంతుడు అధోక్షజుడు అనబడుచున్నాడు.

**అధో భూతేహ్యక్ష గణే ప్రత్యగ్రూప ప్రవాహితే**

**జాయతే తస్య వైజ్ఞానంతే నాధోక్ష ఉచ్యతే ॥**

అక్ష అంటే ఇంద్రియం. అక్షగణాలు –ఇంద్రియ గణాలు. ఇంద్రియాలు అన్నీ అంతర్ముఖంగా ప్రవహించగా ఆత్మజ్ఞానం లభిస్తుంది. ఆత్మజ్ఞానము యొక్క ఫలితము అధోక్షజుడు – విష్ణువు.

కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్ – ఏ ఒక్క ధీరుడో అంతర్ముఖుడై ఆత్మను చూడగలడు. అనుభవించగలడని ఉపనిషన్మంత్రములు.

సముద్రము వలె ఎందరు, ఎంతగా ఉపయోగించుకొన్నను, ఎంత కాలము ఉపయోగించుకొన్నను తరగని ఆనందాది గుణసంపద గలవాడు కనుక అధోక్షజుడు అనబడుచున్నాడు. అంతర్ముఖులకు అనుభవంగా కలుగువాడు.

ఈ నామము నందు ప్రకృతి ప్రత్యయ విభాగము లేకుండ మొత్తముగా రూఢి శక్తి చేత భగవంతుని బోధించుటకు ముఖ్యాంశము.

ఎన్నడు తన స్థితి నుండి క్రిందికి దిగజారి క్షయము నందదు. అధోన క్షీయతే జాతు యస్మాత్తస్మాత్ అధోక్షజః అని భారతం, ఉద్యోగ-70-1 చెప్పుచున్న వ్యాస వచనం ప్రమాణము.

అధోక్షజుడు అని పిలువబడుచున్న విష్ణుదేవుని యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. ఈ నామము ఇందు 872 సంఖ్యతో వున్నది.




# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

## కిష్కింధకాండ

విలలాపా కులేంద్రియ:– అది ఈ కాండ ప్రారంభ శ్లోకం లోని పదప్రయోగం. సీతా వియోగంతో రాముడు విలపించాడు. ఇంద్రియాలన్నీ కలత చెందాయి. రామలక్ష్మణుల్ని చూశాడు సుగ్రీవుడు. వ్యాకుల పడ్డాడు. నగలమూట చూశాడు రాముడు. విలపించాడు. తన సంకటస్థితి రామునితో చెప్పుకున్నాడు సుగ్రీవుడు. కలత చెందాడు. రామబాణానికి కిందపడ్డాడు వాలి. అతని ఇంద్రియాలన్నీ చలించాయి. వాలి మరణం చూసింది తార. విలపించింది. లక్ష్మణుని ధనుష్టంకారం విన్నారు వానరులు. కలత చెందారు. అలా ఈ కాండలోని వ్యక్తుల్ని ఒక పద ప్రయోగంతో అంతర్లీనంగా పరిచయం చేశాడు వాల్మీకి.

పంపా సరోవరంలో పద్మాలు చూశాడు రాముడు. సీతాదేవి నేత్రాల్ని స్మరించాడు. సీత కోసం తపన. వ్యాకులపాటు. కోకిల గానం – పుష్పపరిమళం – మలయ మారుతం – రామునిలో విరహాగ్నిని ద్విగుణీకృతం చేశాయి. అతని విరహ వేదన విపులంగా వర్ణించాడు వాల్మీకి. అవి 110 శ్లోకాలు.

అపుడు లక్ష్మణుడు అంటున్నాడు. ఆ మాటలెంతో యుక్తాయుక్తంగా ఉన్నాయి. ''రామా! పురుషోత్తముడవు నీవు. ధైర్యంగా ఉండు. దుఃఖించకు. నీలాంటి ధీరులు నిరుత్సాహ పడరాదు''.

**స్మృత్వా వియోగజం దుఃఖం త్యజ స్నేహం ప్రియే జనే ।**
**అతిస్నేహ పరిష్వంగాత్ వర్తిరార్ద్రాపి దహ్యతే ।।**

రామా! ఎంతో స్నేహం చేస్తాం. ఎడబాటు కల్గుతుంది. అది సహజం. అతి స్నేహం పనికిరాదు. దానివల్ల తడిసిన వత్తి కూడా తగలబడుతుంది. అన్నా! రావణుడు పాతాళానికి పోనీ మరెక్కడికైనా పోనీ వాడు పాపాత్ముడు. జాడ తెలియడం ఆలస్యం. సీతని అప్పగిస్తే బతుకుతాడు. లేదా చస్తాడు. మానవ ప్రయత్నం చేద్దాం. లేకపోతే ఏ పనీ కాదు.

**ఉత్సాహవంతః పురుషా నావసీదంతి కర్మ సు ।**
**ఉత్సాహ మాత్రమ్ ఆశ్రిత్య సీతాం ప్రతిలభేమహి ।।**

'రామా! ఉత్సాహమే బలం. ఉత్సాహవంతులకి అసాధ్యమంటూ ఏదీ ఉండదు. ఏ కార్యమైనా చేస్తారు. వెనక్కి తగ్గరు. లే. ఉత్సాహం తెచ్చుకో. పట్టుదల వహించు. సీత దొరుకుతుంది. నీ మనోనిగ్రహం సాటిలేనిది. కామ ప్రవృత్తిని తరిమేయ్. నీ ఔన్నత్యం ఎంతో తెలుసుకోలేకున్నావు''.

విన్నాడు రామయుడు. ధైర్యవంతుడైనాడు. లేచాడు. తమ్మునితో నడిచాడు. ఋష్యమూక పర్వతం సమీపిస్తోంది. కొండమీదున్నాడు సుగ్రీవుడు. చూశాడు అన్నదమ్ముల్ని. భయపడ్డాడు. నిశ్చేష్టుడైనాడు.

వాళ్ళని వాలి పంపించి ఉంటాడనుకున్నాడు సుగ్రీవుడు. దిగులు చెందాడు. నలుదిక్కులా చూశాడు. అటు ఇటు తిరుగుతున్నాడు. ఒకచోట నిలువలేకపోయాడు. మనసు స్థిమితం తప్పింది. దుఃఖం వచ్చింది. సహచరులతో ఆలోచించాడు. మరింత ఆందోళన చెందాడు. అంటున్నాడు.

'నార చీరలతో ఉన్నారు. ఈ అడవిలోకి ఎందుకు వచ్చారు? వాలి పంపాడా? ఎలా తిరుగుతున్నారో చూశారా?'

మరో పర్వత శిఖరం మీదికి దూకాడు సుగ్రీవుడు. తక్కిన వానర వీరులు కూడా ఎగురుతున్నారు. దూకుతున్నారు. పూల చెట్లు విరిగిపోయాయి. పెద్ద పులులు, అడవి పిల్లులు, జింకలు బెదిరిపోతున్నాయి. అందరూ సుగ్రీవుని చెంత చేరారు. అపుడు అంటున్నాడు హనుమంతుడు.

''వానర వీరా! ఇది ఋష్యమూక పర్వతం. ఇక్కడికి వాలి రాలేడు. భయపడకు. రాజుగా ఉన్నావు. సామాన్యుడిలా తయారైనావు. చపలుడవైనావు. నీ ధైర్యం ఏమైంది? నీవు బుద్ధిమంతుడవు. లోక జ్ఞానం కలవాడవు. ఇంగిత జ్ఞానం కలవాడవు. నీ బుద్ధికి పదును పెట్టు''.

విన్నాడు సుగ్రీవుడు. 'హనుమంతా! వాళ్ళు ఆజానుబాహులు. శరచాప ఖడ్గధారులు. అలాంటి వారిని చూస్తే చాలు. ఎవరైనా భయపడతారు. ఆ పురుషోత్తముల్ని వాలి పంపి ఉంటాడు. అది నా సందేహం. రాజులకు ఎందరో స్నేహితులుంటారు. రాజుల్ని నమ్మరాదు. ప్రతి వ్యక్తి గూఢచారి అనుకోవాలి. వాలి ఇక్కడికి రాకపోవచ్చు. అతని మిత్రుల్ని పంపవచ్చుగా. వాలి మేధావి. ఉపాయశాలి. కార్యశీలి. నీవు ఒక పని చెయ్. వారి దగ్గరికి వెళ్ళు. వారి ముఖ కవళికల్ని గమనించు. చేష్టలు గమనించు. సౌమ్యులా కాదా గమనించు. మనకు అనుకూలురైతే ప్రశంసించు. ప్రతికూలురైతే పదే పదే తృప్తి పరచు. నమ్మించు. ఎందుకోసం వచ్చారో తెలుసుకో'' అన్నాడు సుగ్రీవుడు. విన్నాడు ఆంజనేయుడు. అంగీకరించాడు.

## భిక్షురూపం

సుగ్రీవుడు ఆదేశించాడు. సన్యాసి రూపం ధరించాడు హనుమంతుడు. కొండమీద ఉన్నాడు. ఒక్క గంతు వేశాడు. రామలక్ష్మణులున్న చోటికి చేరాడు. వారిని సమీపించాడు. వినయంతో నమస్కరించాడు. యథావిధిగా పూజించాడు. ఇలా మాట్లాడాడు. ఆ మాటలు మృదువుగా ఉన్నాయి. మధురంగా



ఉన్నాయి.

''మీరు రాజర్షుల్లా ఉన్నారు. దేవతల్లా కనపడుతున్నారు. వ్రతదీక్షా పరులుగా ఉన్నారు. తాపసుల్లా కనిపిస్తున్నారు. జటావల్కలాలు ధరించారు. మహావీరుల్లా ఉన్నారు. పరాక్రమవంతులుగా ఉన్నారు. మీ బాహువులు ఏనుగుల తొండాల్లా ఉన్నాయి. మీ ధనుస్సులు ఇంద్ర ధనుస్సుల్లా ఉన్నాయి. వజ్రాయుధాల్లా ఉన్నాయి. మీ అమ్ముల పొదులు చూడముచ్చటగా ఉన్నాయి. బాణాలు చూశాను. మహాసర్పాల్లా బుసలు కొడుతున్నాయి. మీ పొడవాటి ఖడ్గాలు చూశాను. కుబుసం విడిచిన పాముల్లా ఉన్నాయి. మీ ఇద్దరి రూపాలు ఒకటిగా ఉన్నాయి. రాజపుత్రుల్లా ఉన్నారు. పృథ్విని పాలించే వారిలా ఉన్నారు. నడిచి వచ్చారు. ఎందుకు వచ్చారు? ఏదో వెదుకుతున్నారు''.

ఆగాడు మారుతి. వారినుంచి సమాధానం రాలేదు. ''నేనింతగా మాట్లాడాను. మీరు పెదవి విప్పలేదు. వానరులకి రాజుగా తగినవాడు సుగ్రీవుడు. ఆ వానర ప్రముఖుడికి సచివుణ్ణి. నా పేరు హనుమంతుడు. సుగ్రీవునికి ఒక అన్న ఉన్నాడు. అతడు మోసగించాడు. సుగ్రీవుడు ధర్మాత్ముడు. మీ మైత్రి కోరుతున్నాడు. నేను కామరూపిని. కామగమనం కలవాణ్ణి. భిక్షు రూపంలో వచ్చాను''.

విన్నారు అన్నదమ్ములు. సంతోషించాడు రాముడు. తమ్ముణ్ణి

చూశాడు. అంటు న్నాడు. ''ఇతడు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అధ్యయనం చేశాడు. వ్యాకరణం బాగా నేర్చాడు. ఒక్క అపశబ్దం లేదు. ముఖ కవళికల్లో ఏ వికారమూ లేదు. ఆగి ఆగి మాట్లాడటం లేదు. గబగబా మాట్లాడటం లేదు. సందిగ్ధంగా మాట్లాడటం లేదు. విస్తారంగా మాట్లాడటం లేదు. తల ఆడిస్తూ మాట్లాడటం లేదు. చెప్పదలచుకున్నది చేవగల మాటల్లో చెబుతున్నాడు. ఇతని మధుర వచనాలు ముగ్ధమనోహరాలు. ఇతన్ని చంపాలనే శత్రువు – కత్తి ఎత్తుతాడు. మాటలు వింటాడు. చల్లబడుతాడు. కత్తి దించుతాడు. ఇలాంటి దూత ఉంటే చాలు. సకల కార్యాలు సిద్ధిస్తాయి''.

మొదట వేదాలు మూడే. త్రయీ అనే పేరు. అథర్వణ వేదం అందులో ఇమిడి ఉంది. తర్వాత వ్యాసుడు నాలుగుగా విభజించాడు. అథర్వణ వేదాన్ని విడదీశాడు.

లక్ష్మణుడు అంటున్నాడు. ''విద్వాంసుడా! కబంధుణ్ణి కలిశాం. సుగ్రీవుడి గూర్చి చెప్పాడు. అతని కోసం వెతుకుతున్నాం. అతనితో మైత్రి మాకు సమ్మతమే''.

విన్నాడు హనుమంతుడు. సంతోషించాడు. వీరి సాయం మనకు అవసరం. వాలిని జయిస్తాడు సుగ్రీవుడు – తనలో అనుకున్నాడు మారుతి.

భిక్షువు అంటే బ్రహ్మచారి, సన్న్యాసి అని అర్థాలున్నాయి. తల్లికి తప్ప – ఇతరులకు నమస్కరించరాదు సన్న్యాసి. హనుమంతుడు భిక్షు రూపంలో ఉన్నాడు. రామలక్ష్మణులకు నమస్కరించాడు. అది సంప్రదాయ విరుద్ధం. హనుమంతుడు అసలైన సన్న్యాసి కాదు. గూఢచారి. వేషం మార్చాడు. రామలక్ష్మణుల రూపం చూశాడు. సౌందర్యం చూశాడు. తన్మయుడైనాడు. అన్నదమ్ముల్ని ఆకర్షించాలనుకున్నాడు. మైమరచాడు. ఆ ఉభయులు రాజపుత్రులు. మహావీరులు అని తలచాడు. భక్తితో నమస్కరించాడు.

రామలక్ష్మణులు సుగ్రీవుని కోసం వెదుకుతున్నారు. సుగ్రీవుని సచివుడు హనుమంతుడు. అతడే ఎదురు వచ్చాడు. వెదకబోయిన తీగ కాలికి చుట్టుకున్నట్లు – అన్న సామెత సార్థకమైంది.

'ఎందుకు వచ్చారు?' మళ్ళీ అడిగాడు హనుమంతుడు. లక్ష్మణుడు సవివరంగా చెప్పాడు. దశరథ మహారాజు – అతని కొడుకుల్లో పెద్దవాడు రాముడు. తండ్రి మాట కోసం వనవాసం మొదలు – సీతాపహరణం – కబంధుని వరకు చెప్పాడు. అవి 10 శ్లోకాలు. సుగ్రీవుని వెదుకుతూ వచ్చాం. ధర్మవత్సలుడు, దీనజన శరణ్యుడు, శరణాగత రక్షకుడు రాముడు. ''సుగ్రీవం వానరేంద్రంతు రామ. శరణమాగతః'' వానర ప్రభువు సుగ్రీవుని శరణు వేడుతున్నాడు. భార్యా వియోగ దుఃఖితుడు మా రాముడు. మీ సుగ్రీవుడు మాకు సాయం చేయాలి'' ముగించాడు. కన్నీరు కార్చాడు సౌమిత్రి.

బదులు పలుకుతున్నాడు హనుమంతుడు. ''మీరు బుద్ధిమంతులు. జిత క్రోధులు. జితేంద్రియులు. మా సుగ్రీవునికి మీ రెంతో అవసరం. అతడే మీ సాయం కోసం ఉన్నాడు. అతడే మీ దగ్గరికి రావాలి. కానీ మీరే వచ్చారు. సుగ్రీవుని అన్న వాలి. రాజ్యం నుంచి తరిమి వేశాడు తమ్ముణ్ణి. రాజ్య భ్రష్ఠుడైనాడు. అయినా సీతాన్వేషణలో మీకు సాయం చేస్తాడు''.

భిక్షురూపం వదిలివేశాడు మారుతి. వానరరూపం పొందాడు. ఆ వానర వీరుడు యశో విశాలుడు. పరమ పరాక్రమశాలి. వాయుసుతుడు చూశాడు అన్నదమ్ముల్ని. ఇద్దరినీ తన భుజాలపైకి ఎత్తుకున్నాడు. ఋష్యమూక పర్వతం చేరాడు.

సుగ్రీవునికి శరణాగతుడైనాడు రాముడు. వింటూనే ఆశ్చర్యం కలుగుతుంది. ''కాలోహి దురతి క్రమః'' అంటాడు కబంధుడు. కాలం బలవత్తరమైనది. దాన్ని అతిక్రమించలేము. అంతేకాదు. సుగ్రీవుడు వానరుడని చులకనగా చూడకండి. సీతని తెచ్చి ఇవ్వగల సమర్థుడు అన్నాడు కబంధుడు. విధి బలీయం కనుకనే ఒక నరునిగా శరణాగతుడైనాడు రాముడు.

## మైత్రి

మొదట్లో సుగ్రీవుడు రామలక్ష్మణులను చూశాడు. భయపడ్డాడు. ఋష్యమూకం నుంచి ఎగిరాడు. దగ్గరలోని మలయగిరి మీద వాలాడు. అక్కడికి అన్నదమ్ముల్ని తీసుకెళ్ళాడు హనుమంతుడు. కపిరాజుని సమీపించాడు మారుతి. రామలక్ష్మణుల్ని పరిచయం చేశాడు. ''రావణుడు రాముని భార్యని అపహరించాడు. నీ సహాయం కోరుతున్నారు. నీ స్నేహం కోరి వచ్చారు'' అన్నాడు.

వచ్చినవాళ్ళని చూశాడు సుగ్రీవుడు. భయం పోయింది. మనుష్యరూపం ధరించాడు. వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు. ''మీ విషయం వాయుసుతుడు చెప్పాడు ప్రభూ! నీవు నాతో స్నేహం – అది నాకు ఒక సత్కారం. నాకు శ్రేయోదాయకం. ఇదో నా చేయి. నీ చేయి కలుపు. అదే మైత్రీ బంధం. విడదీయరాని అనుబంధం''.

విన్నాడు రాముడు. సంతోషించాడు. తన చేయి చాచాడు. సుగ్రీవుని చేయి పట్టుకున్నాడు. అతణ్ణి దగ్గరికి తీసుకున్నాడు. గాఢంగా కౌగలించుకున్నాడు.

అంతలో భిక్షు రూపం త్యజించాడు హనుమ. వానర రూపం స్వీకరించాడు. జమ్మిచెట్టు దగ్గరికి వెళ్ళాడు. రెండు కొమ్మలు తెచ్చాడు. మథించాడు. అగ్ని సిద్ధం చేశాడు. పూలతో



పూజించాడు. ఇద్దరి మధ్య ఉంచాడు. రామ సుగ్రీవులు పరస్ప రం చేతులు పట్టుకున్నారు. అగ్నికి ప్రదక్షిణం చేశారు. అది అగ్నిసాక్షిగా స్నేహబంధం. మిత్రులైనారు.

భిక్షురూపంతో వెళ్ళాడు మారుతి. రామలక్ష్మణులను చూశాడు. మానవ రూపంతో వాళ్ళని ఎత్తుకున్నాడు. సుగ్రీవుని వైపు వెళ్ళాడు. మళ్ళీ భిక్షు రూపంలో ఉన్నాడు. అంటే ఏ రూపంలో వెళ్ళాడో అదే రూపంతో వచ్చాడు. కపిరాజుకి అలాగే కనిపించాడు. అది సచివుల లక్షణం.

వాలి తరిమేశాడు సుగ్రీవుణ్ణి. నలుగురు వానరులతో వచ్చేశాడు. రావణుడు తరిమేశాడు విభీషణుణ్ణి. నలుగురు రాక్షసులతో వెళ్ళాడు. అంటే నలుగురితో కలిసి బతకాలని అంతరార్థం.

**త్వం వయస్యోఽసి మే హృద్యోహ్యేకం దుఃఖం సుఖించనౌ |**
**సుగ్రీవో రాఘవం వాక్యమ్ ఇత్యువాచ ప్రహృష్టవత్ ||**

రాఘవా! ఈరోజు నీవు నాకు ప్రాణమిత్రుడవు. నా హృదయం సంతోషంతో ఉప్పొంగిపోతోంది. ఈ క్షణం నుంచి నీ దుఃఖమే నా దుఃఖం. నీ సుఖమే నా సుఖం. సుఖ దుఃఖాల్లో మనం సరి సమానులం.

సుగ్రీవుని వెంట వచ్చిన వానరులు 1.హనుమంతుడు 2.నీలుడు 3.నలుడు 4.తారుడు. అయితే విభీషణుని వెంట వచ్చిన వారి పేర్లు అనలుడు, శరభుడు, సంపాతి, ప్రఘసుడు. ఈ నలుగురూ విభీషణుని మంత్రులు (37 సర్గ. 7 శ్లో).

స్నేహితులైనారు రామ సుగ్రీవులు. అటు ఇటు చూశాడు. మద్ది చెట్టు కనిపించింది. వెళ్ళాడు. ఒక కొమ్మ విరిచాడు. దాన్ని ఆసనంగా వేశాడు. రాముణ్ణి కూర్చోబెట్టాడు. పక్కన కూర్చున్నాడు సుగ్రీవుడు. వెంట వచ్చిన లక్ష్మణస్వామిని విస్మరించాడు. సౌమిత్రి నిలబడే ఉన్నాడు. అతనికి వనవాస శిక్ష లేదు. అన్నని అనుసరించాడు. అడవులకి వచ్చాడు. భగవత్ కైంకర్యం కోసం వచ్చాడు. సర్వం త్యజించి వచ్చాడు. లక్ష్మణుడు లక్ష్మీ సంపన్నుడంటాడు వాల్మీకి. పరమ భాగవతుడు. అతని పట్ల అపచారం జరిగింది. గమనించాడు హనుమంతుడు. చందన వృక్షం చూశాడు. దగ్గరికి వెళ్ళాడు. పెద్ద కొమ్మ తుంచాడు. లక్ష్మణున్ని కూర్చోమన్నాడు.

అంటున్నాడు సుగ్రీవుడు రామునితో. ''నా అన్న వాలి. నా భార్యని దౌర్జన్యంగా లాక్కెళ్ళాడు. అది నా బాధ. నన్ను వంచించాడు. తరిమేశాడు. విరోధం పెట్టుకున్నాడు. ఎపుడేం చేస్తాడో ఏమో – అది నా భయం. నా ఆందోళన. వాలి ఇక్కడికి రాడు. ఈ పర్వతమే నాకు రక్షణ. నువ్వు నాకు అభయం ఇవ్వాలి. నా భయం పోగొట్టాలి''.

విన్నాడు రాముడు. ''మైత్రికి ఉపకారమే ఫలం. అది నాకు తెల్సు. నీకు అన్యాయం చేశాడు వాలి. వాణ్ణి చంపుతాను. ఇదో చూడు. ఇవి నిశితమైన బాణాలు. అమోఘాలు. శక్తిమంతాలు. పదునైనవి. క్రూర సర్పాల్లాంటివి. భయంకరమైనవి. దుష్టాచారుడు వాలి. వాణ్ణి హతమారుస్తాను. వజ్రాయుధపు దెబ్బకి పర్వతంలా – వాడు నేల కూలుతాడు.

సంతోషించాడు సుగ్రీవుడు. ''రాఘవా! ఇక నేను నా భార్యని, రాజ్యాన్ని పొందగలను. అంతా నీ అనుగ్రహం. నీ వీలును బట్టి చూడు. నా శత్రువుని చంపు''.

అలా స్నేహ పురస్సరంగా రామ సుగ్రీవులు మాట్లాడుకుంటున్నారు. ఇటు కిష్కింధలో వాలి ఎడమకన్ను అదిరింది. అటు లంకలో సీతమ్మ ఎడమ కన్ను అదిరింది. నిప్పు కణల్లాంటి కన్నులు రావణునివి. వాడి ఎడమకన్ను అదిరింది. ఆ ముగ్గురి కన్నులూ ఒకేసారి ఒకే సమయంలో అదిరాయి. విచిత్రం.

ఇంటికి వచ్చిన వారిని ఆనందంతో ఆహ్వానించాలి. కళ్ళల్లో ప్రేమ కనిపించాలి. పలకరింపులో ఆప్యాయత కనిపించాలి. అవి లేనపుడు – ఆ ఇంట కనక వర్షం కురిసినా సరే – ఆ ఇంటికి పోరాదన్నాడు కబీర్ దాసు. రాముణ్ణి మాత్రమే గౌరవించాడు సుగ్రీవుడు. కూర్చోబెట్టాడు. సౌమిత్రిని అగౌరవపర్చాడు. అన్న ప్రక్కన తమ్ముణ్ణి కూర్చోమనలేదు. తనే రాముని పక్కన

కూర్చున్నాడు. రామునికి కోపం వచ్చింది. దాని ఫలితం సుగ్రీవుడు మున్ముందు అనుభవిస్తాడు. మరోమాట – సముద్ర తీరానికి వెళ్ళాం. కాళ్ళ దగ్గరికి అలలు వస్తాయి. అంత మాత్రాన సముద్రుణ్ణి చులకనగా చూస్తామా?

రాముని పక్కన కూర్చున్నాడు సుగ్రీవుడు. ''రామా! భార్యా వియోగంతో ఉన్నావు. నీ దుఃఖం చిరకాలం ఉండదు. పాతాళంలో ఉన్నా – మరెక్కడ ఉన్నా నేను నీ భార్యని తెస్తాను. నీకు సమర్పిస్తాను. వేదాల్ని మధుకైటభులు అపహరించారు. శ్రీహరి వాటిని ఎలా తెచ్చాడో – అలా నీ భార్యని తెస్తాను. సురాసురులు కాని దేవేంద్రుడు కాని నీ భార్యని ఏమీ చేయలేరు. ఆమెని పొందడం – విషాన్నం తిన్నట్లే అనుకో'.

## నగల మూట

అంతలో సుగ్రీవునికి జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ అంటున్నాడు. ''ఒకరోజు ఒక రాక్షసుణ్ణి చూశాను. వాడు ఆకాశంలో పోతున్నాడు. వాడి చంకలో ఒక స్త్రీ ఉంది. ఆమె మైథిలి కావచ్చు. ''రామా లక్ష్మణా'' – అంటూ కేకలు వేస్తోంది. నేను విన్నాను. అపుడు ఈ నలుగురితో ఉన్నాను. మమ్మల్ని చూసిందామె. సొమ్ముల మూట జారవిడిచింది. ఆ మూటను దాచాను. నీవు గుర్తు పట్టగలవు. అవి సీతామాతవి అనుకుంటాను.''


లేచాడు సుగ్రీవుడు. నడిచాడు. గుహలోకి వెళ్ళాడు. తెచ్చాడు. మూట ఇచ్చాడు రామునికి. ఆ గుడ్డ సీతమ్మ చీర చెరగు. చూశాడు రాముడు. మూట విప్పాడు. ఆభరణాలు చూశాడు. కళ్ళనిండా కన్నీరు. పొగమంచు కమ్మిన చంద్రునిలా అయ్యాడు రాముడు. ''హా ప్రియా!'' అన్నాడు. విలపించాడు. ధైర్యం సడలింది. కిందపడ్డాడు. గుండెలపై నగలు పెట్టుకున్నాడు. కళ్ళు కాల్వలైనాయి. నిట్టూరుస్తున్నాడు. సౌమిత్రిని పిలిచాడు. ''తమ్ముడా! ఇవి చూడు సీతవే కదా! పచ్చిక మీద పడ్డాయి. చెక్కు చెదరలేదు''. చూశాడు లక్ష్మణస్వామి. అంటున్నాడు. శ్రీరామాయణంలో ఈ శ్లోకం ఒక రత్నం.

**నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే |**

**నూపురేత్వభి జానామి నిత్యం పాదాభివందనాత్ ||**

''ఈ కేయూరాలు (వంకీలు) నేనెరుగను. ఈ కుండలాలు (చెవుల దిద్దులు) నేనెరుగను. నిత్యం పాదాలకు నమస్కరిస్తుంటాను. ఈ కాలి అందెలు మాత్రం తెలుసు. అవి వదిన గారివి''.

వనవాసం పదమూడేళ్ళు గడుస్తోంది. సీతమ్మని కన్నెత్తి చూడలేదా లక్ష్మణస్వామి? కన్ను ఒక ఇంద్రియం. చూడటం దాని ధర్మం. మైథిలి ముఖం చూశాడు. నేత్రాలు చూశాడు. భుజాలు చూశాడు. ఒక తల్లి భావనతో చూశాడు. అపుడు అవి మనసులో



నిలవవు. ముద్రపడవు. కేవలం సీతమ్మ పాదాలు మాత్రమే సౌమిత్రి హృదయంలో నిలిచాయి. చెరగని ముద్ర వేశాయి. అందుకే నూపురాలు నేనెరుగుతానన్నాడు. అది లక్ష్మణస్వామి శీల సంపద.

అంతేకాదు. తారను చూస్తాడు సౌమిత్రి. వెంటనే తల వంచుకుంటాడు. సత్పురుషులు పరస్త్రీలను చూడవచ్చు. దోషం కాదంటుంది తార. కాని కొందరు పురుషులుంటారు. మాట్లాడేటపుడు స్త్రీల ముఖాలు చూడరు. నేల చూస్తారు. వారి పాదాలు చూస్తారు. గోడవైపు చూస్తారు. అది స్త్రీల పట్ల వారిలోని గౌరవ భావం. పర స్త్రీని ఎలా చూడాలో చెబుతోంది శ్రీ రామాయణం మనకు. అది భారతీయ సంస్కృతి. రావణుడు చూశాడు సీతమ్మని. ఆ చూపుల్లో కాముకత్వం ఉంది. అది రాక్షస స్వభావం. ఒక్కోసారి అమ్మ చేయి పట్టుకుంటాం. సోదరి చేయి పట్టుకుంటాం. అపుడా భావన అనుభూతి వేరు. భార్య చేయి పట్టుకుంటాం. అపుడు అనుభూతి వేరు.

రాముడు లేచాడు. ''సుగ్రీవా! నా సీతను ఎత్తుకుపోయాడు రాక్షసుడు. ఎటు వెళ్ళాడు? ఎక్కడుంటాడు? మృత్యుద్వారం తనకు తానే తెరుచుకున్నాడు'' అన్నాడు.

వాడెవరో నాకు తెలియదు. వారి బలం బలగం తెలియదు. పరాక్రమం తెలియదు. అయినా ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా పరివారంతో వెదుకుతాను. రామా! నీవు మహా మహిమాన్వితుడవు. దైన్యం వద్దు. దుఃఖించకు. నేను సామాన్యుణ్ణి. వానరుణ్ణి. నాకు భార్య లేదు. శోకం లేదు నాకు. ధైర్యం వీడలేదు. కష్టాలు వస్తాయి. నిబ్బరంగా ఉండాలి. నౌక బరువు ఎక్కుతుంది. నీట మునిగిపోతుంది. నిగ్రహం లేనివాడు శోక సాగరంలో మునిగిపోతాడు ప్రభూ! దుఃఖించేవానికి సుఖం ఉండదు. పరాక్రమం ఉండదు. స్నేహ భావంతో చెప్పాను. చనువుతో చెప్పాను. మంచి చెప్పాను. ధైర్యం వహించు.

నా మైత్రిని నీవు గౌరవిస్తావు కదూ – అలా ఓదార్చాడు సుగ్రీవుడు.

**(సశేషం)**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

### మూడవ అధ్యాయం

## నీలకంఠాశ్రమ వృత్తాంతం

**1.నృసింహాద్రి:** దేవలుడు దేవదర్శన మహర్షిని ఇలా ప్రశ్నించాడు. ''ఓ మహర్షీ! మహేశ్వరుడైన నీలకంఠుడు నరసింహాకృతి ధరించిన శ్రీమన్నారాయణుని ఈ వైకుంఠాద్రిలో ఎక్కడ పూజించాడు?'' అని అడుగగా దేవదర్శనుడు ఇలా చెప్పనారంభించాడు.

''ఓ బ్రాహ్మణోత్తమా! త్రికాలజ్ఞుడైన మహేశ్వరుని చరిత్రను చెబుతాను విను. ఇది చరితార్థులకు, యోగులకు భోగసాధనమైనది. సకలాభీష్టప్రదమైనది, రమ్యమైనది. చతుర్విధ పురుషార్థములను ఇచ్చునది. పరబ్రహ్మ స్వరూపుడైన, నృసింహావతారం ధరించిన శ్రీమహావిష్ణువు యొక్క అనుగ్రహమును పొందుటకు సాధనమైనది. సంసార బంధమును పోగొట్టునది.

ఇక్కడకు ఉత్తరమున ముప్పై యోజనాల దూరంలో సకల ప్రాణులకు భయమును పోగొట్టునది, శరీరానికి గగుర్పాటు కలిగించునది, అతి భయంకరమైనది, మధ్యలోను, ఇరుప్రక్కల గొప్ప వృక్షములు కలిగినది, అక్షయమైన ఒక పర్వతమున్నది. దానిపై పరమ శివుని దివ్యాశ్రమమున్నది. ఆ ఆశ్రమంలోని రావిచెట్టు తొఱ్ఱలో పక్షులు నివాసముంటున్నాయి. విశాలమైన ఆ పర్వత చరియలు చెట్లు, పొదలు, గుహలతో అంధకార బంధురమై ఉన్నవి.

ఆ పర్వత శిఖరాల మధ్యలో నున్న గుహలలో వానప్రస్థులైన వనచరులు నివసిస్తున్నారు. ఎత్తైన ఆ పర్వత శిఖరముల నుండి, చరియల నుండి నిర్మలమైన సెలయేళ్ళు ప్రవహిస్తున్నాయి. ఆ సెలయేళ్ళు పారుట వలన వాటికి యిరువైపులా ఉన్న చెట్లు, పూదోటలు తడిసి ఉన్నాయి. గుహలలో కరిగిన బంగారు రంగుగల గైరికాది ధాతువులు నిండి ఉన్నాయి. సూర్యకాంత మణుల నుండి వచ్చే కాంతితో ఆ పర్వతం ప్రకాశిస్తున్నది. చంద్రకాంత శిలలు చంద్రకిరణములు సోకుట వలన కరిగి స్రవిస్తున్నాయి.

సింహాలు తమ పంజాలతో ఏనుగుల కుంభస్థలాలను కొట్టగా, వాటి కుంభస్థలాల్లోని ముత్యాలు ఆ సింహాల గోళ్ళ నుండి రాలుతున్నాయి. ఆవిధంగా జారిపడిన ముత్యాలు ఆ ప్రాంతమంతా పడి ఉండుట వలన ఆ పర్వత సానువులలో వనచరులు సంచారము చేయుటకు కష్టంగా ఉంది. మాణిక్య కాంతులు సూర్యకాంతిని తిరస్కరిస్తున్నాయి. నానావిధ రత్నకాంతులతో ఆకాశమంతా ప్రకాశిస్తున్నది. గృహాంతర్భాగంలో పగడాల రాశులున్నాయి. ఎత్తైన ప్రదేశాలు తెల్లని, ఎర్రని రాళ్ళతోను, పద్మరాగ మణులతోను, పాటల వర్ణంలో ఉన్నాయి.

ఆ పర్వత శిఖరాల లో అప్సరస గణాలు నృత్యగానాలు చేస్తున్నాయి. పూదీగలతో నిర్మించబడిన క్రీడాగృహాలలో కిన్నర దంపతులు తాళరాగ యుక్తంగా శ్రుతి సుభగంగా భగవంతుని దివ్యావతార చరిత్రను పాడుతున్నారు. గురివింద పొదలు సుందరంగా ఉన్నాయి. గుహలలోని వారు గానవిద్యలోను, సంగీతవాద్య కళలలోను, ఆరితేరి మంద్ర, మధ్యమ, ఉచ్ఛైస్వరములతో గానం చేస్తున్నారు. ఆ పర్వత గుహలలో తపస్సు చేస్తున్న మహర్షులు సూర్య మండలము నందు దృష్టి పెట్టి ప్రచండ కాంతితో ప్రకాశిస్తున్నారు. ఆ సూర్యకిరణ కాంతులతో వికసించిన పద్మాలు ఆ పర్వత శిఖరాలను అలంకరించినట్లున్నాయి.

ఒకచోట భైరవులనే రుద్రుని సేవక దంపతులు పెద్ద పెద్ద ఢక్కాలను మ్రోగిస్తున్నారు. వాళ్ళ చేతులు చంచలంగా ఉన్నాయి. పైకి నిక్కబొడుచుకున్న వారి జుట్టు భయంకరంగా ఉంది. వారి కనుగుడ్లు గిరగిరా తిరుగుతున్నాయి. వారు మదంతో ఆడంబరంగా నర్తిస్తున్నారు. ఆ పర్వత ప్రాంతంలో దేవతలు, రాక్షసులు, సిద్ధులు, యోగులు, భూతాలు, యోగినులు, సప్తమాతృగణాలు, యక్షులు, ఇతర దేవతా సమూహములన్నీ కూడా నివసిస్తున్నాయి.

మరొక ప్రాంతంలో యోగాభ్యాస నిష్ణాతులు, సహృదయులు ఐన యోగి పుంగవులు యోగాసనాలలో కూర్చుని పరమాత్మను ధ్యానిస్తున్నారు. అక్కడ గుహలలో ఒకే భావం గల ఏకాయనులు నివసిస్తున్నారు. కృష్ణసార మృగమును ఆడు జింకలు అనుసరించి పోతున్నాయి. అక్కడ భయంకరములైన సింహ, శార్దూల, ఖడ్గమృగాదులు కూడా పరస్పర వైరాన్ని వదలి కలిసి తిరుగుతున్నాయి. ఆ పర్వతం యొక్క ప్రభావం వర్ణింప నలవి గాదు.

**2. నారసింహ క్షేత్రం :**

ఆ పర్వతం యొక్క పుణ్యారణ్య సమీపంలో పవిత్రమైన నరసింహ క్షేత్రం ఒకటి ఉన్నది. దానిలో కొత్త చిగుళ్ళచే శోభిస్తున్న అందమైన మారేడు వనాలున్నాయి. జువ్విచెట్లు, రుద్రాక్ష వృక్షాలు ఇంకను కోమలమైన, మనోహరమైన, ఆకాశాన్నంటే కొమ్మల చిగుళ్ళు గల అనేక వృక్షాలున్నాయి. మఱ్ఱిచెట్లతో ఆ ప్రాంతమంతా నిండి ఉంది. అనేక యజ్ఞ మండపాలు అక్కడ నిర్మించబడినాయి. దేవదారు వృక్షాలు దట్టంగా కిక్కిరిసి ఉన్నాయి. ఆ పర్వత సానువులలో గల చెట్లనీడలు తమనాశ్రయించిన వారి తాపాలను తీరుస్తున్నాయి. అక్కడ అహిర్బుధ్న్యుడు (శివుడు) తపస్సు చేశాడు. అది జీవుల శరీర బంధాలను పోగొడుతుంది. ఆ నరసింహ క్షేత్రంలో సింహాలు భయంకరంగా గర్జిస్తుంటాయి. అది మహా భయంకరమైనది, ఆశ్చర్యకరమైనది, ఆనంద జనకమైనది, పరమ పావనమైనది.

**3. నీలకంఠాశ్రమం :**

అక్కడి పుష్కరిణి ఒడ్డున ఒక పర్వత గుహ ఉన్నది. దానిలో ఒక మఱ్ఱి వృక్షము శాఖోపశాఖలుగా విస్తరించి ఉంది. అది గాఢాంధకారంతోనే పెరుగుతున్నట్లుంది. ఆ వృక్షము తాపత్రయ పీడితులైన జీవుల ఆర్తిని పోగొట్టి వారి హృదయాలలో ఉండే అజ్ఞాన తిమిరాన్ని హరిస్తుంది. అది కల్పవృక్షం వలె కోరికలను నెరవేరుస్తుంది. అది వేద వేదాంత విజ్ఞులకు నిధి వంటిది. దాని దరి జేరిన, ఆశ్రయించిన మానవుల మహాపాతకాలను కూడా నశింప చేస్తుంది.

ఆ మఱ్ఱి వృక్షము క్రింద శంకరుని ఆశ్రమం ఉంది. అక్కడ నరసింహస్వామి పెంచిన మగలేళ్ళు, ఆడలేళ్ళు ఆ పరిసర ప్రాంతంలో సంచరిస్తుంటాయి. భయంకరమైన పెద్దపులులు అక్కడ సంచరిస్తుంటాయి. ఆ ప్రాంతాల్లో విశ్వామిత్రము, దర్భలు, ముంజలు, కాశ మొదలగునవి మొలచి ఉన్నాయి. మందార, మల్లె మొదలగు పూలచెట్లు, హరిచందన వృక్షాలు, మామిడి చెట్లు, పాటల వృక్షాలు, అశోక, తిలక వృక్షములు, సువర్ణక, తాపింఛ వృక్షాలు, కానుగ చెట్లు, కొబ్బరి చెట్లు, పనస, వేగిన, చంద్ర, సురపొన్న, పోక, రుద్రాక్ష వృక్షములు, పగడ, తాడి, కరక చెట్లు మొదలగు అనేక వృక్షాలు అంతటా ఆవరించి ఉన్నాయి. ఇంకను నందివర్ధన చెట్లు, ఉసిరిక, అడవి మొల్లలు, గన్నేరు, తామర, దవనం, పూలగురివింద, జాజి, తులసి, పారిజాతం మొదలగు పరిమళ వృక్షముల తోను, పూలచెట్లతోను నిండి ఉంది.

**4. పరమశివుని తపస్సు :**

పరమ పవిత్రమైన ఆ విష్ణు క్షేత్రంలో పరమశివుడు నారసింహుని గురించి తపస్సు చేయుటకై వచ్చాడు. త్రిపురాసుర సంహారి అయిన పరమ శివుడు ఆ పుణ్య పుష్కరిణీ తీరంలో నివాసమేర్పరచుకొన్నాడు. దానిలో స్నానానుష్ఠానములు చేసి దివ్యాంబరములు ధరించి, హరిచందనముల నలంకరించుకొని సర్వ ఋతువుల యందు లభించే ఫలాలను చేత పట్టుకొని దివ్య పుష్పాలతో కట్టిన మాలలను ధరించి, దివ్యాభరణాలు, ముత్యాలు, రత్నాలు, పగడాల మాలలను ధరించి దివ్యమంగళ విగ్రహుడై ఉన్నాడు.

మంగళ వేషధారులైన నందీశ్వరుడు మొదలైన ప్రమథ గణాలు ఆయన్ని సేవిస్తున్నాయి. నిరంతర సేవావిశారదులైన భూత సంఘాలు ఆయన్ను సేవిస్తున్నాయి. నల్లని, తెల్లని కుక్కలతో పాటు అప్రతిహతులైన ప్రమథ గణాలు, క్షేత్ర పాలకులు ఆ పరమ శివుని తపస్సుకు భంగం రానీయకుండా ఆ పరిసరాలను సంరక్షిస్తున్నారు.

ఈవిధంగా అందరిచేత సేవించబడుతున్న ఆ భోళా

శంకరుడు, సకల ప్రాణులను సృష్టించువాడు, జగన్నియామకుడు, అందరి పాపాలను పోగొట్టేవాడు, ఆశ్రిత వత్సలుడు, శత్రు సంహర్త , భక్తానుగ్రహ వత్సలుడు, జగత్ప్రభువు, శంకరుని తపః ఫ ల స్వరూపుడు, సర్వజ్ఞుడు, పరాత్పరుడు, అవ్యయుడు, నాశర హితుడు, లక్ష్మీనృసింహ స్వరూపుడు, అఖిలార్తి హరుడు, మహాపరాక్రమ సంపన్నుడు, ఉగ్రస్వరూపుడు, భయంకరుడు, విచిత్ర రూపధారి, శబ్దబ్రహ్మమయుడు, సకల శాస్త్రప్రవర్తకుడు, వాక్కునకతీతుడు, వేదోద్ధారకుడు, సకల పదార్థ స్వరూపుడు, పరమ పావనుడు, పురాణ పురుషుడు, సనాతనుడు, నిర్హేతుక మిత్రుడు, శత్రుసంహర్త, శరణ్యుడు, సకలాధారుడు, భక్తార్తిభంజనుడు, అభయప్రదుడు, సచ్చిదానంద స్వరూపుడు, వృద్ధిక్షయ వర్జితుడు, షడ్గుణ పరిపూర్ణుడు, త్రిగుణాత్మక వైభవం కలవాడు, శ్రీవత్స లాంఛనుడు, సర్వలక్షణ లక్షితుడు, ప్రాకృత ప్రపంచ దోషరహితుడు, సకల లోకాలకు వ్యాపించినవాడు, విశ్వేశ్వరుడు, పరబ్రహ్మ స్వరూపుడు అయిన ఆ నారసింహుని పరమశివుడు గజచర్మాంబర ధారియై, పులిచర్మాన్ని ఉత్తరీయంగా ధరించి, ఏకాగ్రచిత్తంతో ధ్యానిస్తూ ఆ మఱ్ఱి చెట్టు క్రింద కూర్చొని పాంచరాత్రాగమంలో చెప్పిన విధంగా ఐదు కాలాలలో ఆయనను ఆరాధిస్తూ, లోక కళ్యాణానికై, సర్వలోక క్షేమానికై, సర్వవ్యాపియైన శ్రీమహావిష్ణువును పూజించుటకై అగ్నిరేతస్కుడైన శివుడు తపస్సు చేయనారంభించాడు.

**5. నరసింహస్వామి ఆరాధన :**

పరమశివుడు జితేంద్రియుడై ఏకాగ్ర చిత్తంతో సర్వలోక క్షేమం కొరకు వైకుంఠవాసి, వైజయంతీమాలధారి, నరసింహరూపుడైన శ్రీమన్నారాయణుని నిరంతరం ధ్యానిస్తూ ఉన్నాడు. ఆయన నిశ్చలుడై స్వస్థమానసుడై, నిర్వికారుడై ఆ మఱ్ఱిచెట్టు మొదట్లో పులిచర్మంపై దర్భాసనం వేసుకొని పద్మాసనంలో కూర్చొని జితేంద్రియుడై సర్వభూతముల యందు సమదృష్టి కలవాడై దయాసముద్రుడై తన దయా దృక్కులతో లోకత్రయాన్ని వీక్షిస్తూ బాలసూర్యుని కిరణాల వలె బంగారు రంగు గల జడలతో విరాజిల్లుతున్నాడు.

ఆనీలకంఠుడు, పశుపతి, శ్రీకంఠుడు, పరమేశ్వరుడు, కపర్ది, తన జటాజూటంలో చంద్రకళను ధరించాడు. ప్రళయకాల భయంకరమైన పరాక్రమంతో సూర్య, చంద్రాగ్నులనే నేత్రాలతో శోభిస్తున్నాడు. ఆయన జడలనే అరణ్యంలో గంగను శిరస్సున మాలవలె ధరించాడు. అష్టమూర్తి, అనంతాత్మ, విశిష్టవైభవం కలవాడు, సర్వాభీష్ట ఫలప్రదుడు అయిన పరమ శివుని ముఖము శరత్కాలంలోని పున్నమి చంద్రుని వలె నిర్మలంగా ప్రకాశిస్తున్నది. ఆయన శరీరంపై ధరించిన ఆభరణాలు ప్రళయకాల సూర్యునివలె ప్రకాశిస్తున్నాయి.

పవిత్ర శరీరుడైన ఆ పరమ శివుడు విశ్వ సంరక్షణ కోరి దక్షిణామూర్తియై తపస్సుకు కావలసిన సాధన సామగ్రిని సమకూర్చుకొని శత్రు సంహారకుడు, పరబ్రహ్మ స్వరూపుడు అయిన ఆ బాలనరసింహుని నిత్యం ఆరాధిస్తూ నిర్హేతుక దయానిధి, పార్వతీపతి అయిన శంకరుడు చరాచర జగత్తులోని అందరికీ మిత్రుడై, సకల లోకేశ్వరుడై, పరమానంద నిధియై, బ్రహ్మానందంతో అలరారుతున్నాడు.

**6. దివ్య మంగళ స్వరూపం :**

ఆ నరసింహస్వామి దివ్యమంగళ విగ్రహం శత్రు సంహారకమైనది. సకల కళా పరిపూర్ణమైనది. సర్వోత్కృష్టమైనది. ఆయన తీక్షణ నేత్రములనుండి అగ్నిజ్వాలలు ప్రసరిస్తున్నాయి. ఆయన జూలు అగ్నివర్ణంలో ఉంది. ఆయన భయంకరమైన కోరల నుండి నిప్పుకణాలు వెలువడుతున్నాయి. ఆయన తన తొడలపై హిరణ్యకశిపుని వెల్లకిలా పెట్టుకొన్నాడు. అతని వక్షస్థలాన్ని తన వాడి గోళ్ళతో చీలుస్తున్నాడు. ఆ హిరణ్యకశిపుని రక్తాన్ని, కంఠాన్ని, శిరస్సును అనాయాసంగా హరిస్తున్నాడు. ఆయన అనేక బాహువులలో అనేక దివ్య శస్త్రాస్త్రాలను ధరించాడు. ఆయన భయంకర గర్జనలతో ఆకాశం దద్దరిల్లింది. భక్తవత్సలుడైన ఆ నారసింహుడు భక్తుల దోషాలను భోగ్యంగా గ్రహిస్తాడు. ఆయన సకలైశ్వర్య ప్రదుడు. సృష్టి స్థితి లయ లీలామయుడు. భక్తులకు ఆనందప్రదుడు, దేవదానవులకు అధిదైవము. ఆయన రత్న కాంతులతో ప్రకాశిస్తున్న కిరీటాన్ని ధరించి సూర్యునివలె విరాజిల్లుతున్నాడు. ఆయన కుండలాలు సూర్యకాంతితో ప్రకాశిస్తున్నాయి.

ఆయన నవవిధ రత్నాలతో కూర్చిన మూడు పేటల ముత్యాల హారాన్ని ధరించాడు. ఆయన వక్షస్థలం ఐదు, ఏడు పేటల ముత్యాలహారాలతో విరాజిల్లుతున్నది. ఆయన ప్రకాశిస్తున్న మురుగులు, కేయూరాలు, కంకణాలు, ఉంగరాలు ధరించాడు. ఉత్తరీయం, బ్రహ్మసూత్రం ధరించి పట్టువస్త్రం నడుముకు ధరించాడు. చిన్న చిన్న మువ్వలు గల అందెలను పాదాలకు ధరించాడు. అవి మాణిక్య ఖచితములై హంసలవలె ధ్వని చేస్తున్నాయి. ఆయన పాదతలములు, కరతలములు అప్పుడే వికసించిన ఎర్ర తామరల వలె ఉన్నాయి. ఆ చిరుమువ్వల ధ్వని మనోహరంగా ఉంది.

ఆయన రంగు రంగుల రత్నకాంతులీనుతున్న పట్టు పీతాంబరాన్ని ధరించాడు. అన్ని ఋతువులలోను పూచే పుష్పాలతో కూర్చబడిన మాలలను అలంకరించుకున్నాడు. దివ్య పరిమళం గల రక్త చందనాన్ని పూసుకున్నాడు. ఆ దివ్య మంగళ విగ్రహం అనేక చీని చీనాంబరాలు, పూలమాలలు, సుగంధ పరిమళాలతో అలంకరించబడింది.

దేవేంద్రుడు మొద లగు సురశ్రేష్ఠులందరూ ఆయన్ను సేవిస్తున్నారు. ఆయన చుట్టూ దేవతా బృందాలు మందార పుష్పాలను దోసిళ్ళలో పట్టుకొని ఉన్నారు. సనక సనందనాది యోగి పుంగవులు ఆయన్ను సేవిస్తున్నారు. వీణానాదం వలె వీనుల విందుగా వినబడుతున్న అథర్వవేద మంత్రాలతో ఆయన్ను స్తుతిస్తున్నారు. నేను (దేవదర్శనుడు) వీణను వాయిస్తూ భక్తితో ఆయన్ని కీర్తిస్తుండగా తుంబురుడు మొదలైన గంధర్వులు ఆయనను పరమానందంతో స్తుతిస్తున్నారు.

గరుడుడు, విష్వక్సేనుడు, కుముదాది గణాలు ఆయన్ను సేవిస్తున్నారు. సభలో తన చుట్టూ పరివారం పరివేష్టించి ఉన్నారు. వైష్ణవోత్తములు రాజోచితమైన ఛత్ర చామరాదులను, ఆయుధాలను ధరించారు. ఆయన చుట్టూ సాత్త్విక, రాజస, తామస శక్తులు పరివేష్టించి ఉన్నాయి. ఆ దేవ దేవుడు తన భక్తులందరికీ అభయమిస్తున్నాడు. సప్తలోకాలలో ఉన్న సిద్ధసంఘాలు ఆయన్ను సేవిస్తున్నాయి. అటువంటి నారసింహ పరబ్రహ్మ దివ్యమంగళ విగ్రహాన్ని నీలకంఠుడు ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నాడు.

తన నాశ్రయించిన ప్రాణులందరకు ఐహికాముష్మిక ఫలాలను ప్రసాదించే ఆ దివ్యమూర్తిని షోడశోపచారాలతో పూజించాడు. ఆయన బ్రహ్మేంద్రాదులకు సకల ప్రాణులకు ప్రభువు. సర్వభూతాంతరాత్మ. అటువంటి పరమేశ్వరుడు ఏకాగ్రచిత్తంతో ఆయన్ను ధ్యానించాడు. లక్ష్మీనారాయణుడు అక్కడ సదా సంచరిస్తూ ఉంటాడు. ఆ ప్రాచీన ఆశ్రమంలో త్రిపురాసుర సంహర్త అయిన పరమ శివుడు పరమ భాగవత ధర్మానుష్ఠాన తత్పరుడై నారసింహుని ఆరాధిస్తూ సుఖంగా ఉన్నాడు. కావున ఆ నీలకంఠుని అందరూ మహాత్ముడని మహాదేవుడని పేర్కొన్నారు. సకల చరాచర ప్రాణిజాతానికి ఆయన జీవగఱ్ఱ.

**7. పరమ పవిత్ర ప్రదేశం :**

ఆ నీలకంఠాశ్రమం నందలి పుణ్య పుష్కరిణి పరమ పవిత్రమైనది. అది జీవులకు పుణ్యాపుణ్య ఫలములను, చతుర్విధ పురుషార్థములను ప్రసాదిస్తుంది. అది శివునికి ప్రీతి కలిగిస్తుంది. ఇది నూతనమైన పరమేశ్వరుని తపోభూమి. పవిత్ర క్షేత్రం. ఇక్కడ చేసిన తపస్సు కోటి రెట్లు ఫలితాన్నిస్తుంది. కావున దీనికి 'పుణ్యారణ్య'మని పేరు. అక్కడి న్యగ్రోధ వృక్షము (మఱ్ఱివృక్షము) సకల పాపములను పోగొడుతుంది. ఒక్కసారి దానిని దర్శించినంత మాత్రాననే సకలాభీష్టాలను ప్రసాదిస్తుంది. ఆ లక్ష్మీనరసింహుని ఆలయము పరమ పవిత్రమైనది. ఆ నరసింహస్వామి నీలకంఠుని తపస్సు చేత ప్రసన్నుడైన పరదైవము. ఈ నరసింహ క్షేత్రంలో నృసింహుని ఆలయము, న్యగ్రోధ వృక్షము, పుణ్యపుష్కరిణి, సింహగిరి, నీలకంఠాశ్రమము అను ఐదు పరమ పవిత్రమైనవి. ఈ ఐదింటిలో కూడా పరమేశ్వరుడు ఆరాధించిన ఈ నీలకంఠాశ్రమం విశేషమైనది. ఈ నీలకంఠాశ్రమానికి 'సింహగిరి' అని మరొక పేరు కలదు. దీని మహిమ ఆశ్చర్యకరమైనది. దీని మాహాత్మ్యం అద్వితీయం. ఇది పరమ పావనమైన పుణ్యక్షేత్రం. పుణ్యాత్ములకు నెలవు.

**8. భైరవుడు క్షేత్రపాలకుడు :**

దేవలుడు దేవదర్శన మహర్షిని 'ఓ దేవదర్శన మహర్షీ! వైదికశ్రేష్ఠా! వృషభాచలంలో ఉన్న శ్రీమహావిష్ణువు యొక్క దివ్య క్షేత్ర వైభవాన్ని నాకు తెలియజేయండి' అని అడిగాడు. అపుడు దేవదర్శనుడు ఇలా చెప్పనారంభించాడు.

'ఓ దేవలా! ధీమంతా! ఈ నృసింహగిరిలోని వైకుంఠనాథుని క్షేత్రమహిమను వివరిస్తాను. నీవు సావధాన చిత్తుడవై వినుము. వైకుంఠవాసియైన శ్రీమన్నారాయణుడు అనేక దివ్య లోకములను, వైకుంఠమును వీడి ఈ నారాయణగిరిలో ప్రీతితో నివసిస్తున్నాడు. సర్వాంతర్యామి, సహస్రాక్షుడు, సనాతనుడు, పరమాత్మ, పరాత్పరుడు తన సంకల్పమాత్రం చేతనే జగత్తును సృష్టించువాడు, హృషీకేశుడు, కేశవుడు భక్తులను రక్షించుటకై ఇక్కడ నివసిస్తున్నాడు.

ఈ క్షేత్రమును భైరవుడనే క్షేత్రపాలకుడు సదా జాగరూకుడై రక్షిస్తున్నాడు. ఆయనకు సహాయముగా నల్లని కుక్కలు, రాక్షసులను సంహరించిన ప్రమథగణాలు ఉన్నాయి. ఆయన తన శరీరాన్నంతా భయంకరమైన పాములతో అలంకరించుకుంటాడు. తళతళా మెరుస్తున్న ఖడ్గాన్ని, కపాలాన్ని, డమరుకాన్ని, త్రిశూలాన్ని నాలుగు చేతుల్లో ధరిస్తాడు. అతడు శివపరిచారకుడు.

**9. పార్వతీదేవి తపస్సు :**

పూర్వం ఆ అంజనాద్రికి తూర్పు దిక్కున బాల సూర్యునివలె ప్రకాశిస్తున్న సకలాభీష్ట ఫలప్రదాత యైన పార్వతీదేవి తపస్సు చేసింది. ఆమె పూర్వజన్మలో సతీదేవిగా ఉండి దక్షయజ్ఞంలో తండ్రి చేత పరాభవించబడి యోగాగ్నిలో శరీరాన్ని త్యాగం చేసింది. శివుడు కూడా అదృశ్యమయ్యాడు. ఆ సతీదేవియే మరుజన్మలో పార్వతీదేవిగా ఆవిర్భవించింది. పార్వతీదేవి శివుని అర్ధాంగి కాగోరి తపస్సు చేయ సంకల్పించి అంజనాద్రికి వచ్చింది. ఆమె అక్కడ నిశ్చల చిత్తంతో దుర్గమమైన తపస్సు చేసింది. ఆ విధంగా ఇతరులకు సాధ్యము కాని తపస్సు చేయుట వలన మహర్షులు ఆమెను 'దుర్గ' అని పిలిచారు. రుద్రుడామె తపస్సుకు మెచ్చి తన శరీరంలో ఎడమవైపు సగభాగాన్ని ఆమెకిచ్చాడు. అందువల్ల ఆయన 'అర్థనారీశ్వరు'డయ్యాడు. ఈవిధంగా పార్వతీదేవిని అనుగ్రహించి పరమశివుడు అంతర్ధానమయ్యాడు.

ధారావాహికం



# శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

## పదునేడవ అధ్యాయము

**అనంతార్యుల రచనలు – పాఠశాల, ప్రబోధములు**

**పరమ పదము – పొగడమాను స్వరూపుడైయుండుట**

ఒకవైపు పుష్పకైంకర్యములు చేయుచూ, ఇంకొక వైపు జియ్యంగారు వ్యవస్థను పాదుకొల్పి, కర్తవ్యముల సక్రమముగ నిర్వర్తింప చేయుచూ, తన గురువర్యులు చెప్పిన తీరున, తిరుమల ఆలయ పాలనా వ్యవస్థను సమయానుకూలముగ, ఎప్పటికప్పుడు సరిదిద్దుచూ, సమయము దొరికినపుడు సద్గ్రంథ రచనల చేయుచూ, అపుడపుడు గుర్వాజ్ఞ ప్రకారము, శిష్యబృందముతో కూడి, పశ్చిమ దేశమున పర్యటించుచూ, భగవత్ సంబంధ విషయ విపులీకరణల చేయుచూ, తన కర్తవ్య నిర్వహణను నిష్ఠగ, క్రమము తప్పక చేసెడివాడు.

**అనంతాళ్వాన్ రచియించిన ముఖ్య గ్రంథములు :**

**1.శ్రీవేంకటాచలేతిహాసమాల**

**2.శ్రీ గోదా చతుఃశ్లోకి**

**3.మధురకవి దివ్యసూరి ప్రబంధము**

**4.శ్రీరామానుజ చతుః శ్లోకి**

ఇన్ని పనులు ఒక్కడే ఎట్లు చేయుచుండెనో, ఏ తీరుగ పర్యవేక్షించెడివాడో అనంతాళ్వాన్ మరియు ఆ శ్రీనివాస విభునికే ఎఱుక.

ఒకసారి అనంతాళ్వాన్, తన శిష్య బృందముతో కేరళ

దేశము వెళ్ళు క్రమములో, యదుగిరి (మేల్కోటె) నందు వేంచేసి యున్న యదుగిరి శ్రీ తిరునారాయణుని దర్శనము కావించుకొను సమయమున, యదుగిరి శ్రీ తిరునారాయణుని స్థానమున, శ్రీ తిరు వేంకటాద్రీశుడు కాన్పించ, సాష్టాంగ ప్రణామములు చేసి, అనంతాళ్వాన్ ఇట్లనెను.

“స్వామీ తిరువేంగనాథ! నాకంటే ముందుగనే నీవిచ్చట చేరి, నన్ననుగ్రహించ చూచుచున్నావా, ఆహా! ఏమి నా భాగ్యము”నుచూ కన్నుల ఆనంద బాష్పములు రాల్చుచూ శిష్యులతో “చూడండీ! మన తిరువేంకళనాథుడు మనకంటే ముందుగా ఇచ్చటికి చేరి, ఆ యదుగిరి ప్రభువు స్థానమున వచ్చి నిలచినా”డని పలుక, అప్పటివరకు యదుగిరి నాథునిగ కన్పించిన శ్రీ తిరునారాయణుని స్థానమున, శ్రీ తిరువేంకటాద్రీశుడు కాన్పింప, శిష్యులెల్లరూ నమస్కరించుచూ ఆనందముతో ఆనందాళ్వాన్ వారిది ఎంతటి భాగ్యము! ఈ అనంతుని విడచి ఉండలేక, ఆ తిరుమల వెలసిన అనంత పద్మనాభుడు, శ్రీ వేంకటనారాయణుడు, మనకంటే ముందుగ వచ్చి తానై కాన్పించుచున్నాడని తలపోయుచూ, అనంతార్యుల, శ్రీవేంకటేశ్వరుని నడుమనున్న బంధమును వేనోళ్ళ పొగడిరి. ఎంతటి గొప్ప అనుబంధమో ఈ మామా అల్లుళ్ళది.

శిష్యులను కూడా తన మాటలతోనే, చేష్టలతోనే వారి మనస్సుల మార్చి దైవము వైపునకు దృష్టి మరలింప చేసెడివాడు అనంతాళ్వాన్. ఇందులకొక్క ఉదాహరణమును ఉటంకించెదను.

ఒకసారి శిష్యులు కొందరు తాము బయలుదేరుటకు సిద్ధమగుచుంటిమని, తమకు కొంత దివ్యోపదేశముల చేయమని, దేహము వీడువరకు తామెట్లు నడచుకొనవలెనో, నిజమగు శ్రీవైష్ణవులమై విష్ణుపురినెట్లు చేరవలెనో చెప్పమని వేడ, అనంతాళ్వాన్ ఇట్లు చెప్పదొడంగిరి.

“నాయనలారా! మీరిట్లు మంచి సత్ప్రవర్తనతో నడచి, నిజమగు వైష్ణవులై. విష్ణునివాసము చేరవలెనన్న భక్తి యొక్కటే చాలదు. సాధు సాంగత్యము కూడా ఎంతో అవసరము. సజ్జన సాంగత్యము మనల సన్మార్గమున నడిపించును. దుర్జనుల సాంగత్యము, దుర్గతిని పట్టించును. కావున సాంగత్య బలము మన గుణ గణములను, నడవడికను, మాటలను, చేష్టలను ఎంతెంతయో ప్రభావితము చేయును. అది



ఎట్లో మీకు వివరించెదను.

పూర్వము శౌనకాది మునులు ఒక దివ్య ప్రదేశమునకు అడవి మార్గము గుండా ప్రయాణించ సాగిరి. ఏడు రాత్రులు, ఎడతెరిపి లేని గాలీ, వాన తీవ్ర ప్రభావమున వారు ముందుకు పోజాలక, ఎచ్చటనైనను తల దాచుకున వెదక, దగ్గరలో ఒక భిల్లుల గ్రామము కాన్పించ, వారచ్చటకు చేరిరి. భిల్లులు వేటకై వెడలి యుండిరి. భిల్లులు ఒక చిలుకను పెంచుకొనుచుండిరి. ఆ చిలుక, తమ గ్రామమున అడుగిడిన శౌనకాది మునుల చూచి, ఛీత్కరించుచూ ఎవర్రా మీరు, ఇది భిల్లుల గ్రామము ఇచ్చట బ్రాహ్మణులకు, మునులకు, మహర్షులకు స్థానము లేదు. చూచుటకు మీరందరూ గడ్డములు పెంచుకున్న దొంగల వలె నున్నారు. సిగ్గు, ఎగ్గులు మీకు లేవాయనుచు ఇంకనూ విన భరింప శక్యము కాని మాటలాడుచుండ, వారు ఏమీ చేయ పాలుపోక, వేరెక్కడైనా తల దాచుకుందుమనుచూ వెనుతిరిగిరి.

వెదుకుచుండ అక్కడికి కొంత దూరములో నున్న ఋష్యాశ్రమము నొకటి కాన్పింప, అచ్చట అడుగిడిరి.

ఇంతలో ఒక చిలుక వచ్చి, మహర్షులారా మీరెక్కడ నుండి వచ్చుచున్నారు? మీకివే నా నమస్సుమాంజలులు. తమరి అర్ఘ్య, పాద్య, ఆచమనీయాది కార్యక్రమముల పూర్తి చేసుకుని, ఇట సుఖాశీనులై, మేమిచ్చెడి విందునారగించి, మమ్ముల ధన్యము చేయుమని పలుక, ఆశ్చర్య చకితుడైన శౌనకుడు ఓ రామచిలుకా! మేము ఇక్కడికి రాక మునుపు, మేమొక భిల్లుల గ్రామమునకు వెడల, అక్కడ నున్న చిలుక మమ్మీసడించుకుని అనరాని మాటలన, మేము ఖిన్నులమయి మీ ఆశ్రమమునకు వచ్చితిమి. అదే జాతికి చెందిన నీవు ఇంత మంచి మంచి మధురమగు పలుకులతో మమ్మానందింప చేసితివి. మీ జాతి యొక్కటి ఐననూ, మీ ప్రవర్తనల స్వభావముల ఇంత వింతయగు తేడాలెట్లున్నవి యని ప్రశ్నింప, ఆ చిలుక అయ్యలారా! మీరు ఇంతకు ముందు భిల్లుల గ్రామమున కలిసిన చిలుక, నేను సోదరులము. మా తల్లి, తండ్రియును నొక్కరే. జాతియును ఒక్కటే. కాని మేము పెరిగిన స్థానములు వేరు. నా సోదరుని కిరాతకపు భిల్లులు తీసుకుని పోవ, వారి సాంగత్యమున తానట్లు ప్రవర్తించెను. నన్ను అదృష్టవశమున మునిపుంగవులు సాకిరి. వారి సాంగత్యమున



నేనిట్లు ప్రవర్తించుచుంటిని. అందువలననే మా గుణగణముల, స్వభావముల, ప్రవర్తనల నడుమ అంత వ్యత్యాసమున్నదని ఆ చిలుక పలికెను.

కావున శ్రీ వైష్ణవ శిష్యులారా! సాధు సాంగత్యము, సర్వకాలముల భగవదనుగ్రహమును ప్రసాదించును. దుస్సాంగత్యము అనర్థముల కొని తెచ్చి, మనల అటు నిటు కాని జనన మరణ చక్రభ్రమణముల త్రిప్పుచునే యుండునని పలికి, తన శిష్యులను దీవించి, సత్సాంగత్యముల నెరపి, గురుభక్తి పరాయణులై శ్రీమన్నారాయణుని ''ఓం నమో నారాయణాయ'' లేదా ''ఓం నమో వేంకటేశాయ'' యను అష్టాక్షర మంత్రమును తుది శ్వాసన కూడా వదలక పలుకుచూ, వైకుంఠధామమును చేరుమని దీవించి పంపించెను.

ఎంత గొప్ప విషయమును, ఇంత సరళముగ విపులీకరించి చెప్పినాడో చూచితిమి కదా! వైకుంఠ ధామము చేర ఎంత సులువగు మార్గమును ప్రబోధించితిరో కదా అనంతాళ్వాన్ వారు. ఇంతటి గొప్పది అనంతాళ్వాన్ వారి పాఠశాల.

కనుక మనమూ అట్లే సాధు సాంగత్యము, సద్బుద్ధుల గరయుట, సరియగు గురువును ఆశ్రయించి, సేవించి శ్రీవేంకటేశ్వరుని నామ సంకీర్తనముల, భజన, నామస్మరణల పట్టి వీడక చేయుచూ, శ్రీవేంకటేశ్వరుని దివ్య పాద కమలముల చెంత నిట్లే చేరవచ్చును.

ఇవ్విధముగ రోజులు, వారములు, నెలలు, సంవత్సరములు కడచి అనంతాళ్వాన్ లకు 84 సంవత్సరములు నిండెను. వయోభారమున్ననూ, తన పనుల తానే చేసుకొనుచూ, శ్రీవేంకటనాథుని పుష్ప కైంకర్యాది సేవలను ఆపక చేయుచుండెడివాడు.

అనంతాళ్వాన్ తనలో తాను, నా గురువగు శ్రీ భగవద్రామానుజుల వారున్నూ దేహము వీడి, వైకుంఠపురి చేరినారు. దేహము అశాశ్వతము, కాలము నాకున్నూ సమీపించినది. నేను కూడా నా ఈ ఆదిశేషావతారమునకు స్వస్తి చెప్పవలెను. త్రేతాయుగమున ఆదిశేషావతారుడగు లక్ష్మణుడు, శ్రీరామునికంటే ముందుగ తానే వైకుంఠమును చేరెను. ద్వాపరమున బలరాముడున్నూ శ్రీకృష్ణుని వీడి ముందుగ తానే వైకుంఠమునకు వెళ్ళిపోయె. నన్ను విడిచి నా గురుడగు శ్రీ రామానుజుల వారును వెళ్ళిపోయె. ఇక ఇక్కడ నేను ఒంటరిగ నుండి ఏమి చేయవలయునని అనుకుని, మరల వెంటనే అంతకు మునుపు తనను విషసర్పములు కాటు వేసిననాడు, తాను శ్రీవేంకటేశ్వరునితో అన్న మాటలను ''పాము కరచి, విషము వ్యాపించి పోయిన, అల వైకుంఠపురి చేరి, విరజాతీర్థస్థుడగు శ్రీ విష్ణుని సేవింతును. లేని యెడల బ్రతికినచో ఇచ్చటనే ఇల వైకుంఠమగు తిరుమల గిరుల విరజాతీర్థస్థుడగు నిన్ను సేవింతునని పలికితిని గదా యని జ్ఞప్తికి తెచ్చుకుని దిగులు చెందసాగెను.

ఇవ్విధముగ తనలో తాను యోచించుకొనుచూ తన గురు నామస్మరణల నాపక చేసుకొనుచూ, కాలమును భారముగ వెళ్ళదీయుచూ మౌనముగ నుండసాగెను.

అనంతాళ్వాన్ లోని అంతకు ముందటి చలాకీతనము, హుషారు, వేంకటాచలపతితో చతురోక్త సంభాషణములు రోజు రోజుకు తగ్గసాగెను.

ఇదియంతయు గమనించిన శ్రీవేంకటాచలాధీశుడు ఒకనాడు అనంతాళ్వాన్ ఆనంద నిలయమునకు రాగానే ''మామా అనంతా! ఏమి ఇట్లున్నావు? ఆరోగ్యము సరిగా లేదా? వైద్యులను పిలువవలెనా? మనమిరువురము చతురోక్త సంభాషణలు జరుపుకొని ఎన్ని దినములయినదో గుర్తున్నదా? నీవు ఇట్లుండిన నాకున్నూ తిరుమల గిరుల వీడి నిన్ను తోడ్కొని ఇరువురమూ గరుడ వాహనముపై అల వైకుంఠపురి చేరి, స్థిరనివులమవ్వ వలయునని అనిపించుచున్నది. ఇప్పుడే గరుడుని రమ్మందునా''యని పలుక, అనంతాళ్వాన్ ఇట్లు పలికెను.

''స్వామీ! తిరువేంకటాచలాధిపా! నీవు కలిన భువి జనుల నుద్ధరించగ వచ్చితివి. ఇపుడు నాకై, నీవు వైకుంఠము తరలి పోవుదుమన్న, కలి, భూమిపై నున్న జీవరాశులను ఊరక వదులునా? ఎపుడో కాదగు, యుగాంతము. అనంతాళ్వాన్ స్వార్థపు కోరిక వలన ఇపుడే ముగిసినదని ఏడేడు, పదునాల్గు లోకాల వాసులచే, నన్ను ఆడిపోసుకొమ్మనించుకుందువా ఏమి? నీ పరమపద సోపానపు ఆటలు, చతురత నాకు తెలియనివేమి కావులే''యని పలికి, మరలా ''వేంకటేశా నా చింత నా గూర్చి కాదు. ఏదో ఒకనాడు ఈ నా దేహము వీడవలసినదే కదా. నేనీ దేహము విడచి, వైకుంఠమున చేరిన, ఇక్కడ తిరుమల గిరుల నిలచియున్న నీకు పుష్పకైంకర్యములు,

సేవలు చేయువారెవ్వరు? ఎవ్వరేని చేయుచున్న, నేనెట్లు కన్నులార చూచుకుందును? ఆత్మానందుడ నెట్లగుదును? అంతియే కాక, నన్ను వీడి, నా అల్లుడవగు నీవు ఉండగలవా? శ్రీనివాస, నేను పెంచిన పుష్పతోటల విహారముల మాని నీవు మనగలవా? యని యోచించుచుంటిని'' యని పలుక, ఆనందనిలయుడు ఆశ్చర్యుడై, ''అనంతా! భక్తాగ్రేసరులు అందరూ నన్ను మోక్షమునిమ్మని, వైకుంఠమునకు గొనిపొమ్మని వేడువారే తప్ప, నా సన్నిధియే నీకు పెన్నిధియని ఎంత వైనముగ తెల్పితివి? నిజమునకు నిన్ను విడిచి, నేనునూ ఉండలేను'' యని తన నిస్సహాయతను, నిరాసక్తతను శ్రీవేంకట నాథుడు వ్యక్తపరచుచూ, మరి ఏమి చేయమందువని అనంతార్యులనడిగె.

అంత అనంతాళ్వాన్, ''గోవిందా! నేటివరకు నేను చేసిన పుష్ప కైంకర్య సేవలు ఆగిపోనీయక, కలియుగాంతము వరకు నీకు జరుగుచుండ, ఈ తోటనుండి తెచ్చిన తులసీ, పుష్పములతో, నీ తొలి పాదార్చనలు జరుగవలయును. అది చూచుటకు ఆనందనిలయమున కులశేఖరాళ్వారులు కులశేఖరపడి వోలె మారిన చందముగ తిరుమలగిరుల, నేను నిర్మించిన పుష్పోద్యానముననే, నా దేహము నిడవలయును. నేనిచ్చటనే యుండి నీకు జరుగు అధ్యయనోత్సవాది కార్యక్రమముల, బ్రహ్మోత్సవాది ఉత్సవముల, పుష్పకైంకర్యముల వీక్షించవలయును. అట్లే నేను పరమపదించిన రోజున మరియు గునపముతో కొట్టిన రోజునకు గుర్తుగ, నీవు తోటకు విచ్చేసి ఇంటి అల్లునిగ, నా వంశస్థులకు ఆలయ మర్యాదలు చేసి, ఆశీర్వచనముల నీయవలయును. బ్రహ్మోత్సవముల ఆఖరి రోజున, తిరువీధుల ఊరేగు సమయముల, నా ఇంటికడ నిలచి, హారతిని గైకొనవలయును. ఇది నీకు సమ్మతమేనా'' యని అడుగ, ఆనందనిలయుడు, ఆనందాతి హర్షములతో ''అనంతా! నాకది సమ్మతమే. నేను భువిపై నడయాడునంతవరకు, నీవు నిర్మించిన తోటయందే నీవు బృందావన ఆత్మస్వరూప స్థిరనివాసుడవై నాకు ఇష్టమైన పొగడమాను స్వరూపమున వెలుగొందుదువు గాక'' యనుచూ ఆనందనిలయుడు అనంతాళ్వాన్‌ను పరమాదరముతో కౌగలించుకొని పరమానంద భరితుడయ్యి, చతుర్భుజుడై, శంఖ, చక్ర, పద్మ, గదాయుధ శ్రీవిష్ణుడై శ్రీవేంకటేశ్వరుని స్థానమున కాన్పించుచుండ, ఆత్మానందభరితుడైన, అనంతాళ్వాన్ 85వ ఏట (1138 సంవత్సరము) తన దేహము విడచెను.

ముఖ్య విషయము ఏమన, అనంతాళ్వాన్ దేహము విడచిన రోజు, శ్రీ గోదా జయంతి వచ్చును. పుబ్బా నక్షత్రమున (పూర్వ ఫల్గుణి), ఆడి మాసము, కర్కాటక రాశి, తిరువాడిప్పూరము నాడు అనంతాళ్వాన్ దేహము విడిచినాడు. అందుచే




నేటికిని అనంతాళ్వాన్ తోటన నిర్వహించెడి తిరువాడి పుష్పోత్సవమునకు, ఆనంద నిలయుడు తన దేవేరులు ఇరువురితో కలిసి వచ్చి బృందావనమున నున్న అనంతాళ్వాన్ ను ఆదరించి, గౌరవించి వారి వంశస్థులకు మర్యాదలు చేయుచున్నాడు.

ఎన్నడూ లేని విధముగ, శ్రీవేంకట నాథుడు ఒక అర్చకుని ఆవహించి, అనంతాళ్వాన్ లకు తాను చేసిన ప్రమాణము తెల్పి, అనంతాళ్వాన్ పార్థివ దేహమును తోటలోనే పెట్టించి, బృందావనమును కట్టించి దానిపై నొక పొగడమాను మొక్కను మొలకెత్త చేసెను శ్రీ తిరువేంగడనాథుడు.

నేటికినీ ఆనందనిలయమునకు పశ్చిమ దిశ మాడవీధి, దక్షిణ మాడవీధి కలయు మూలన అనంతాళ్వాన్ తోట (డబ్ల్యూ 1 గేట్)ను, అందులోని బృందావనమును, దానిపై నున్న పొగడమాను స్వరూపుడై కాన్పించేటి అనంతాళ్వాన్ వారిని, మనము దర్శించుకొనవచ్చును.

అందువలననే శ్రీవేంకటేశ్వరునికి పొగడపూలు యన్న బహు ప్రీతి. పొగడ పుష్పములన్నీ తన ప్రియ భక్తుడు, మామయగు అనంతాళ్వాన్ రూపములని తలయుటచే ఇప్పటికీ ఎన్ని మాలల బంగారు ఆభరణములు వేసినా, మురియ చూడని శ్రీ ముకుందుడు పొగడమాను పుష్పమాల వేయగనే మురిసిపోవునట. ఇందులో నెట్టి సందేహము లేదు. ఏలయన, సాక్షాత్ అనంతాళ్వాన్ ల వంశస్థుల వాక్యప్రమాణము కావున.

సామాన్యునిగ, నిస్వార్థుడై, గుర్వాజ్ఞ పాలితుడై, తిరుమల వచ్చి అనేక కష్టముల కోర్చి, శ్రీవేంకటనాథుని సేవల చేయుచూ, అనునిత్యమూ, ఆయనతో మాట్లాడుచూ నిగర్వియై తన అసమాన ప్రతిభతో తిరుమలగిరుల యందేగాక శ్రీవేంకటాచలాధిపుని కడ తనకంటూ ఒక సుస్థిర స్థానమేర్పరచుకున్నాడు మన అనంతాళ్వాన్ వారు.

**ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము**
**అనంతార్యుల రచనలు, పాఠశాల, ప్రబోధములు,**
**పరమపదము, పొగడమాను స్వరూపుడైయుండుట యను**
**పదునేడవ అధ్యాయము సంపూర్ణః**

ధారావాహికం


# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి (9550241921)

**భవజలధిగతానాం ద్వంద్వవాతాహతానాం**
**సుత దుహితృ కళత్ర త్రాణ భారార్దితానాం ।**
**విషమవిషయతోయే మజ్జతా మప్లవానాం**
**భవతు శరణ మేకో విష్ణుపోతే నరాణాం ॥**

సంసారమనే సముద్రంలో చిక్కి విరుద్ధ ధర్మములనే గాలిచే కొట్టబడి, పుత్రకళత్రాదుల రక్షణ భారమనే బరువును మోస్తూ, విషయసుఖాలనే నీళ్ళలో మునిగి లేస్తూ, నావ లేకుండా నానా యాతనలకు గురి అవుతున్న నరులకు శ్రీమన్నారాయణుడు అనే నావ ఒక్కటే శరణ్యము.

ఓ మనసా! "భవజలధిగతానాం" భవ అంటే సంసారం, జలధి అంటే సముద్రం ప్రయాసతో కూడినది, గతానాం అంటే పడుట, సంసారమనే అగాధంలో తెలియక దిగాము, తిరిగి గట్టు ఎక్కుదామని ప్రయత్నిస్తుండగా "ద్వంద్వవాతాహతానాం" శీతలము ఉష్ణములనే సుఖదుఃఖములు అను జంట గాలులు కొట్టడం ప్రారంభంచేశాయి. మరి వివాహ సమయమున తెలియలేదా అంటావేమో? మేళతాళములు, విందుభోజనములు, బంధు దర్శనములు మొదలైన సంబరములలో పడి ఇందులో ఉన్న లోతులు తెలియలేదు. అలా మొదలైన తరవాత సుఖదుఃఖములనే గాలులు మొదలైతే కూడా గట్టు ఎక్కడానికి శ్రమ అయినా సహించి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా, నేనే



ఎక్కలేకపోతుంటే నామీద మరింత భారము పడింది "సుత దుహితృ కళత్ర" భార్యాపుత్రాదులను కాపాడటం అనే భారము తలమీద ఉంచుకోవడం వల్ల శ్రమపెరిగి నడవవలసి వచ్చింది. ఆ భారము ఉంచుకుని నిలబడడానికి వీలులేదు.

మునిగితే మాత్రం ఏమిటి అంటావేమో మనసా?

'గ్రహణ సమయంలో సముద్రస్నానం చేయలేదా అంటే నేను అలాంటి స్థలములో మునగలేదు ఉచితమైన స్థలములలో మునిగితే భయము లేదు, నేను దిగినది పూడుకుపోయే స్థలము.'

"విషమ విషయతోయే మజ్జతా మప్లవానాం" విషకరమైన విషయములు అంటే ఇంద్రియాది సుఖములు అనే వాటిలో మునిగాను. విషయవాంఛ అనేది ఉండకూడదా అంటే ఉండవచ్చు భగవద్విషయములైతే తరించడానికి, అనుభవించడానికి ఇంద్రియములు అనుభవింపబడుటకు విషయములను పరమాత్మ దయచేసి ఉన్నాడు.

**ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధి: పర్యవతిష్ఠతే ॥ - గీత 2.65**

పై శ్లోకంలో వలె రాగద్వేషములను త్యజించి విషయములను అనుభవించాలి. కానీ నేను అలాంటి విషయములలో మునగలేదు విషతుల్యములైన విషయాల్లో మునిగాను.

**యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ - గీత 2.60**

ఇంద్రియాలనేవి మంచి విషయాలందు ప్రవేశించే స్వభావము లేదు. అవి లౌకికమైన మనల్ని పాడు చేయు విషయముల యందే పోవును.

మరి ఇలాంటి సంసారమనే అగాధపు సముద్రములో దిగేటప్పుడు ఓడని ఏమైనా సహాయార్థం చూసుకున్నావా? అంటే, మనసా! ఈ రీతిలో అల్లాడే నరులందరికి 'భవతు శరణమేకో విష్ణుపోతే నరాణాం' విష్ణువు అనే నావ మాత్రమే శరణము. కాబట్టి ఓ మనసా! నువ్వు ఎల్లప్పుడూ ఆ పరమాత్మ యొక్క పాదముల వద్దనే స్మరించుతూ ఉండుము. అప్పుడు నాకు

కూడా ఆ నావ లభిస్తుంది. నా యొక్క నిశ్చలమైన భక్తి కలిగిన మనస్సును కనుక అతనికి అర్పిస్తే దానినే కూలీగా తీసుకుని తన దయచేత మనల్ని తరింపచేస్తాడు. వేరు ఏమి ఆయనకు ఇవ్వలేము ఎందుకంటే నిత్యపరిపూర్ణుడు కేవలము మనస్సును మాత్రమే ఇవ్వగలము. ఇలా సంసార సాగరమున పడి అందులో కలిగే బాధలను అనుభవించే నరులకు పరమాత్మ అయినా శ్రీమహావిష్ణువనే ఓడయే శరణమవుతుంది అంటూ వివరిస్తారు మన కులశేఖరాళ్వార్లు.

మన ముక్తాబాయి కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుంది.

క్షేత్రయ్య పదాలు, అన్నమయ్య సంకీర్తనలు మన తెలుగు వారిలో ఏ విధంగా భక్తి భావాన్ని పెంపొందింపచేశాయో, అదే విధంగా మరాఠా ప్రాంతంలో తుకారాం అభంగాలు కూడా భక్తి భావాన్ని సుసంపన్నం చేసిన వైనం అందరికీ తెలిసినదే. సంత్ జ్ఞానేశ్వర్, సంత్ తుకారాం, సంత్ నామదేవ్ సుపరిచితులే అందరికీ. జ్ఞానేశ్వర్ సోదరి, శిష్యురాలు అయిన ముక్తాబాయి 13 వ శతాబ్దిలో మరాఠీలో అభంగాలను సృజించిన తొలి మరాఠీ కవయిత్రి.

13 వ శతాబ్దం లో మొదలైన అభంగాల రచన ఆధునిక యుగంలో కూడా కొనసాగుతూ వచ్చింది. ఈ అభంగాలు బ్రహ్మచర్యం, సమానత్వం, హిందూ గ్రంథాల పఠనం, క్షమ, సరళత, కరుణ, అహింస, ప్రేమ, వినయం వంటి లక్షణాలను అనుసరించమని బోధిస్తాయి.

మహారాష్ట్రలో వార్కారి సంప్రదాయానికి చెందిన అగ్రశ్రేణి వ్యక్తులలో ప్రముఖురాలు ముక్తాబాయి (క్రీ.శ. 1279-1299). మహారాష్ట్రకు చెందిన ప్రముఖ యోగి, సంకీర్తనాచార్యుడు జ్ఞానదేవ్‌కు స్వయానా సోదరి ముక్తాబాయి. ప్రారంభ ఆధునిక కాలంలో (13వ శతాబ్దం) భక్తి ఉద్యమాలలో ఒకటి వార్కారి. ఆ వార్కారీ సంప్రదాయానికి చెందిన మరొకరు, గొప్ప మహిళా సాధువు, ఈమె మహారాష్ట్రలోని అలండికి చెందినవారు.

ఆమె తల్లిదండ్రులు, విఠల్ పంత్ కులకర్ణి మరియు రుక్మాబాయి, గోదావరి నది ఒడ్డున ఉన్న పైఠాన్ సమీపంలోని అపేగావ్‌కు చెందిన పవిత్ర దంపతులు ఆమెకు ముక్త అని పేరు పెట్టారు. ఆమె పేరుకు తగ్గట్టుగానే, ఆమె ఎంతో గౌరవనీయులైన సంత్ జ్ఞానదేవ్ (జ్ఞానం), సంత్ నివృత్తి (త్యజించడం) మరియు సంత్ సోపాన్ (మెట్ల మార్గం)కి సోదరి అయినప్పటికీ, ఆమె తన స్వంత హక్కులో లోతైన కవి-సన్యాసిగా ఎదిగింది. ఆమె దేవి సరస్వతి లేదా ఆదిశక్తి అవతారంగా పరిగణించబడుతుంది.

ముక్తాబాయి సోదరులు సంత్ జ్ఞానదేవ్, సంత్ నివృత్తి మరియు సంత్ సోపాన్ ఈ ముగ్గురు "సంత్" గా ఎంతో పేరు పొందారు. సంత్ అంటే 'సాధువు' అని అర్థం.

వీరు వార్కారి సాంప్రదాయ భక్తులు. విఠలుడు అంటే శ్రీ కృష్ణుని రూపమని భావిస్తారు. కొన్ని చోట్ల రుక్మిణీ దేవితో కలిసి, మరికొన్ని చోట్ల రుక్మిణీ, సత్యభామలతో కలిపి పూజిస్తారు. వీరు తమ భజనలను అభంగాల రూపంలో సృజించి ఆలపిస్తారు.

ఆపేగాంవ్ అనే గ్రామానికి చెందిన విఠల్‌పంత్ కులకర్ణికి, రుక్మాబాయితో వివాహం జరిగింది. ఆ దంపతులకు చాలాకాలం పాటు సంతానం కలుగలేదు. కొద్దికాలం తరువాత విఠల్ పంత్‌కు ఈ ప్రాపంచిక జీవితం పట్ల నిరాసక్తత ఏర్పడింది. అప్పుడు ఆయన వారణాసికి చెందిన రామానంద అనే సాధువును ఆశ్రయించాడు. సన్యాసం స్వీకరించాలనే తన అభిలాషను వ్యక్తం చేశాడు. నిజానికి, గృహస్థు గనక సన్యాసాశ్రమం స్వీకరించాలంటే, అందుకు అతని భార్య అంగీకరించి, అనుమతి నివ్వాల్సి ఉంటుంది. అయితే, తనకు పెళ్ళే కాలేదంటూ విఠల్ పంత్ ఆ సాధువు దగ్గర అబద్ధమాడాడు. ఆ మాటలు నమ్మిన రామానందుల వారు విఠల్ పంత్‌కు సన్యాస దీక్ష ప్రసాదించారు. చైతన్యానంద అనే సన్యాస నామం ఇచ్చారు.

కాగా, వారణాసిలో జరిగిన ఈ పరిణామాలేవీ రుక్మాబాయికి తెలియదు. భర్త క్షేమంగా తిరిగి రావాలని ఆమె దైవ ప్రార్థనలు చేస్తూ గడపసాగింది. ఒకసారి రామానందుల వారు రామేశ్వరం వెళుతూ, మార్గమధ్యంలో అనుకోకుండా రుక్మాబాయిని కలిశారు. మాటల సందర్భంలో, ఆమె భర్తే విఠల్ పంత్ అనే విషయం తెలిసింది. జరిగిన పొరపాటు గ్రహించిన ఆయన ఆ సాధ్వి బాధను గమనించి, సత్ సంతానానికి జన్మనిస్తావంటూ ఆశీర్వదించారు. వారణాసికి తిరిగి వచ్చిన తరువాత రామానందుల వారు విఠల్ పంత్ (చైతన్యానంద)ను అపేగాంవ్ తిరిగి వెళ్ళాల్సిందిగా ఆజ్ఞాపించారు. మునుపటిలా యథావిధిగా గృహస్థాశ్రమ జీవితం గడపాల్సిందిగా ఆదేశించారు. గురువుగారి ఆజ్ఞను విఠల్‌పంత్ శిరసావహించక తప్పలేదు.

కాలక్రమంలో విఠల్ పంత్, రుక్మాబాయి దంపతులకు నలుగురు సంతానం కలిగారు. వారిలో మొదటి ముగ్గురూ మగ పిల్లలు కాగా, నాలుగో సంతానం కుమార్తె. వారే వరుసగా నివృత్తి, జ్ఞానదేవ్, సోపాన్, ముక్తి. విఠల్ పంత్ కుటుంబాన్ని ఊళ్ళోని అగ్రవర్ణాల వారంతా అంటరాని వారిగా చూసేవారు. అదేమంటే, ఒకసారి సన్యాసం తీసుకున్న వ్యక్తి మళ్ళీ గృహస్థు కావడానికి వీల్లేదని వాదించేవారు. ప్రాణత్యాగ మొక్కటే దీనికి ప్రాయశ్చిత్తమని పేర్కొనేవారు. చివరకు విఠల్ పంత్, రుక్మాబాయిలు తమ పిల్లల్ని అనాథల్ని చేసి, తాము గంగానదిలో దూకి ప్రాణత్యాగం చేసుకున్నారు.

సంత్ ముక్తాబాయి రచించిన మొత్తం 41 అభంగాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ముక్తాబాయి రచనలలో "తాతిచే

అభంగ్", "చాంగ్ దేవ్ కు సలహా" ప్రజలలోకి చొచ్చుకుని వెళ్లాయి. వీటిలో శిష్యుడు చాంగ్ దేవ్ చేత స్వరపరచబడిన ఆరు అభంగాలు కూడా ఉన్నాయి. మరియు ఇప్పుడు అతని పేరుతో ముద్రించబడింది. అంతేకాకుండా, నామ్‌దేవ్ గాథలోని 'నామ్‌దేవ్-భక్తిగర్వ పరిహార' పేరుతో కనీసం పదిహేను అభంగాలు (1334 నుండి 1364 వరకు) ఖచ్చితంగా ఉంటాయి.



సంత్ ముక్తాబాయి తన జీవితకాలంలో నలభై ఒక్క అభంగాలను స్వరపరిచింది. జ్ఞానేశ్వర్‌తో మాట్లాడుతూ, "తాటి ఉఘడ జ్ఞానేశ్వర్" అతని అత్యంత ఆచరణాత్మక రచనలలో ఒకటి. మరాఠీ సాహిత్యంలో ఇది ఒక మైలురాయిగా పరిగణించబడుతుంది. ముక్తాబాయి ప్రకారం, సాధువు యొక్క నిర్వచనం "ఒక సాధువు జీవించాలి; జగ్ బోలే సోసేవ్" లేదా సాధువు అంటే ప్రజల విమర్శలను జీర్ణించుకోగలవాడు అని.

ముక్తాబాయి సోదరుడు జ్ఞానేశ్వర్ ప్రజలను ఎంతో ప్రభావితం చేశాడు. ఆయన మనస్సులో వున్న ఆధ్యాత్మిక, సాహిత్య భావాలను అర్థం చేసుకున్నారు. ముక్తాబాయి, జ్ఞానేశ్వర్ అట్టడుగు వర్గాల వారితో మమేకమైపోయిన సామాన్య స్త్రీలను, గ్రామీణ ప్రజలకు దిశానిర్దేశం చేశారు. ప్రకృతి మాతను ఆరాధించి, ప్రేమించారు. గుత్తాధిపతుల చేతుల్లో మగ్గుతున్న మతాన్ని, ఆధ్యాత్మిక భావాల్ని సామాన్య ప్రజలకు అందే విధంగా కృషిచేశారు.

ఇంతకు ముందు, ఈ విఠల్ పంత్, రుక్మాబాయి దంపతులు తమ పిల్లలతో కలిసి నాసిక్ సమీపం లోని త్రయంబకేశ్వర్‌కు తీర్థయాత్రకు వెళ్లారు, అక్కడ వారి పెద్ద కుమారుడు నివృత్తి (వయస్సు 10) గహినినాథ్ చేత నాథ్ సంప్రదాయంలో పెరిగారు. జ్ఞానేశ్వర్ తాత గోరక్ష నాథ్ (గోరఖ్ నాథ్) ద్వారా నాథ్ సంప్రదాయం లోకి ప్రవేశించారు. అనాథ పిల్లలు భిక్షపై పెరిగారు. అతను పిల్లలను అంగీకరించడానికి పైథాన్ బ్రాహ్మణ సంఘాన్ని సంప్రదించాడు, కాని బ్రాహ్మణులు నిరాకరించారు. వివాదాస్పద "శుద్ధిపత్ర" ప్రకారం, బాలురు బ్రహ్మచర్యం యొక్క షరతుపై బ్రాహ్మణులచే శుద్ధి చేయబడ్డారు. బ్రాహ్మణులతో వారి వివాదాలు, వారి సద్గుణం, ధర్మం, తెలివితేటలు, జ్ఞానం మరియు వినయం అబ్బాయిలకు కీర్తి మరియు గౌరవాన్ని సంపాదించాయి.

**ముక్తాబాయ్ సోదరులు-**

**నివృత్తినాథ్:** ముక్తాబాయి యొక్క పెద్ద సోదరుడు, నివృత్తినాథ్ తత్వశాస్త్రంపై అధికారి. తొమ్మిది మంది నాథ గురువులలో ఒకరైన గహినీనాథ్ నివృత్తిని తన శిష్యుడిగా స్వీకరించి, శ్రీ కృష్ణుని పట్ల భక్తిని ప్రచారం చేయమని సూచించి, నాథ్ శాఖలోకి ప్రవేశపెట్టాడు. జ్ఞానేశ్వర్ తన అన్నయ్యను తన స్వంత గురువుగా అంగీకరించాడు. జ్ఞానేశ్వర్ యొక్క ప్రారంభ సమాధి తరువాత, నివృత్తి తన సోదరి ముక్తాబాయ్‌తో కలిసి తపతి నది వెంబడి తీర్థయాత్రకు వెళ్లాడు, అక్కడ వారు పిడుగు పాటులో చిక్కుకున్నారు. ముక్తాబాయ్ నీటిలో కొట్టుకుపోయింది. నివృత్తి త్రయంబకేశ్వరుని వద్ద సమాధి పొందాడు. దాదాపు 375 అభంగ్‌లు అతనికి ఆపాదించబడ్డాయి, అయితే వాటిలో చాలా వాటి రచనా శైలి మరియు తత్వశాస్త్రంలో వ్యత్యాసం కారణంగా వివాదాస్పదమయ్యాయి.

**జ్ఞానేశ్వర్ (1275–1296)**: తోబుట్టువులలో రెండవవాడు 13వ శతాబ్దపు మరాఠీ సంత్, కవి, తత్వవేత్త మరియు నాథ్ సంప్రదాయానికి చెందిన యోగి, వీరి జ్ఞానేశ్వరి (భగవద్గీతపై వ్యాఖ్యానం) మరియు అమృతానుభవ మరాఠీ సాహిత్యంలో మైలురాళ్లుగా పరిగణించబడుతున్నాయి.

**సోపాన్ :** మూడవ సోదరుడు పూణే సమీపంలోని సస్వాద్‌లో సమాధి పొందాడు. అతను 50 లేదా అంతకంటే ఎక్కువ అభంగ్‌లతో పాటు భగవద్గీత యొక్క మరాఠీ అనువాదం ఆధారంగా సోపాందేవి అనే పుస్తకాన్ని రాశాడు.

**ముక్తాబాయ్ రచనలు**

"తాటిచే అభంగ్" (ది సాంగ్ ఆఫ్ ది డోర్) –

ఈ రచనలో ఆమె ఇలా చెప్పింది: "సన్యాసి మనస్సులో స్వచ్ఛంగా ఉంటాడు మరియు ప్రజల అపరాధాలను క్షమిస్తాడు. ఉద్రేకం కారణంగా ప్రపంచం అగ్నిలా వేడిగా ఉంటే, ఋషి ఆనందంతో నీటిలా చల్లగా ఉండాలి. ప్రజలు మాటల ఆయుధాలతో వారిని బాధపెడితే, సాధువులు చికిత్స చేయాలి. ఆ వ్యాఖ్యలు సలహాలు. ఈ విశ్వం ఒక్క బ్రహ్మ దారంతో అల్లిన వస్త్రం, కాబట్టి దయచేసి తలుపు తెరవండి ఓ జ్ఞానేశ్వర్."

**చాంగ్‌దేవ్‌కు ముక్తాబాయ్ ఉపదేశాలు -**

"అతనికి రూపం లేకపోయినా నా కళ్ళు అతనిని చూశాయి. అతని మహిమ నా మనస్సులో అగ్నిగా ఉంది, అది ఆత్మ ద్వారా కనుగొనబడిన అతని రహస్య అంతర్గత రూపాన్ని తెలుసు కుంటోంది. మనస్సుకు మించిన సరిహద్దు లేదు. దానిలో మన ఇంద్రియాలు ముగుస్తాయి. ఇంకా ముక్తాబాయ్ ఇలా చెప్పింది: "పదాలు అతనిని ఇంక పట్టుకోలేవు అన్ని పదాలు అతనిలో ఉన్నాయి." "చీకటి ఎక్కడ పోయిందో అక్కడ నేను నివసిస్తాను, నేను సంతోషంగా ఉన్నాను. నేను రావడం మరియు వెళ్లడం

వల్ల నేను ఇబ్బంది పడను, నేను అన్ని దృష్టులకి అతీతంగా, అన్ని రంగాలకు అతీతంగా ఉన్నాను. అతని ఆత్మ నా ఆత్మలో నివసిస్తుంది." మరియు ఇలా చెప్పింది "అతను నా హృదయానికి మాత్రమే ఇల్లు."

మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో భక్తులు ముక్తాబాయిని పూజిస్తారు. ఉత్తర మహారాష్ట్రలో ప్రజలు ముక్తాయ్‌ని పూజిస్తారు మరియు ముక్తాయ్ ఆలయానికి వరిస్ (భక్తి సందర్శనలు) చేస్తారు. వార్కారి సన్యాసి ముక్తాయ్ 'ఆదిశక్తి', దేవతగా భావిస్తారు. ముక్తాయ్ రాసిన అభంగాలను వార్కారిలు పాడతారు. వారు సాధువు ముక్తాబాయి అని పిలుస్తారు – ముక్తై అంటే తల్లి ముక్తాబాయి.

సన్యాసి ముక్తాబాయి గౌరవార్థం ఒక పట్టణం పేరు ఎడ్లాబాద్ నుండి ముక్తైనగర్‌గా మార్చబడింది. ఈ పట్టణం ముక్తైనగర్ తాలూకా యొక్క పరిపాలనా కేంద్రం కాబట్టి తాలూకా ముక్తైనగర్ తాలూకాగా కూడా మారింది.

మహారాష్ట్రలోని బాల్భారతి యొక్క మరాఠీ పాఠ్య పుస్తకాలలో సెయింట్ ముక్తాయ్ యొక్క అభంగాలు చేర్చబడ్డాయి.

భగవత్ కథా పాఠకులు సన్యాసి ముక్తాయ్‌ను ఎంతో గౌరవంగా ప్రస్తావిస్తారు.


ఛాంగ్ దేవ్ ముక్తాబాయి ని గురువుగా స్వీకరించాడు. "వేదాల ఆధ్యాత్మికత – తత్వసారం" ని వ్రాయమని ముక్తాబాయి ఛాంగ్ దేవ్ కి ప్రేరణ కలిగించింది. ఈ విధంగా తన శిష్యులకు గాక వేలాది మంది భక్తులను ఉత్తేజ పరిచింది. ముక్తాబాయి "ఛాంగ్ దేవ్ మహారాజ్ యొక్క ఆధ్యాత్మిక మార్గదర్శి" అంటారు. మరాఠీ మహిళా కవులలో ఆదర్శవంతంగా ముక్తాబాయి ఉండడం ఆనందించదగిన విషయం.

ముక్తాబాయి జ్ఞాపకార్థం తేది 30.05.2023 న 5 రూపాయల విలువతో ఒక స్టాంపును విడుదల చేసింది భారత తపాలా శాఖ. ఆ స్టాంపు మీద ఆమె నిలబడి వున్న చిత్రం పసుపు రంగు ముద్రలో కనపడుతుంది. ఎరుపు రంగు చీరలో అభయ ముద్రలో దర్శనమిస్తుంది. తలమీద గ్రామ దేవతల మాదిరిగా కిరీటంతో వెలుగుతూ మెరుస్తున్న ముక్తాబాయి చిత్రం శోభాయమానంగా కనపడుతుంది.




20 ఏళ్ల వయస్సులో 1299 లో మరణించిన ముక్తాబాయిని, మహారాష్ట్రలో గ్రామీణ ప్రజలు ఈనాటికీ గ్రామదేవతగా పూజిస్తారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 54 వ కళ్యాణం

27-09-2023 బుధవారం ఉదయం 11 గంటలకు జరిగింది. మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్, ఉప్పల్ ఈస్ట్ కళ్యాణపురి కాలనీ వాసుల ఆధ్వర్యంలో, ముఖ్యంగా శ్రీ సతీష్ కుమార్, శ్రీ ఆనంద్ రెడ్డి, శ్రీ రత్నకుమార్ దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అన్నమాచార్య కీర్తనల నడుమ జరిగింది.

## 55 వ కళ్యాణం

16-10-2023 సోమవారం రోజున జరిగింది. శ్రీ శివపార్వతీ దేవాలయం, ఎస్.బి.హెచ్ కాలనీ, ఉప్పల్ లో శ్రీమాన్ బి.మోహన్ రావు – లత, శ్రీమాన్ శివనారాయణ – గీతిక దంపతుల నిర్వహణలో వైఖానసాగమోక్తంగా జరిగింది.

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



## పరాయి చెర నుండి ఆలయానికి విముక్తి :

హిందూ దేవాలయాల, ధార్మిక సంస్థల, మరీ ముఖ్యంగా కుల , వర్గ, ప్రాంతీయ భేదాల కతీతంగా హిందువులందరూ ఆ రాధించే తిరుమల ఆలయ వ్యవహారాల్లో ఈస్ట్ ఇండియా కంపెనీ వారి జోక్యం మితిమీరడంతో, హిందూ సంప్రదాయ వాదుల్లో తీవ్రమైన అసంతృప్తి ప్రబలింది. క్రమంగా వారి సహనం హద్దులు దాటి, బ్రిటిష్ ప్రభుత్వంపై వ్యతిరేకత నివురు గప్పిన నిప్పులా వేగంగా విస్తరించడంతో, ముందు చూపు కల్గిన వివేకవంతులైన బ్రిటిష్ అధికారులు కళ్ళు తెరిచారు. లండన్ లోనూ, కలకత్తాలోనూ ఉన్న ఈస్టిండియా కంపెనీ ఉన్నతాధికారులకు అనేక రహస్య నివేదికలు పంపారు. ఈ వ్యవహారాన్ని తెగేవరకు లాగవద్దని, తిరుమల ఆలయ వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం పనికిరాదని సందేశాలు ఇచ్చారు. ఇండియాలోని గవర్నర్ జనరల్ కు దాదాపుగా హిందూ మరియు మహమ్మదీయ ధార్మిక సంస్థలకు సంబంధించి ఇలాంటి నివేదికలే అందాయి. వాటన్నింటిని సమీక్షించిన ఆంగ్లేయ పాలకవర్గం, భారతదేశంలోని అన్ని మతపరమైన సంస్థలలో క్రమంగా జోక్యం తగ్గించుకోవాలని తీర్మానించింది. తదనుగుణంగా అప్పుడు తిరుమల దేవాలయం యొక్క వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న నార్త్ ఆర్కాట్ జిల్లా కలెక్టర్ కు ఆలయ నిర్వహణ విధుల నుండి తప్పుకొని, ఆ బాధ్యతను తగిన వ్యక్తులకు కాని, వ్యవస్థకు గానీ అప్పగించవలసిందిగా తాఖీదు అందింది.

**ఎవరు సమర్థులు ?:** అయితే అసలు సమస్య అప్పుడే మొదలైంది. ఆలయ వ్యవహారాలపై ఆధిపత్యం బ్రిటిష్ వారి నుండి ఎవరికి సంక్రమించాలి? ఇంతటి గురుతరమైన బాధ్యతను అత్యంత సమర్థవంతంగా ఎవరు నిర్వహించగలరు? తిరుమల క్షేత్రంలోనే కాకుండా తిరుపతి పట్టణంలోనూ, దాదాపు చిత్తూరు జిల్లా మరియు పరిసర ప్రాంతమంతటా అప్పట్లోనే శ్రీవారికి లెక్కలేనన్ని మడులు, మాన్యాలు ఉన్నాయి. వాటన్నింటిని సంరక్షించడం ఎవరి వల్ల సాధ్యమవుతుంది? ఇటువంటి క్లిష్టమైన ప్రశ్నలకు సమాధానం అంత సులభంగా దొరకలేదు. దానికోసం పెద్ద కసరత్తే జరిగింది.

అప్పట్లో స్వామివారినే తమ సర్వస్వంగా భావించి, తమ జీవితాలను శ్రీవారికి అంకితం చేసిన వైష్ణవులలో అంకిత భావానికి, సేవానిరతికి ఏమాత్రం కొరత లేదు. వారి నీతి–నిజాయితీలను, చిత్తశుద్ధిని ఏమాత్రం శంకించనవసరం లేదు. అయితే తంగళై, వడగళై అంటూ ఇరువర్గాలుగా చీలిపోయిన వైష్ణవులలో ఐకమత్యం లోపించి పరస్పరం కలహించుకునేవారు. ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం శాయశక్తులా ప్రయత్నించేవారు. కాబట్టి వారికి అధికారం అప్పగిస్తే, పరస్పర స్పర్ధల కారణంగా వారు ఆలయ పరిపాలన భారాన్ని సజావుగా నిర్వహించగలగటం సందేహాస్పదమే.

అలాగే ఆలయంలో మరో బలమైన వర్గం అనూచానంగా స్వామివారిని సేవించుకుంటున్నట్టి వంశపారంపర్య అర్చకులు.

ఎల్లవేళలా పూజా పునస్కారాలలో మునిగి ఉండే అర్చకులలో పాలనా పాటవం అంతగా లేదు. పైగా, వారికి పాలన పగ్గాలు అప్పజెప్పితే, వైదిక కార్యకలాపాలకు అంతరాయమేర్పడి, భక్తులలో ఆలయం పట్ల నిర్లిప్తత కలిగితే కానుకల ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

జియ్యంగార్లు కూడా వైదిక విధుల నిర్వహణ కైంకర్యాలకే పరిమితమయ్యేవారు గానీ, ఆర్థిక వ్యవహారాలలో ఏమాత్రం ఆసక్తి కనపరిచేవారు కాదు. పైగా ఇంతకుముందే చెప్పుకున్నట్లుగా, వారి పాత్ర పాలకవర్గానికి, అర్చక గణాలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరించేంత వరకే పరిమితం. వారికి ఇతరత్రా విధులు అప్పగిస్తే జియ్యంగార్ల వ్యవస్థ యొక్క ముఖ్యోద్దేశం నెరవేరదు.

ఇలా ఆలయానికి సంబంధమున్న వారందరి సామర్థ్యాన్ని, వారివల్ల దేవాలయానికి, కంపెనీ వారికి కలిగే లాభనష్టాలను బేరీజు వేసిన తర్వాత బ్రిటిష్ వారి దృష్టి మహంతులపై పడింది. కొన్ని సానుకూలమైన అంశాలు వారికి సహకరించాయి.

* వీరు సుదూర ప్రాంతానికి చెందిన ఉత్తర భారతీయులు. స్థానికంగా బలము, బలగము లేనివారు. అలాంటివారికి అధికారం అప్పగిస్తే కంపెనీవారు పరోక్షంగా తమ పెత్తనాన్ని కొనసాగించవచ్చు.
* పైగా మఠానికి ప్రథమ మహంతు అయిన హాథీరామ్ బావాజీ పట్ల ఆలయ అధికారులకు, అర్చకులకు, జియ్యంగార్లకు, భక్తులకు ఇలా ఆలయంతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సంబంధం ఉన్న వారందరికీ బావాజీ పట్ల విశేషమైన గౌరవాభిమానాలు ఉన్నాయి. తదనంతర కాలంలో వారి శిష్యులు, అనుచరులు కూడా అదే రకమైన ఆదరాన్ని చూరగొన్నారు. కాబట్టి వారికి అధికారాన్ని అప్పగిస్తే, ఆలయంలోని ఇతర వర్గాల వారికి కూడా సమ్మతంగానే ఉంటుంది.
* అంతే కాకుండా మహంతు లందరూ సన్యాసాశ్రమం స్వీకరించినవారే కాబట్టి, అధికారం వారసులకు సంక్రమించే అవకాశం లేదు.
* మహంతులకు అప్పటికే విస్తృతంగా ధార్మిక కార్యకలాపాలు చేపట్టగలిగినటువంటి పటిష్ఠమైన వ్యవస్థ, అని హంగులతో కూడుకున్న సువిశాలమైన మఠం, ఆ మఠాన్ని ఎన్నో ఏళ్ళుగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నఅనుభవం, సమర్థత ఉన్నాయి.

ఈ విషయాలన్నింటినీ అంతర్గతంగా చర్చించుకున్న ఆంగ్లేయులు కొంత వారి స్వార్థాన్ని, మరికొంత ఆలయ బాగోగులను దృష్టిలో ఉంచుకొని, ఆలయ నిర్వహణ బాధ్యతను మహంతులకే అప్పజెప్పాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

బ్రిటిష్ వారు ఆలయ నిర్వహణ బాధ్యతను మహంతులకు అప్పజెప్పాలని తీర్మానించుకున్న అనంతరం చకచకా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**అధికారాల బదిలీ :** ఆ ఉత్తర్వుల ననుసరించి, 1843వ సంవత్సరం జూలై నెలలో మహంతు మఠానికి ఆ సమయంలో నేతృత్వం వహిస్తున్న 'మహంతు సేవాదాసు' గారు 'విచారణకర్త'గా నియమింపబడ్డారు. విచారణకర్త అంటే దాదాపుగా ఈనాటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తో సమానమన్నమాట. ఆలయ సక్రమ నిర్వహణకు, ఆర్థిక వ్యవహారాలకు ఆయనే జవాబుదారీ. ఈవిధంగా మహంతు మఠానికి విశేష అధికారాలు దఖలు పడ్డాయి. అదే నెల 16వ తేదీ నాడు, దక్షిణాయన సంక్రాంతి పర్వదినాన అప్పటివరకు ఆలయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఈస్టిండియా కంపెనీ వారి నుండి ఆలయానికి సంబంధించిన సమస్త స్థిర చరాస్తుల ధర్మకర్తృత్వం మహంతు సేవాదాసుకు బదిలీ చేయబడింది. శ్రీవారి ఆభరణాలు, వాహనాలు, వెండి బంగారు పాత్రలు, ఇతర కైంకర్య సామగ్రి, రొక్కం మొదలైనవన్నీ పలువురి సమక్షంలో వ్రాతపూర్వకంగా మహంతుకు అప్పజెప్పడం జరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జులై 16వ తేదీన జరిగే అణివార ఆస్థానం అనే సంవత్సరోత్సవం గురించి ఇంతకు మందే తెలుసుకున్నాం. ఈమధ్య కాలం వరకు ఆలయ ఆర్థిక సంవత్సరం ఆ దినం నుండే ప్రారంభమయ్యేది. అలా దేవాలయ పాలనా బాధ్యతలు చేపట్టిన బావాజీ శిష్యులైన మహంతులు, విష్వక్సేనముద్రను తమ అధికారిక ముద్రగా ఎన్నుకున్నారు. శ్రీవేంకటేశ్వరునికి సర్వ సైన్యాధిపత్యం వహించే విష్వక్సేనుడు వారికి అన్ని రకాలుగా దన్నుగా ఉంటాడని వారి విశ్వాసం.

**షరతులతో కూడిన బదిలీ :** అయితే యాజమాన్య మార్పిడి, కొన్ని షరతులకు లోబడి జరిగింది. అప్పటివరకు ఆలయమునందు అమలులో ఉన్న కైంకర్యాలలోను, వైఖానస ఆగమ పద్ధతుల్లోనూ ఏ విధమైన మార్పులు చేయరాదు. మనం ఇంతకుముందు చెప్పుకున్నట్టి, బ్రిటిష్ వారి హయాంలో రూపు దిద్దుకున్న అయిదు గ్రంథాలలో పేర్కొన్న విధి విధానాల ననుసరించే దేవాలయ నిర్వహణ అంతా జరగాలి. వంశ పారంపర్య అర్చకులకు, మిరాశీదార్లకు, ఆచార్యపురుషులకు, జియ్యంగార్లకు, అన్నమాచార్యులు మరియు తరిగొండ వేంగమాంబ వంశస్థులకు పరంపరాగతంగా లభించే ఆలయ మర్యాదల విషయంలో గాని, కానుకల విషయంలో గాని, ప్రసాదాల విషయంలో గాని ఏవిధమైన లోటుపాట్లు జరగరాదు. అవన్నీ యథాతథంగా కొనసాగవలసిందే.

మహంతుల ఆ ధ్వర్యంలో తొలి దశకాలలో నిధులకు విపరీతమైన కొరత ఉండేది. అయినప్పటికీ మహంతుల అంకిత భావం వల్ల ఉన్న అరకొర వనరులతోనే ఆలయ నిర్వహణ ఏ విధమైన ఒడిదుడుకులు లేకుండా, సజావుగా సాగిపోయేది.

ఆలయంలో అప్పటికే వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న హక్కుదారులు (అర్చకులు, ఆచార్యపురుషులు, జియ్యంగార్లు మొదలగువారు) అందరికీ, మహంతులకు ఏకపక్షంగా అధికారం దక్కటం అంతగా రుచించనప్పటికీ, వారిలో వారికి ఐకమత్యం లేకపోవడం వల్ల, కంపెనీ వారి నిర్ణయానికి ఎదురు చెప్పే ధైర్యం లేకపోవటం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో మహంతుల ఆధిపత్యాన్ని అంగీకరించడమే కాకుండా, వారికి దేవాలయ నిర్వహణలో అన్ని రకాలుగా సహకరించారు కూడా.

**మహంతుల కృషి:** దేవాలయానికి మొట్టమొదటి విచారణకర్తగా 1843వ సంవత్సరంలో బాధ్యతలు చేపట్టిన సేవాదాస్ జీ స్వామిపుష్కరిణిని పునరుద్ధరించి, అందులో వైభవోపేతంగా స్వామివారి తెప్పోత్సవం నిర్వహించే సాంప్రదాయానికి నాంది పలికారు. వీరి హయాంలో మహంతు వ్యవస్థ ఏ విధమైన ఆటుపోట్లకు గురికాకుండా, సజావుగా 21 సంవత్సరాలపాటు సాగిపోయింది.

వారి తదనంతరం 1864వ సంవత్సరంలో మహంతు ధర్మదాస్ జీ రెండవ విచారణకర్తగా నియమింపబడ్డారు. వీరు శేషాచల పర్వత పాదభాగంలో, తిరుపతి శివారులో ఉన్న కపిలతీర్థం పుష్కరిణికి, దానిచుట్టూ ఉన్న సంధ్యా వందన మంటపాలకు, మహాద్వార గోపురానికి మరమ్మత్తులు గావించి, కొత్త సొగసులు తీర్చిదిద్దారు. వీరి హయాంలో కొన్ని మంటపాల నిర్మాణం కూడా జరిగింది. వారి తరువాత భగవాన్ దాస్ జీ మూడవ విచారణకర్తగా బాధ్యతలు చేపట్టారు. వారి హయాం వివాదాలకు నెలవుగా మారింది. అప్పటివరకు అరకొర నిధులతో ఆలయ నిర్వహణను చేపట్టిన మహంతులు ఒక్కసారిగా ఆర్థిక వనరులను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టారు. సహజంగానే వైదిక కార్యక్రమాలు, ఇతర ధార్మిక కలాపాలపై శ్రద్ధ కొద్దిగా తగ్గింది. తత్ఫలితంగా అవసరానికంటే ఎక్కువగా నిధులు సమకూరాయి. కొన్ని దశాబ్దాల పాటు ఆలయ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంతో మహంతు వ్యవస్థ పట్ల భక్తులలో గౌరవాభిమానాలు ఇనుమడించాయి. దాంతోపాటుగా భక్తుల రద్దీ కూడా పెరగడంతో మహంతులు తమ విశేషాధికారాన్ని, ఆలయ వర్గాలలో తమకున్న పలుకుబడిని ఉపయోగించి, ప్రముఖులకు శీఘ్రంగా దర్శనం కలిగించటం మొదలు పెట్టారు. రాను రానూ ఆలయ సాధన సంపత్తులన్నింటికీ తాము తిరుగులేని పెత్తందార్లమన్న మితిమీరిన విశ్వాసం మహంతులలో నెలకొంది. నిధుల దుర్వినియోగం ఆరోపణలు కూడా వచ్చాయి. ఆలయ నిధులను తన సొంతానికి మళ్ళించుకున్న ఆరోపణపై అప్పటి న్యాయస్థానం మహంతుకు జరిమానా కూడా విధించింది. అంతేకాకుండా వారు ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ జరిపే సమయంలో, పాత ధ్వజస్తంభం యొక్క పాదపీఠం క్రింద ఉన్న నిధులను అపహరించారన్న అపవాదును మూటగట్టుకున్నారు. వీరి హయాంలోనే మహంతుల నివాసం ఇప్పుడు ప్రధానాలయానికి ఆగ్నేయ మూలలో ఉన్న, హంగు ఆర్భాటాలతో యాదవ రాజులు కట్టించిన మహంతు మఠానికి మారింది. అప్పటివరకు వైరాగ్య జీవితాన్ని గడిపిన మహంతులకు భిన్నంగా తరువాతి వారు మహంతు మఠంలో సర్వసౌఖ్యం అనుభవించారు. సర్వసంగ పరిత్యాగులకు సౌధాలెందుకన్న ప్రశ్న భక్తుల మదిలో మెదిలింది. అప్పటి మహంతుల అతిశయం ఎంతగా వెర్రితలలు వేసిందంటే తిరుమల యాత్రికులు ముందుగా మహంతులను దర్శించుకుని, కట్నకానుకలను సమర్పించుకున్న తర్వాతనే స్వామివారిని దర్శించుకునే సంప్రదాయానికి నాంది పలికారు. అప్పటివరకు ఏవిధమైన తరతమ భేదాలకు తావులేని ఆలయంలో జమీందారులకు, ధనికులకు, రాచకుటుంబీకులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. పరపతి గల వారికి త్వరితగతిన దర్శనాలు జరిగేవి. ఇవన్నీ ఒక ఎత్తయితే, అన్యమతస్తుల విషయంలో మహంతులు అవలంబించిన వైఖరి మరో ఎత్తు. అప్పటికి దాదాపు 100 సంవత్సరాల క్రితమే ఆంగ్లేయులు తిరుమల క్షేత్రం మరియు మీదకి హైందేవతరుల రాకపోకలపై కఠినమైన ఆంక్షలు విధించారు. దానికి భిన్నంగా ప్రస్తుత మహంతులు, యూరోపియన్ అధికారుల ప్రాపకం సంపాదించుకోవడం కోసం వారికి కొండపై ప్రత్యేకంగా వసతి సౌకర్యాలుకల్పించారు.సాంప్రదాయానికివిరుద్ధంగాదేవాలయ నిధులను, భూముల పూచీకత్తుపై కొంతమంది జమీందార్లకు రుణంగా ఇచ్చారు. అనేక రకాలైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు కాని వాటన్నింటిలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అపవాదును మూటగట్టుకున్నారు. కొన్ని మహమ్మదీయ సంస్థలకు విరాళాలిచ్చారు.

తరువాతి కాలంలో అధికారంలోకి వచ్చిన రామ్ కిషోర్ దాస్ జీ పై కూడా నిధులు దుర్వినియోగం ఆరోపణలు రావడంతో, న్యాయస్థానంలో విచారణ జరుగుతున్నపుడు ఆకస్మికంగా మరణించాడు. ఈవిధంగా మహంతుల నిర్వాకంపై వివిధ న్యాయస్థానాల్లో లెక్కలేనన్ని కేసులు నమోదు కావడంతో, 1898వ సంవత్సరంలో ఉత్తర ఆర్కాట్ జిల్లా ప్రధాన న్యాయస్థానం అప్పటి మహంతును కక్షిదారులైన జియ్యంగార్లు,

శ్రీవైష్ణవులు తిరుమలలో ఉన్న ఇతర మతాల వారిని పిలిచి సయోధ్య కుదిర్చారు. దాని ప్రకారం న్యాయస్థానం ఆలయ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడానికి ఐదుగురు సభ్యులతో ఒక ధర్మాసనాన్ని నియమించింది. దానిపై మహంతులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తరువాతి కాలంలో ఆలయ నిర్వహణపై మహంతులకున్న తిరుగులేని అధికారాలకు పరిమితులు విధిస్తూ న్యాయస్థానాలు అనేక తీర్పులిచ్చాయి. వాటన్నింటిపై మహంతులు ఎప్పటికప్పుడు హైకోర్టుల్లో పిటిషన్లు వేస్తూనే ఉన్నారు. చివరకు లండన్ లోని అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. అయినప్పటికీ మహంతులు తప్ప ఆలయంతో సంబంధం ఉన్న మిగిలిన వారందరూ ఒక వర్గంగా ఏర్పడటం వల్ల, మహంతులపై అధికార దుర్వినియోగం ఆరోపణలు రోజు రోజుకూ పెరుగుతుండటం వల్ల తరచూ వారికి న్యాయస్థానాల్లో ఎదురు దెబ్బలు తగులుతూం ఉండటమే కాకుండా, మహంతు వ్యవస్థ పట్ల తొలినాళ్ళలో భక్తులకున్న గౌరవాభిమానాలు క్రమంగా అంతరించిపోయాయి. ఆ విధంగా 1900 సంవత్సరం నాటికి మహంతుల ప్రభావం గణనీయంగా తగ్గింది.

**ఆఖరి మహంతు కృషి శ్లాఘనీయం :**

అయితే 1900 సంవత్సరం నుండి 1933 వరకు – 33 ఏళ్ళ పాటు – విచారణకర్తగా పనిచేసిన చిట్టచివరి విచారణకర్త ప్రయాగ్ దాస్ జీ హయాంలో మహంతు వ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. ఏ విధమైన ఆరోపణలకు తావులేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో ప్రతిష్ఠ ఇనుమడించింది. వారి హయాంలోనే ఎంతోకాలం నుండి పరిశీలన దశలోనే ఉన్న అలిపిరి మెట్ల పునర్నిర్మాణం జరిగి, భక్తులకు ఎంతో వెసులుబాటు కలిగింది. జీర్ణదశలో నున్న గాలిగోపురం మరమ్మత్తు గావించబడింది. ఆనందనిలయ గోపురంపై బంగారుమలాం పూత పూయబడింది. రహదారుల విస్తరణ, యాత్రికులకు త్రాగునీరు ఏర్పాటు, ధర్మసత్రాల నిర్మాణం జరిగింది. పరిశుభ్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి అనేక నిర్మాణాత్మక కార్యకలాపాలు చేపట్టబడ్డాయి. ఆలయంలో లభించిన అసంఖ్యాక శిలాశాసనాలపై సమగ్ర పరిశీలన జరిగి, విలువైన సమాచారం గ్రంథస్థం చేయబడింది. అన్నమాచార్య సంకీర్తనా భండారం వెలుగులోకి వచ్చి, దానిలో నుండి వెలువడ్డ రాగిరేకులలో లిఖించబడ్డ కీర్తనలను ప్రచురించే కార్యక్రమం అప్పుడే మొదలైంది. అనేక విద్యా, వైద్య సంస్థలకు వారి హయాంలోనే అంకురార్పణ జరిగింది. వేదపాఠశాల, ప్రాచ్యకళాశాల, ఆయుర్వేద కళాశాల ఆనాడు రూపుదిద్దుకున్న సంస్థలే. స్వామివారికి అనేక ఆభరణాలు కూడా తయారు చేయబడ్డాయి. ప్రయాగ్ దాస్ జీ 33 సంవత్సరాల పాటు మహంతుగా బాధ్యతలు నిర్వహించిన తరువాత, అంతకు ముందెప్పటి నుండో కోర్టులలో ఉన్న కేసులన్నీ ఒక కొలిక్కి రావడంతో, 1933వ సంవత్సరంలో అప్పటి మద్రాస్ గవర్నర్, దేవస్థానానికి ఒక ధర్మకర్తల మండలిని నియమించి, ఆలయాన్ని వారి అధీనంలోనికి తెచ్చారు.

ఈవిధంగా 1843వ సంవత్సరంలో మొదలైన మహంతుల పాలన, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, 1933 సంవత్సరం వరకు – అంటే 90 సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా కొనసాగి, ఆలయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. వారి పాలనపై ఎన్ని వివాదాలు నెలకొన్నప్పటికీ, స్థూలంగా ఆలయం అభివృద్ధి పథంలోనే పయనించింది. 1843వ సంవత్సరంలో కేవలం లక్ష రూపాయలుగా ఉన్న దేవాలయ వార్షిక ఆదాయం 1908వ సంవత్సరంలో సుమారు 4 లక్షలకు పెరిగింది. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తమే. అంతకుముందు అంతంత మాత్రంగానే ఉన్న దేవాలయ ఆర్థిక పరిస్థితి, 1933వ సంవత్సరం నాటికి బాగా వృద్ధి చెంది, మిగులుబాట పట్టింది. కొందరు మహంతులు స్వార్థబుద్ధితో వ్యవహరించారన్న అపవాదు ఉన్నప్పటికీ, మిగిలిన వారందరూ ఆలయ అభివృద్ధికి ఎంతో అంకితభావంతో కృషి చేశారు.

**ప్రస్తుతం మహంతుల పాత్ర :**

ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయించిన మహంతు వ్యవస్థ, కాలగమనంలో అనేక ఒడిదుడుకులకు లోనై, ప్రస్తుతం నామావశేషంగా, లాంఛనప్రాయంగా మిగిలింది. ప్రతిరోజు సుప్రభాత సమయంలో మహంతు మఠం నుండి అప్పుడే పితికిన ఆవుపాలు, వెన్న, పచ్చకర్పూర తాంబూలం ఆనందనిలయానికి చేరుతాయి. ఆ తాంబూల సమర్పణతోనే నవనీత హారతి పూర్తవుతుంది. సుప్రభాత పఠనం తరువాత మహంతులకు తీర్థం, చందనం, శఠారి వంటి ఆలయ మర్యాదలు కూడా జరుగుతాయి. స్వామివారికి జరిగే ఉగాది, శ్రీరామనవమి, ఆణివార, దీపావళి ఆస్థానాలలో, బ్రహ్మోత్సవాలలో మహంతులకు ఆలయ లాంఛనాలతో అనేక మర్యాదలు జరుగుతాయి.

ప్రస్తుతం మహంతు మఠం యొక్క శాఖలు తిరుమల, తిరుపతిలోనే కాకుండా, తిరుచానూరు, వేలూరు, చిత్తూరు, తంజావూరు, మధుర, అయోధ్య, ముంబాయి, నాసిక్, పంచవటి, భాగల్ కోట్ వంటి సమీప, సుదూర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. ఇవన్నీ ఇప్పటికీ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తూ, అనేక ధార్మిక కార్యకలాపాలు చేపడుతున్నాయి.



# నామం సైజు తగ్గిస్తే స్వామివారికి ఆగ్రహం వస్తుందా?

**– వెలమకన్ని పద్మావతి**

ప్రతి శుక్రవారం నాడు అభిషేకానంతరం తిరుమలలో మూలమూర్తికి ఊర్ధ్వ పుండ్రాలు సమర్పిస్తారు. వాడుక భాషలో నామాలు అలంకరణ అన్నమాట. దీనినే తిరుమణి కాప్పు అంటారు. వారంలో ఒకసారి అంటే శుక్రవార అభిషేకం పూర్తయిన తరువాత జరిగే ఈ నామాలంకరణను మళ్ళీ గురువారం మాత్రమే సడలిస్తారు. గురువారం నాడు నామాన్ని బాగా తగ్గించడం వల్ల శ్రీవారి నేత్రాలు పెద్దవిగా స్పష్టంగా కనబడతాయి. అందువల్లనే గురువారం "నేత్రదర్శనం" అవుతుంది.

అంటే గురువారం దర్శించుకొనే భక్తులకు, శుక్రవార అభిషేక సమయంలో దర్శించుకొనే భక్తులకు మాత్రమే నేత్ర దర్శన భాగ్యం లభిస్తుంది. అసలు శుక్రవారం నాడు సమర్పించే నామం సైజుని బాగా తగ్గించి వేస్తే ప్రతిరోజు భక్తులు అందరికీ స్వామివారి నేత్రదర్శనం లభిస్తుంది కదా అనే ఆలోచన చాలామంది భక్తుల విజ్ఞాపనల కారణంగా అప్పటి టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా పని చేసిన శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారికి వచ్చింది. వెంటనే అర్చక స్వాములకు తన ఆలోచనను చెప్పారు.

అది 1981వ సంవత్సరం అక్టోబర్ 8వ తేదీ. బ్రహ్మోత్సవాల చివరి రోజు. విజయదశమి. ఆ రోజు శ్రీవారి చక్రస్నానం. అర్చకస్వామి ఈవో గారి ఆలోచనను అనుసరించి స్వామివారికి చిన్నసైజు నామాన్ని తీర్చిదిద్దారు. అలా ఈవో గారి ఆలోచన కార్యరూపం దాల్చింది. అంతే! ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద రిజర్వ్ పోలీసు దళాలకు దేవస్థానం సిబ్బందికి మధ్య పెను వివాదం చెలరేగింది. ఆలయ మహాద్వారాలు మూసివేయబడ్డాయి. దర్శనం క్యూలు నిలిపి వేశారు. ఈవో గారి చొరవతో ఈ వివాదం సద్దు మణిగి, పరిస్థితి యథాస్థితికి రావడానికి రెండు మూడు గంటల కాలం పట్టింది. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని ఈవో గారికి చెప్పకుండానే మరునాటి నుండి స్వామివారి నామాన్ని అర్చకస్వాములు యథావిధిగా తీర్చి దిద్దారు. భక్తుల నుంచి మరల మరల నేత్ర దర్శనం గురించి విజ్ఞప్తులు వస్తూ ఉండడంతో 1982వ సంవత్సరంలో మరల అర్చక స్వామికి – "స్వామివారి కర్పూర నామం సన్నగా తీర్చిదిద్దండి. వారమంతా భక్తలందరికీ నేత్రదర్శన భాగ్యం కలగాలి" – అంటూ మరల నొక్కి వక్కాణించారు టిటిడి ఈవో గారు. అర్చకస్వామి ఆ శుక్రవారం నాడు స్వామివారికి సన్నటి నామం తీర్చదిద్ది, భక్తులందరికీ నేత్రదర్శన భాగ్యం కలిగించారు. అంతే! సన్నిధి వీధుల విస్తరణలో భాగంగా అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమాన్ని టిటిడి ఇంజనీరింగ్ విభాగం వారు ఆరోజే ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారి మీద ఆకస్మికంగా రాళ్ళదాడి ప్రారంభమయింది. అక్రమ కట్టడాలలో వ్యాపారాలు సాగిస్తున్న వర్తకులు హైకోర్టు ఉత్తర్వులకు ఎదురు తిరగలేక తమ అక్కసును ఈవో గారి మీద తీర్చుకోవాలని రాళ్ళదాడి ప్రారంభించారు. విజిలెన్స్ విభాగం – సెక్యూరిటీ విభాగం సిబ్బంది వచ్చి ఈవో గారిని రక్షక వలయం మధ్య, ఆలయం లోనికి తీసుకొని వచ్చి మహాద్వారం తలుపులు మూసివేశారు. దర్శనాలు నిలిపివేశారు. దాడికి పాల్పడ్డవారిని తరిమి కొట్టడానికి సెక్యూరిటీ సిబ్బంది గాలిలో కాల్పులు జరిపారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత కార్యక్రమం సజావుగా జరుగుతోందనీ, దాడులకు పాల్పడ్డవారు వెనుదిరిగి పోయారని నిర్ధారించుకొన్న తరువాత మహాద్వారం తలుపులు తెరిచారు. దర్శనాలు ప్రారంభించారు.

ఈ హఠాత్ సంఘటనతో ఆందోళన చెందిన ఈవో గారు స్వామివారి దర్శనం చేసుకుని ఉపశమనం పొందాలని గర్భగుడి దగ్గరకు వెళ్ళారు. "ఎందుకిలా జరిగింది స్వామీ?" అని స్వామిని ప్రశ్నించబోతున్న తరుణంలో స్వామివారి నామం అతి సన్నగాను, విప్పారిన నేత్రాలు మరింత విశాలంగానూ

కనిపించాయి. తను కోరుకున్నట్లుగానే జరిగింది కదా అనే ఆనందం ఆయన వదనంలోనూ కనిపించలేదు. ఆయన మనసులోనూ కలగలేదు. సరిగ్గా అదే సమయంలో సీనియర్ అర్చక మిరాసీ వారు ఈవో గారి దగ్గరకు వచ్చి నెమ్మదిగా ఇలా చెప్పారు – ''అయ్యా కొన్ని మాసాల క్రితం మీరు చెప్పారని స్వామివారికి సన్నని నామం తీర్చదిద్దాం. అలా చేసిన కొన్ని గంటల లోపే ఆలయ సిబ్బందికీ పోలీసులకీ మధ్య ఘర్షణ చెలరేగింది. మహాద్వారం తలుపులు మూసివేసి దర్శనాలు నిలిపి వేయవలసి వచ్చింది. అందుకే మీకు చెప్పకుండానే కర్పూర నామం సైజు తగ్గించే కార్యక్రమాన్ని మేం విరమించుకొన్నాం. మీరు ఆదేశించారని, ఇవాళ మళ్ళీ నామం సైజు తగ్గించాం. ఈసారి మీమీదే దాడి జరిగింది. మహాద్వారం తలుపులు మళ్ళీ మూసివేయవలసి వచ్చింది. దర్శనాలు నిలిపివేయవలసి వచ్చింది'' అన్నాడు. మౌనంగా అన్నీ విన్న ఈవో గారి ఆందోళన క్రమంగా తగ్గుముఖం పట్టింది. మర్నాటినుండి అర్చకులు స్వామివారి నామాన్ని యథావిధిగా తీర్చిదిద్దుతున్నారు. ఇంకెప్పుడూ ఈవో గారు స్వామివారి నామం గురించి అర్చకుల దగ్గర ప్రస్తావించలేదు. ఈ అనుభవాలను టిటిడి ఈవోగా పని చేసిన శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు ''సర్వసంభవామ్'' శీర్షికతో స్వాతి వారపత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడిన తన అనుభవాల మాలికలో ప్రస్తావించారు. నామం సైజు తగ్గించి సన్నని నామం సమర్పిస్తే స్వామివారికి ఆగ్రహం కలుగుతుందా? దుస్సంఘటనలు జరుగుతాయా? ఏమో!? ఈ అనుభవాలు ఇస్తున్న సందేశం అలాగే అనిపిస్తోంది.

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

**1.గుళ్ళో గంటలు ఎందుకు? వాటిని ఎప్పుడు మ్రోగించాలి?**

**– వసుంధర, బి.హెచ్.ఈ.ఎల్**

జవాబు: ఘంటానాదం భక్తిని పెంపొందిస్తుంది. గంటల గణగణ శబ్దం భక్తుల మనసుల్ని ప్రభావితం చేసి దివ్యానుభూతుల్ని కలిగిస్తుంది. అలాగే ఇది ఓంకారాన్ని స్ఫురింపచేస్తుంది. ఆ ఓంకారనాదం మనసును దైవంవైపు నడిపించి భక్తిభావంతో పాటు ఏకాగ్రతను పెంచుతుంది. ఇతర శబ్దాలు మన చెవిన పడకుండా చేస్తుంది. ఆరాధన క్రమంలో ఘంటారావానికి కొన్ని సమయాలు, సందర్భాలు ఉన్నాయి. అంతేకాని, మనం వచ్చినట్లుగా దైవానికి తెలిపే 'కాలింగ్ బెల్' కాదది. ఇష్టం వచ్చినట్టు ఇష్టం వచ్చిన వేళలో మ్రోగించరాదు. అక్కడ ఉండే పూజారి అనుమతితో, మంగళహారతి ఇచ్చేవేళలో, నైవేద్యం సమర్పించేటప్పుడు మ్రోగించాలి. అలాగే, అక్కడ జరిగే ప్రవచనాలు, వ్రతాలు వంటి ఇతర కార్యక్రమాలకు మనం చేసే ఘంటారావం ఏమాత్రమూ భంగం కలిగించరాదు. ఒక పద్ధతిలో, భక్తితో కర్ణపేయంగా, పరిమితంగా మ్రోగించడం అవసరం అని పెద్దలు చెప్తారు.

**2.దేవాలయంలో ప్రదక్షిణలు ఎందుకు చేయాలి? – ఉమ, సరిత – హైదరాబాద్**

జవాబు – మంచి ప్రశ్న. సూర్యుని చుట్టూ గ్రహాలు తిరుగుతున్నాయి. భూమి తన చుట్టూ తాను తిరుగతూ సూర్యుని చుట్టూ కూడా తిరుగుతున్నది. ప్రదక్షిణ చేయడం వల్ల మనలోని అహం నశిస్తుంది. దైవకృప లభిస్తుంది. భగవన్నామం జపిస్తూ, చేతులు జోడించి మెల్లగా కదులుతూ ప్రదక్షిణం చేయాలి.

నియమాలు : 1. కుడి వైపు నుండి ఎడమవైపుకు చేయాలి

2. గుడి గోడలకు దూరంగా ఉండాలి

3. ఇతరులతోను, ఫోను లోను మాట్లాడరాదు

4. లెక్కింపు అనేది ఆయా దేవతలను బట్టి, పెద్దల సూచనను, సమస్యను బట్టి కూడా ఉంటుంది.

మూడుసార్లు ప్రదక్షిణ చేయడంలో అంతరార్థం ఉంది. మొదటిది మన పాపాలను పోగొడుతుందని, రెండవది ఆయా దేవతామూర్తిని ఆరాధించే అధికారం ఇస్తుందని, మూడవది శుభములు కలిగిస్తుందని చెప్తారు. ఒక్కొక్క దైవం మరియు సంప్రదాయ భేదాల ననుసరించి ప్రదక్షిణల సంఖ్య మారుతుంది. గణేశునికి ఒకటి, సూర్యునికి రెండు, పరమేశ్వరునికి, తులసికి మూడు, స్త్రీ దేవతలు మరియు విష్ణువుకు నాలుగు, దేవాలయ ప్రాంగణంలోని మఱ్ఱిచెట్టుకు, గోమాతకు ఏడు చొప్పున ప్రదక్షిణలు చేయాలని అంటారు. ప్రదక్షిణ అయిన తర్వాతే మందిరంలోనికి ప్రవేశించవలయును.



# తిరుమల కొండ మీద చూడవలసిన ప్రదేశాలు

- మావూరు విజయలక్ష్మి

'తిరుమల ...'

నాలుగక్షరాల ఈ పదం పలకగానే... చెవిన పడగానే ఒక అలౌకిక భావం... ఒక అసాధారణ పులకింత కలగకుండా ఉంటుందా ఎవరికైనా...

శ్రీ వేంకటేశ్వరుడు కలియుగ దైవమయితే... తిరుమల కలియుగ వైకుంఠం. ఆ తిరుమల మాడవీధులలో నడయాడుతుంటే కలిగే ఆనందానుభూతులు ఇంకెక్కడా కలగవంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఆ స్వామి ఆలయానికి ఎదురుగా అఖిలాండం దగ్గర ఎత్తైన మెట్ల వరుసలో కూర్చొని ఆ మాడవీధులలో తిరుగాడే భక్తజనులను చూస్తూ ఉంటే ఇహలోకాన్నే మరచిపోవచ్చు. ఆ వైకుంఠంలో స్వామి సన్నిధిలో సంచరిస్తున్న అనుభూతి కలగకమానదు. తిరుమల అణువణువూ పవిత్రత తొణకిసలాడే ప్రదేశం. ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లే ఇక్కడి కొండలు, గుట్టలు, చెట్టు-పుట్ట, కొండ-కోన, సెలయేళ్ళు, జలపాతాలు, తీర్థాలు... ఏది చూసినా ఏదో ఒక పవిత్రతను, పురాణ కథనాన్ని ఆపాదించుకున్నవే.

చివరికి ఇక్కడ వీచే గాలి కూడా ఎన్నో భక్తిపూరిత కథలను మనకు వినిపిస్తుంది. ఈ పుణ్యభూమిలో నడయాడుతుంటే ఒకప్పుడు సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడు వేంకటేశ్వరునిగా నడయాడిన భూమిమీద అడుగుపెట్టామన్న అనుభూతితో శరీరం రోమాంచితమవుతుంది. ఇక్కడి గాలి అలా అలవోకగా మనల్ని స్పృశిస్తుంటే సాక్షాత్తూ ఆ శ్రీనివాసుని స్పర్శే దొరికినంత అనుభూతి కలుగుతుంది. అందుకేనేమో ఈ తిరుమల గిరులను చూడడంతోనే అన్నమయ్య గొంతునుంచి ఆ స్వామి శోభ ఆశువుగా, ఆనందంగా ప్రవాహంలాగా ఉబికివచ్చింది.

ఎంతోమంది పుణ్యచరితులకు తపోభూమి అయిన తిరుమల కొండల మీద అడుగు పెట్టగానే ఒడలు గగుర్పొడవక మానదు. ఆ కొండలరాయని కనులారా వీక్షించాలన్న తపనతో, ఆర్తితో నోరారా "గోవిందా... గోవిందా..." అంటూ ముందుకు సాగిపోతున్న భక్తజన సమూహాలను చూస్తూ ఉంటే, ఆ జనఘోషకు సప్తగిరులు కూడా "గోవిందా... గోవిందా..." అంటూ ప్రతిధ్వనిస్తుంటే, సాక్షాతూ వైకుంఠాన్ని దర్శిస్తున్న అనుభూతి కలగకుండా ఉంటుందా ఎవరికైనా!

అలాంటి భూలోక వైకుంఠం తిరుమలలో చూడవలసిన పవిత్ర స్థలాలు, తీర్థాలు ఎన్నో ఉన్నాయి. కాని ప్రస్తుతం మనం ఏం చేస్తున్నాం...ఎంతో హడావిడిగా వెళ్లి అంతే హడావిడిగా స్వామి మూర్తిని మాత్రమే దర్శించుకున్నామనిపించుకొని వెనుతిరుగుతున్నాం. ఈ నేపథ్యంలో అసలు తిరుమలలో

చూడదగిన... తప్పనిసరిగా చూడవలసిన ప్రదేశాల గురించి వాటి మహత్యాన్ని గురించి, అసలా ప్రదేశాలకు ఎలా వెళ్ళాలి? ఈ విషయాలు ఒకసారి చూద్దాం...

తిరుమలలో అడుగు పెట్టగానే ముందుగానే బుక్ చేసుకున్న రూమ్‌లోకి చేరుకొని కాస్త ఫ్రెష్ అయి మనకిచ్చిన టైం స్లాట్ ప్రకారం నేరుగా స్వామి దర్శనానికి బయలుదేరతాం. ఒకవేళ సర్వదర్శనానికి వెళ్ళాలి అంటే వెంటనే క్యూలైన్ల లోకి చేరిపోతాం. నిజానికి అలా నేరుగా శ్రీవారి దర్శనానికి వెళ్ళడం కూడని పని అని చెప్తారు పెద్దలు. శ్రీవారి దర్శనం కంటే ముందుగా మరో స్వామిని దర్శించుకొని వేంకటేశ్వరుని దర్శనానికి, ఆ స్వామి అనుమతి తీసుకొని అప్పుడు శ్రీవారి సన్నిధికి బయలుదేరాలి. ఆ స్వామే ఆదివరాహస్వామి.

మనం తిరుమల వెళ్ళగానే ముందుగా ఆదివరాహస్వామి ఆలయానికి వెళ్ళాలి. వరాహస్వామిని ముందుగా దర్శించుకోవాలి. ''వేంకటేశ్వరుని దర్శించుకుంటాను అనుమతినివ్వు'' అని వరాహస్వామిని కోరి అప్పుడు వేంకటేశ్వరుని దర్శనానికి వెళ్ళాలి. ఈ స్వామిని ఆది వరాహస్వామిగాను, యజ్ఞ వరాహస్వామిగాను, ప్రళయ వరాహస్వామిగాను కొలుచుకుంటారు భక్తులు. సరే...! మరి వేంకటేశ్వరుని దర్శనానికి వరాహస్వామి అనుమతి ఎందుకు తీసుకోవాలి... మరి ముందుగా వరాహస్వామిని ఎందుకు దర్శించుకోవాలి? ఈ కథనానికి వస్తే...


పూర్వం హిరణ్యాక్షుడు భూమిని అపహరించి సముద్రపు జలాల్లో దాగున్నాడు. దాంతో ఆందోళన చెందిన బ్రహ్మాది దేవతలు శ్రీమహావిష్ణువును ప్రార్థించగా స్వామి వరాహస్వామిగా అవతరించి హిరణ్యాక్షుడిని యుద్ధంలో సంహరించి భూమిని జలముల పైకి తీసుకువచ్చి నిలిపాడు. ఆ తరువాత వరాహస్వామి భూమి మీదే శేషాచలం కొండలలో కొంతకాలం సంచరించాడు. ఈ కొండలన్నీ వరాహస్వామి వారి ఆధీనంలోనే ఉండేవట. ఇక వైకుంఠం నుంచి శ్రీనివాసుడుగా భూమిమీద అడుగుపెట్టిన శ్రీమన్నారాయణుడు ఇక్కడ తొలిసారిగా వరాహస్వామిని కలుసుకున్నాడు. ఇద్దరూ శ్రీమన్నారాయణుని అవతారాలమేనని ఒకరినొకరు గుర్తించి కొంతకాలం ముచ్చటించుకున్నారు. అపుడు శ్రీనివాసుడు తాను కలియుగాంతం వరకు ఇక్కడే ఈ కొండలపైనే నివాసం ఉండదలచానని, కాబట్టి అక్కడ తనకు కొంత స్థలాన్ని ఇవ్వమని అడిగాడు. అప్పుడు వరాహస్వామి, 'అలాగే ఇస్తాను... అయితే దానికి కొంత మూల్యాన్ని ఇవ్వవలసి ఉంటుంది' అన్నాడు.

అప్పుడు శ్రీనివాసుడు, ఇప్పుడు నా దగ్గర శ్రీ అంటే ధనం లేదు కాని దానికి బదులుగా నా దగ్గరకు నా దర్శనార్థం వచ్చే భక్తులు ముందుగా నిన్ను దర్శించుకున్న తరువాతే నా దగ్గరకు వచ్చేలా ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేసాడు. అప్పుడు వంద అడుగుల స్థలాన్ని వరాహస్వామి శ్రీనివాసునికి ఇచ్చినట్టు దీనికి సంబంధించి శ్రీనివాసుడు వరాహస్వామికి ఒక ఒప్పంద పత్రాన్ని కూడా రాసిచ్చినట్టు పురాణ కథనాలు చెప్తున్నాయి. బ్రాహ్మీ లిపిని పోలిన అక్షరాలతో ఆ తామ్రపత్రం శ్రీనివాసుని మూలవిరాట్టు దగ్గర ఇప్పటికి కూడా ఉందని చెప్తారు. అలా శ్రీమన్నారాయణుని రెండు అవతారాలను ఒకే దగ్గర దర్శించుకునే అవకాశం మనకు తిరుమలలో లభిస్తుంది. వరాహస్వామి ఆలయం తూర్పు,ఉత్తర మాడ వీధులు కలిసే చోట ఈశాన్యంలో స్వామివారి పుష్కరిణిని ఆనుకొని ఉంటుంది. అలా మనం ముందుగా వరాహస్వామిని దర్శించుకొని శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి వెళతాం. ఎంతో ఆత్రంగా మనసు తనువూ ఒక్కటి చేసుకొని, ఒళ్ళంతా కళ్ళు చేసుకొని స్వామి వారిని దర్శించుకుని వస్తాం. అక్కడితో తిరుమల యాత్ర అయిపోలేదండి. కాస్త తీరిక చేసుకొని ఓపిక తెచ్చుకొని చూస్తే తిరుమలలో ఎన్నో పుణ్యస్థలాలున్నాయి. అయితే అన్నిటికీ అన్ని సమయాలలోనూ మనం వెళ్ళలేం. ఆ ప్రదేశాలకు సంవత్సరంలో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, ప్రత్యేక సమయాల్లో మాత్రమే వెళ్ళగలం. అయితే మనం నిరంతరం వెళ్ళగలిగే కొన్ని ప్రదేశాల గురించి ఓసారి చూద్దాం...

ఆ ప్రదేశాలు శేషాచలం కొండలలో అతి ఎత్తైన కొండ నారాయణ గిరి మీద శ్రీవారి పాదాలు, భౌగోళిక అద్భుత సహజ శిలాతోరణం, చక్రతీర్థం, ఆకాశగంగ, పాపనాశనం,జాబాలి తీర్థం, వేణుగోపాలస్వామి ఆలయం. వీటికి మనం ఎప్పుడూ వెళ్ళవచ్చు. ఈ ప్రదేశాలన్నీ ఒక్కరోజులోనే చూసి రావచ్చు. ఈ ప్రదేశాలకు వెళ్ళడానికి ఇక్కడ ఆర్.టి.సి. బస్సులుంటాయి. అలాగే ప్రయివేట్ వెహికల్స్ కూడా ఉంటాయి.

**ముందుగా శ్రీవారి పాదాల గురించి తెలుసుకుందాం...**

తిరుమల శ్రీవారి ఆలయానికి సుమారు 2 కి.మీ. దూరంలో 'నారాయణగిరి' ఉంది. ఈ నారాయణగిరి మీదే శ్రీవారి పాదం ఉంది. శ్రీవారి శ్రీపాద ముద్రలున్న శిలాఫలకం ఇక్కడే కనిపిస్తుంది. తిరుమల గిరులలో అత్యంత ఎత్తైన పర్వతం నారాయణగిరి. శ్రీ మహావిష్ణువు వైకుంఠం నుండి వేంకటాద్రికి ఈ తిరుమలకు వచ్చేప్పుడు మొదటి పాదాన్ని ఇక్కడ పెట్టాడని, రెండవ పాదాన్ని శిలాతోరణం దగ్గర పెట్టాడని, మూడవ పాదాన్ని ప్రస్తుతం ఆనందనిలయంలో స్వామివారు కొలువైన ప్రదేశంలో పెట్టాడనీ చెబుతారు. కోనేటిరాయుడు తిరుమల వెంకన్నను సామాన్య మానవులే కాదు బ్రహ్మాది దేవతలు కూడా పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. అలా స్వామిని సేవించడానికి వేంకటాచల క్షేత్రానికి బ్రహ్మాది దేవతలు వచ్చినపుడు నేరుగా



ఈ నారాయణగిరి మీద ఉన్న శ్రీవారి పాదాల దగ్గరకు చేరుకుని ముందుగా ఆ పాదపద్మాలను సేవిస్తారట.

ఎత్తైన ఈ నారాయణ గిరి పాదాల మండపం నుంచి చూస్తే తిరుమల లోయలు అత్యంత సుందరంగా దర్శనమిస్తాయి. కొండ సమీపం వరకు వాహనాలు వెళ్ళినా ఇంకా కాస్త దూరం ఎత్తుకు నడవవలసి ఉంటుంది. అలాగే శ్రీవారి పాదాల మండపం కూడా ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది. నిట్టనిలువుగా ఉన్న ఆ మెట్లు ఎక్కడం పెద్దవారికి కాస్త ప్రయాసతో కూడుకున్న పనే అని చెప్పాలి. ఈ ప్రదేశమంతా అద్భుతమైన ప్రకృతి సౌందర్యంతో ప్రశాంతతకు, పచ్చదనానికి మారుపేరుగా ఉంటుంది. ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది.

ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినం ఇక్కడ శ్రీపాద పూజ, ఛత్రస్థాపన ఉత్సవాలు జరుగుతాయి. శ్రీవారికి ప్రాతఃకాల, మధ్యాహ్నకాల ఆరాధన ముగిశాక అర్చకులు, ఏకాంగులు, అధికారులు, పరిచారకులు రెండు 'భూచక్ర' గొడుగులను, యమునోత్తరం నుండి పుష్పసరాలను, బంగారు బావితీర్థాన్ని సిద్ధం చేసుకొని మంగళవాద్యాలతో బయలుదేరుతారు. మేదరగట్టు వద్దకు చేరగానే వాద్యాలు నిలిపి నారాయణగిరి వైపు కదులుతారు. ఆ గిరి మీదున్న శిలాఫలకంలోని శ్రీ పాదలకు బంగారుబావి జలంతో అభిషేకం చేసి, హారతి, ఆరగింపులు నిర్వహిస్తారు. శ్రీవారి పాదాలున్న ప్రాంతంలోని చెట్లకు 'భూచక్ర గొడుగులను' కట్టి వెనుకకు తిరుగుతారు.

నారాయణ గిరి శ్రీవారి పాదాల నుంచి వెనకకు వస్తే ముందుగా మనకు శిలాతోరణం కనబడుతుంది. శ్రీవారి ఆలయానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉంటుంది ఈ శిలాతోరణం. మానవ ప్రమేయం లేకుండా సహజంగా ఏర్పడిన సహజ శిలాతోరణం ఇది. వేంకటేశ్వరస్వామి వైకుంఠం నుంచి భూమ్మీది కొస్తున్నపుడు మొదటి అడుగు నారాయణ గిరి మీద వేస్తే రెండవ అడుగు ఇక్కడే వేశాడని చెప్తారు. ఈ శిలాతోరణం మీద ఎవ్వరూ చెక్కకుండానే సహజంగా ఏర్పడిన శంఖం, చక్రం, స్వామివారి వరదహస్తం, కటిహస్తం, పాదాలు, గరుడపక్షి, నాగాభరణం కూడా చూడొచ్చు. భౌగోళికంగాను, ఆధ్యాత్మికపరంగానూ కూడా అత్యంత ప్రాధాన్యతను కలిగిన ఈ సహజశిలాతోరణం కొన్ని వందల కోట్ల సంవత్సరాల వయసు కలిగినదని పురాతత్వ శాస్త్రజ్ఞుల అంచనా. ఇలా సహజసిద్ధంగా ఏర్పడిన శిలాతోరణాలు ప్రపంచలో మూడే మూడు ఉంటే అందులో ఇది ఒకటని చెప్తారు భౌగోళిక శాస్త్రవేత్తలు. ఒకప్పుడు కేవలం శిలాతోరణం మాత్రమే ఉండేది. ప్రస్తుతం మాత్రం వివిధ రకాల పక్షులతో, పర్యాటకులు సేదతీరడానికి రాతి సోఫాల్లాంటి అమరికలతో చూడ చక్కని పూదోటలతో అద్భుతమైన పర్యాటక ప్రదేశంగా అలరారుతోంది. ఇక్కడ ప్రకృతి అద్భుతం శిలాతోరణం ఒక ఎత్తయితే ఈ ప్రదేశంలో కట్టిన దేవీ, దేవతల కట్టడాలు.. పూదోటల సోయగాలు... ఎవరో పనికట్టుకొని అమర్చినట్టుండే కొండలు, శిలలు మరో ఎత్తు. చూసి తీరవలసిందే తప్ప మాటలు చాలవు!

శిలాతోరణంకి సమీపంలోనే ఉంటుంది చక్రతీర్థం. ఇక్కడ కూడా చాలా మెట్లుంటాయి. ముందు కొంచెం ఎత్తుకు మెట్లెక్కి అక్కడి నుంచి మళ్ళీ డౌన్ లోకి మెట్లు దిగి వెళ్ళవలసి ఉంటుంది. ఇంత దూరం నడవడం కాస్త ప్రయాసతో కూడుకున్నదైనా ఆ ప్రదేశానికున్న మహిమాన్విత ప్రశాంతత ఆ ప్రయాసనంతటిని పక్కకు తోసేస్తుంది. సరే... ఇక చక్రతీర్థం వెనకున్న కథనం చూద్దాం....

పూర్వం ఒక రాక్షసుని బారిన పడి ఇక్కట్లనుభవిస్తున్న తన భక్తుని రక్షించేందుకు బయలుదేరాడు దుష్టశిక్షణ శిష్టరక్షణే ధ్యేయంగా ఉన్న శ్రీమన్నారాయణుడు. రాక్షస వధానంతరం స్వామి తన చక్రాయుధాన్ని శుభ్రంచేస్తుండగా అది చేజారి కింద ప్రస్తుతం చక్రతీర్థం ఉన్న ప్రదేశంలో పడిందట. అలా పడిన ప్రదేశంలో ఒక తీర్థం ఏర్పడి అదే చక్రతీర్థంగా ప్రసిద్ధి చెందిందని పురాణ కథనం. ఇంకో కథనం ప్రకారం మహాభారత యుద్ధం ముగిసిన తరువాత శ్రీహరి చక్రం మహాపాతకాలకు గురయిందని అందువలన ఈ తీర్థంలో చక్రాన్ని స్నానం చేయించారని అందుకే ఇది చక్రతీర్థమైందని చెప్తారు. ఇందులో స్నానమాచరించిన వారికి బ్రహ్మహత్య, శిశుహత్య దోషాలు

తొలగి పవిత్రుల వుతారని చెప్తారు. పాపాలను హరించడమే కాదు భూత, ప్రేత, పిశాచబాధలు తొలగిపోతాయని కూడా ఒక నమ్మకం. తులామాసంలో శుక్ల ద్వాదశినాడు ఈ తీర్థానికి తీర్థపర్వం జరుగుతుంది. ఈ మూడు ప్రదేశాలు అంటే శ్రీవారి పాదాలు, శిలాతోరణం, చక్రతీర్థం ఒకవైపు ఉంటే అక్కడినుంచి మళ్ళీ వెనక్కి వచ్చి మరో దిశగా వెళితే మరికొన్ని మహిమాన్విత ప్రదేశాలు చూడొచ్చు.

ఇక తిరుమల కొండమీద చూడవలసిన మరో ముఖ్యమైన ప్రదేశం పాపనాశనం. పేరుకు తగినట్టు ఎంతటి పాపాన్నయినా వినాశనం చేసే తీర్థరాజంగా చెప్తున్నాయి పురాణాలు. ఆశ్వయుజ మాసంలో శుక్ల సప్తమి రోజున ఉత్తరాషాఢ నక్షత్రం ఉన్న ఆదివారం ఇక్కడ స్నానమాచరించినట్టయితే అమోఘమైన పుణ్యఫలితాలు లభిస్తాయని చెప్తారు. బ్రహ్మపురాణ, వరాహపురాణం లో ఈ తీర్థ మహత్యాన్ని వర్ణించారు. సకల దారిద్ర్యాలను పోగొట్టే తీర్థం ఈ పాపవినాశనం లేదా పాపనాశన తీర్థం. ఈ తీర్థం నుంచే జలాన్ని తీసుకువచ్చి స్వామికి అభిషేకం



చేసేవారట వేంకటేశ్వరుని పరమభక్తుడు తిరుమలనంబి. ఇక్కడి ఆలయంలో గంగమ్మ తల్లి దర్శనమిస్తుంది. ఇక్కడి పరిసరాలన్నీ చూస్తుంటే ఎంతసేపున్నా తనివితీరదనిపిస్తుంది. ఇక్కడి నుంచి చూస్తే తిరుమల లోయలు అత్యంత సుందరంగా కనిపిస్తాయి.

ఇక ఇక్కడి నుంచి వెనక్కి వస్తే ఆకాశగంగ తీర్థం వస్తుంది. ఇక్కడ కూడా చాల మెట్లు ఎక్కి అక్కడినుంచి మళ్ళీ లోయలోకి మెట్లు దిగడం... ఇలా ఉంటుంది. సహజంగానే ప్రతి తీర్థంలోను ఉన్నట్టే బాట కిరువైపులా రంగు రంగుల పూసలదండలు, గాజులు, పూజాసామగ్రి, తినుబండారాలు అమ్మే దుకాణాలు సాదరంగా స్వాగతం చెప్తాయి. వాటి మధ్యనుంచి వెళుతుంటే ఎంత ఆహ్లాదంగా ఉంటుందో...! అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి మరో పేరు ఆకాశగంగ తీర్థం. అంబరాన్ని చుంబించే వృక్షాలతో, గిరుల మధ్యనుంచి



ఎగిరి దుమికే జలధారలతో, వివిధరకాల పూలమొక్కలు, సెలయేళ్ళతో భూలోక స్వర్గంగా విరాజిల్లుతూ ఉంటుంది. ఇక్కడే పన్నెండేళ్ళపాటు ఆంజనేయుని తల్లి అంజనాదేవి తపస్సు చేసిందట.


ప్రతిరోజూ ఈ ఆకాశగంగ తీర్థం నుంచే తిరుమలనంబి వంశస్తులు మూడు వెండి పాత్రలతో జలాన్ని తీసుకువెళ్ళి స్వామికి అభిషేకించడం సంప్రదాయంగా వస్తోంది. స్వయంగా శ్రీ వేంకటేశ్వరస్వామే ఈ ఆకాశగంగను గూర్చి తిరుమలనంబికి చెప్పి ఆ జలంతోనే తనకు అభిషేకం చెయ్యమని ఆదేశించారట. తిరుమలనంబి వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎంతో దూరంలో ఉన్న పాపనాశనం నుంచి జలాన్ని తెచ్చి అభిషేకం చేసేవారట. ముసలి వయసులో అంత కష్టపడుతున్న తిరుమలనంబిని చూసి శ్రీనివాసునికి జాలి కలిగింది. వెంటనే ఒక కిరాతబాలుని రూపంలో వచ్చి తిరుమలనంబిని, "తాతా నాకు దాహంగా ఉంది నీరివ్వు" అని అడిగాడు. కాని ''ఇవి స్వామివారి కైంకర్యానికి తీసుకువెళుతున్న జలం ఇవి నీకు ఇవ్వడానికి వీలు లేదు'' అని చెప్పి ముందుకు సాగిపోయాడు తిరుమలనంబి.

అయితే స్వామివారు వెనకనుంచి ఆ కుండకు చిల్లు పెట్టి ధారగా కారుతున్న నీటిని తాగారట. ఇది చూసిన తిరుమలనంబి "అయ్యో! ఎంత పని చేసావు. స్వామి వారి అభిషేకానికి ఆలస్యమవుతుంది. మళ్ళీ అంత దూరంలో ఉన్న పాపనాశనం తీర్థానికి వెళ్ళి నీళ్ళు తేవాలి" అని కంగారుగా వెళ్ళబోయాడు తిరుమలనంబి. అప్పుడా బాలుడు "తాతా!

అంత దూరం ఎందుకు? ఇక్కడే నీకు నీరు ఇస్తాను చూడు" అంటూ అక్కడ ఉన్న అంజనాద్రి కొండను బాణంతో కొట్టగానే ఆకాశగంగ కొండను ఛేదించుకుని రావడం మొదలుపెట్టింది. దాంతో స్వామిని గుర్తించిన తిరుమలనంబి, "నిన్ను గుర్తించలేని నా తప్పును మన్నించమని" పరిపరి విధాల కీర్తించసాగాడు. వెంటనే వేంకటేశ్వరుడు తన నిజరూపంతో ప్రత్యక్షమై ఇకనుంచి తన అభిషేకానికి అంత దూరం నుంచి నీరు తేవలసిన అవసరం లేదని, ఈ ఆకాశగంగ నుంచే జలాన్ని తీసుకువచ్చి నాకు అభిషేకం చేయమని చెప్పాడట. అప్పటినుంచి ఆకాశగంగ తీర్థంతోనే స్వామికి అభిషేకం చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఆకాశగంగ మహత్యాన్ని గురించి వరాహ, పద్మ, స్కంద పురాణాలలో ప్రస్తావించబడింది.

ఇక ఆకాశగంగ నుంచి కొంచెం వెనక్కి వస్తే జాబాలి లేక జపాలి వస్తుంది. నిజానికి ఇది దట్టమైన అటవీప్రాంతం. అందుకే ఇక్కడికి బాగా వేళ ఉన్నపుడే వెళ్లి రావాలి. ఎందుకంటే జపాలి దగ్గర మనం బస్ దిగి లోనికి వెళ్ళడం మొదలుపెడితే బాటకిరువైపులా దట్టమైన అడవి. మనం వేళ ఉండగా వెళితే మనతో పాటు వచ్చే యాత్రికులుంటారు. కాస్త సంధ్య వాలినా వాళ్ళు కూడా ఉండరు. సూది కింద పడితే వినపడే భయంకరమైన నిశ్శబ్దం.... చిమ్మ చీకటి.... కాస్త భయం కలిగించేదిగా కాస్త అని కూడా కాదు బాగానే భయంకలిగేలా ఉంటాయి. కాస్త పొద్దు వాలిందంటే చాలా భయంగా ఉంటుంది ఇక్కడి పరిస్థితి. ఏదో తెలియని భీతి మనసును తొలిచేస్తుంది. సరే ఎలాగో భయపడుతూ, పడుతూ లేస్తూ ఆంజనేయస్వామిని దర్శించుకొని ఆ లోయ నుంచి బయటకు వచ్చినా అటు వైపు ఏ బస్సులు వాహనాలు రావు. ఎవరో సొంత వాహనాలు తప్ప. చిమ్మచీకటి... భయంకరమైన నిశ్శబ్దం... గుండెల్ని మెలిపెట్టే భయం... ఇక వెనక్కి రాలేక ముందుకు వెళ్ళలేక అక్కడ ఉండలేక ఏం చెయ్యాలో అర్థం కాక భయంతో గజగజలాడాలి. అందుకే బాగా వేళ ఉన్నపుడే వెళ్లి రావాలి. ఇదంతా నాణానికి ఒకవైపు! కాని వేళపట్టున వెళితే మాత్రం ఇంత అద్భుతమైన, ఆహ్లాదకరమైన ప్రదేశం మరొకటి ఉండదు అనిపిస్తుంది. ప్రకృతిపరంగా గాని ఆధ్యాత్మికపరంగా గాని ఒక అద్భుతమైన... ఆహ్లాదకరమైన... ఆస్వాదించగల ప్రదేశమని గట్టిగా చెప్పొచ్చు. ఎంతో మహిమాన్వితమైన ప్రదేశం... అద్భుతమైన ప్రదేశం ఈ జాబాలి ప్రదేశం.

సరే ఇక ఇప్పుడు ఈ జాబాలి లేదా జపాలి విశిష్టత గురించి తెలుసుకుందాం... తిరుమలలో తప్పక చూడవలసిన ప్రదేశాలలో ఒకటి జపాలి. కొన్ని కథనాల ప్రకారం ఈ ప్రదేశం ఆంజనేయుని జన్మస్థలం అని చెప్తారు. ఆంజనేయుని తల్లి



అంజనాదేవి ఇక్కడే తపస్సు చేసి ఆంజనేయుని పుత్రునిగా పొందిందని చెప్తారు. ఆంజనేయుడు కూడా ఇక్కడ తపస్సు చేసారని పురాణ కథనాలు చెప్తున్నాయి. సీతా,రామ,లక్ష్మణులు, ఆంజనేయుడు కొంతకాలం ఇక్కడ ఉన్నట్టు చెప్తారు. వరాహ పురాణం, స్కంద పురాణంలోను ఈ జాబాలి తీర్థం ప్రస్తావన ఉన్నట్టు చెప్తారు. ఇది తిరుమల ఆలయానికి వాయవ్య దిశలో ఉంటుంది. జాబాలి మహర్షి ఇక్కడ తపస్సు చేసి స్వామి అనుగ్రహాన్ని పొందిన కారణంగా ఈ తీర్థానికి "జాబాలి తీర్థం" అని పేరు వచ్చినట్టు చెప్తారు. ఈ తీర్థంలో స్నానం చేస్తే భూత, ప్రేత, పిశాచ బాధలు తొలగిపోతాయని నమ్మకం.




ఇక అక్కడినుంచి వెనక్కి అంటే తిరుమల వైపుగా వస్తే ఆ మధ్యలో ఉంటుంది వేణుగోపాలస్వామి ఆలయం. ఇక్కడ ఈ ఆలయాన్ని పాచికలాటలో వేంకటేశ్వరుడినే ఓడించిన శ్రీవారి పరమభక్తుడు హథీరాం బాబా నిర్మింపచేసినట్టు చెప్తారు. ఇక్కడ శ్రీవేణుగోపాలస్వామిని ఏర్పాటు చేసుకొని ప్రతినిత్యం స్వామికి పూజలు చేస్తూ ఆరాధించేవారట హథీరాం బాబా. అలా కొన్నేళ్ళు వేణుగోపాలుడ్ని ఆరాధించి అక్కడే సజీవసమాధి పొందారు బాబా. ఆ ఆలయాన్ని దర్శించిన తరువాత అక్కడ బస్ ఎక్కితే తిరిగి తిరుమల చేరుతాం.

ఇవి తిరుమల క్షేత్రంలో ముఖ్యంగా దర్శించవలసిన, ఒక ప్రత్యేక దినాలలోనే కాకుండా ఎప్పుడూ మనం దర్శించుకోగలిగిన పుణ్యస్థలాలు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మికంగా ఖర్చులు అవుతాయి. బంధుమిత్రులతో అనుకోని విధంగా మాట పట్టింపులు వస్తాయి. అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వాహనాల్లో ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్త. బయటకు వెళ్లేటప్పుడు శకునం చూసుకొని బయలుదేర వలయును. నవగ్రహ ప్రదక్షిణలు చేయుట మంచిది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు వారు అనుకున్న పనులు చాలా తొందరగా పూర్తవుతాయి. మంచిని తీసుకొని, చెడుకు దూరంగా ఉండండి. అకస్మిక ధన లాభం కలుగును. అమ్మవారిని పూజించగలరు. దసరా పూజలలో చాలా సంతోషంగా ఉంటారు.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలమైన రోజులు. ఆగిపోయిన పనులు, ఎప్పడి నుంచో రావాల్సిన బాకీలు వసూలు అయ్యేందుకు అవకాశం ఉంది. వారిపై ఒత్తిడి చేయండి. అకస్మిక ధన లాభం ఉంది. జాయింట్ వ్యాపారాలు కలిసిరావు. దుర్గమ్మకు పూజలు చేయండి. కార్యసిద్ధి ఉన్నది. అఖండ దీపారాధన చేయండి. అమ్మవారిని అలంకరించి పూజలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. అమ్మవారి పూజల వల్ల విపత్తులు తొలగిపోవును. మీరు చేసే వ్యాపార వృత్తుల్లో ఉన్నవారికి విజయం ఉండాలి అంటే అమ్మ రక్షణ కావాలి. పితృదేవతల ఆశీర్వ బలం కావాలి. మనో నిగ్రహం ఉంటుంది.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు సామరస్య ధోరణితో విజయం సాధించగలరు. వృత్తి వ్యాపారుల్లో పూర్తి అనుకూలంగా ఉంది. అకస్మిక ధన లాభం ఉంటుంది. అధికారులతో చాలా మెలుకువగా ఉండాలి. విజయం మీ వెంటే ఉంటుంది. తొందరపాటు జరిగితే పరిస్థితులు మీకు అందుబాటులో ఉండవు. అన్నవరం శ్రీసత్య దేవుడి వ్రతం ఆచరించండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. దసరా పండుగ సందర్భంగా సాక్షిగా అమ్మ దుర్గా మాతను అనునిత్యం పారాయణం చేయండి. ఓం శ్రీమాతేశ్వరాయనమ: లేక మీ ఇష్టదైవ నామాన్ని జపించండి. కుసుమ నూనెతో దీపారాధన కొంతవరకు శాంతినిస్తుంది. ఆందోళన ఉంటుంది. బంధుమిత్రులతో జాగ్రత్తగా ఉండండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అవరోధాలు ఎదురవుతాయి. నవగ్రహ ఆరాధనతో పాటు ప్రతి రోజు ఆదిత్య హృదయ పారాయణం చేయాలి. సుబ్రమణ్యేశ్వర స్వామి ఆరాధన వల్ల రాబోయే ఉపద్రవాలు ఆగిపోగలవు. మీరు నమ్మినప్పుడు ఫలితం పక్కనే ఉంటుంది. మీకున్న పనులు నెరవేరుటకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురుకావు.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. నేర్పుగా, ఓర్పుగా చాకచక్యంగా వ్యవహరించాలి. రాహు కేతువులకు పూజలు, గ్రామ దేవతలకు పూజలు చేస్తే, ప్రతి విషయంలో సత్ఫలితాలు కనిపించగలవు. దుర్గా దేవి పూజలు చేస్తే శాంతి సౌఖ్యంతో ఉంటారు.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామరస్య ధోరణి వల్ల కొత్త వ్యక్తులు పరిచయం అవుతారు. వీరి వల్ల కొంత ఉత్సాహంగా ఉంటారు. ఎవరికీ హామీగా ఉండొద్దు. అమ్మవారి పూజలు చేయడం వల్ల సంతృప్తిగా ఉంటారు. నమ్మకంతో ఏదైనా పని మొదలుపెట్టినప్పుడు చకచకా జరుగును.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మిక ధనలాభం ఉన్నది. దసరా నవరాత్రుల్లో అమ్మవారిని ఆరాధించండి. పెండింగ్‌లో ఉన్న ప్రతి పని నెరవేరుతుంది. రాజీ మార్గంతో కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆలోచన చేయండి.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని రకాల సమస్యలు రాగలవు. ఆ దుర్గా దేవి పూజలు చేయడం వలన సమస్యలు వచ్చినా అవి పరిష్కారం అవుతాయి. కోపాలకు ఇది సమయం కాదు. ప్రతి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం తగవు. సుదర్శన హోమం చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆదాయ వనరులు ఉన్నాయి. అలాగే ఖర్చులు కూడా ఉన్నాయి. చాలా ఆలోచన చేసి వివాహ ప్రయత్నాలు ముందడుగు వేయాలి. జాతకరీత్యా వధువరులను సంప్రదించకుండా వివాహం చేయరాదు. మీరు తీసుకున్న జాగ్రత్తలే మీకు ఆనందాన్ని ఇస్తాయి. దైవారాధన చేయడం మంచిది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. షట్చక్రాలలో సంచరించే శ్రీమాతను ఏమంటారు?
2. దశావతార వ్రతం ఎప్పుడు ఆచరించాలి?
3. నదీ ప్రవాహానికి ఎదురీది ఒడ్డుకు చేరిన గ్రంథాలు ఎవరివి?
4. తొండ రూపంలో ఉన్న రాజుని ఉద్ధరించినదెవరు?
5. పాతాళ లోకంలోని గంగానది పేరేమిటి?
6. దేవదత్తుని కొడుకు ఎవరు?
7. కబంధుడు పూర్వజన్మలో ఎవరు?
8. ఉతథునికి మరో పేరు ఏమిటి?
9. మునిసేవ చేసి దివ్యర్షి అయినది ఎవరు?
10. వరాహస్వామి ఎక్కడ నిలిచాడు?
11. శ్రీ స్వామివారిని "తిండి మెండయ్య" అని అన్నదెవరు?
12. శ్రీవారికిచ్చే నివేదనలోని ఓడు అనే పాత్రకు అర్థం ఏమిటి?
13. హాథీరాం బాబాజీకి పూర్వనామం ఏది?
14. గురువాయూర్ ఆస్థానంలో భక్తి ప్రపత్తులతో సేవ చేసిన ఏనుగు పేరేమిటి?
15. శమీ – అంటే ఏమిటి?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

పేరు: ______
చిరునామా: ______
______
______
______
పిన్‌కోడ్: ______
ఫోన్: ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. సాందీపని, 2. లిఖితుడు, 3. పద్మసాలెవారు, 4. భవిష్యత్తు గురించి ముందుగానే ఆలోచించి జాగ్రత్త పడేవాడు, 5.తాళ్ళపాక చిన్నన్న, 6. బాహుదా నది, 7. నారాయణ మంత్రం, 8. 'విందె' అనే ముహూర్త సమయంలో, 9. ధూమకేతువు, 10. వింధ్యావళి, 11. అభయానంద్ స్వామీజీ, 12. అనంతాళ్వాన్, 13. ఉత్తానపాదుడు, 14. భాద్రపద శుక్ల చతుర్దశి నాడు, 15. సుతలం

## సరైన సమాధానాలు రాసినవారు

1. పి. యశోద, 2. వనమాల రామలింగాచారి, 3. చింతలపాటి శివశంకరశాస్త్రి, 4. సి.హెచ్.బి.యస్. కృష్ణకిషోర్, 5. రామచంద్రారెడ్డి, 6. హేమలత

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**పి. యశోద**



Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక



**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq